www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 9-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 251
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ. 8.03 తదుపరి నవమి తె. 6.01; నక్షత్రం: పూర్వాభాద్ర మ. 2.56 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా.11.57-1.27; దుర్ముహూర్తం: మ.12.29-1.13, మ.2.41-3.25; అమృతఘడియలు: ఉ.7.18-8.49; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 5.37
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శభాష్.. గుకేశ్

- 11వ రౌండ్‌లో డింగ్‌పై గెలుపు
- ఆధిక్యంలో భారత స్టార్

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షి‌ప్‌లో జగజ్జేత డింగ్ లిరెన్ (చైనా)కు భారత యువ జీఎం గుకేశ్ మరోసారి షాకిచ్చాడు. ఆదివారం ముగిసిన 11వ రౌండ్‌లో గుకేశ్ తెల్లపావులతో బరిలోకి దిగాడు. హైపర్‌మోడ్రన్‌గా పిలవబడే రెటీ ఓపెనింగ్‌తో ఆటను ప్రారంభించిన గుకేశ్ 29వ ఎత్తులో డింగ్‌కు చెక్ చెప్పి, ఏడు వరుస డ్రాల తర్వాత విజయాన్ని సాధించాడు. ఈ రౌండ్‌ను దూకుడుగా ప్రారంభించిన గుకేశ్ తొలి ఐదు ఎత్తుల్లోనే పట్టు సాధించాడు. దాదాపు గంట పాటు జరిగిన ఈ రౌండ్లో డింగ్ పుంజుకోవడానికి గుకేశ్ అవకాశం ఇవ్వలేదు. ఒత్తిడిలో డింగ్ చేసిన తప్పిదాలు కూడా గుకేశ్‌కు కలిసొచ్చాయి. ఈ 14 రౌండ్ల చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో మరో మూడు గేమ్‌లు మిగిలుండగా ప్రస్తుతం గుకేశ్ 6-5తో ప్రత్యర్థి డింగ్‌పై ఒక్క పాయింట్ ఆధిక్యంలో నిలిచాడు. ఈ మెగా ఫైనల్ తొలి గేమ్‌లో డింగ్ నెగ్గగా, 3, 11 రౌండ్లలో గుకేశ్ గెలిచాడు. మిగిలిన రౌండ్లన్నీ డ్రాగా ముగిశాయి.

ఆదివారం...ప్
మనకు కలిసిరాని రోజు

భారత క్రికెట్‌కు ఆదివారం (8వ తేదీ) చేదు జ్ఞాపకాన్ని మిగిల్చిన రోజు. ఎందుకంటే ఒకేరోజు మూడు పరాభవాలు ఎదురయ్యాయి. అవన్నీ క్రికెట్‌లోనే. అటు సీనియర్ పురుషులు, మహిళల జట్టు ఓటమిపాలవగా.. ఇటు అండర్-19 పురుషుల ఆసియా కప్‌లో జూనియర్ జట్టుకూ నిరాశ తప్పలేదు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా పింక్‌బాల్ టెస్టులో ప్రత్యర్థి ఆస్ట్రేలియా చేతిలో రోహిత్ సేన దారుణంగా చిత్తవగా.. ఆసీస్‌కే చెందిన మహిళల జట్టు హర్మన్‌ప్రీత్ సేనపై గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. ఇక, అండర్-19 ఆసియా కప్‌లో ఫేవరెట్ అనుకున్న యువ భారత్‌కు బంగ్లాదేశ్ ఝలకిచ్చి ట్రోఫీని అందుకుంది. ఇలా ఒకేరోజు మూడు ఓటములతో భారత క్రికెట్ అభిమాని ఆవేదనకు అంతు లేకుండా పోయింది.

అమ్మాయిలకూ నిరాశే

- రెండో వన్డేలోనూ భారత్ ఓటమి

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళల జట్టు ఆదివారం జరిగిన రెండో వన్డేలో 122 పరుగుల భారీ తేడాతో ఓటమి చవిచూసింది. ఫలితంగా ఆసీస్ 2-0తో మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్.. వోల్ (101), ఎలిస్ పెర్రీ (105) సెంచరీలతో కదం తొక్కడంతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 371 పరుగులు చేసింది. భారత బౌలర్లలో సైమా ఠాకూర్ (3/62), మిన్నూ మణి (2/71) రాణించారు. ఛేదనలో భారత్ 44.5 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రిచా ఘోష్ (54) అర్ధ శతకం సాధించింది.

ఇంగ్లండ్ భారీ విజయం

వెల్లింగ్టన్: ఇంగ్లండ్‌తో మూడురోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 323 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తద్వారా ఇంగ్లండ్ మూడు టెస్టుల సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 378/5తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్.. రూట్ (106) శతక్కొట్టడంతో 427/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కివీస్..259 పరుగులకు కుప్పకూలింది. సెంచరీ హీరో మిచెల్ (115) మినహా మరెవరూ రాణించలేకపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 280, కివీస్ 125 రన్స్ చేసిన సంగతి తెలిసిందే. బ్రూక్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఆర్చరీ సిరీస్ విజేత సురేఖ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండోర్ ఆర్చరీ వరల్డ్ సిరీస్ 250 తైపీ ఓపెన్ కాంపౌండ్ విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ విజేతగా నిలిచింది. తైపీలో ఆదివారం జరిగిన ఫైనల్లో సురేఖ 144-140 స్కోరుతో చెన్ యు జు (తైపీ)పై గెలిచి, టైటిల్ దక్కించుకుంది.

పోరాడుతున్న శ్రీలంక

గెబెహా: శ్రీలంక-దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్టు ఆసక్తికరంగా మారింది. బవుమా (66) రాణించడంతో సౌతాఫ్రికా నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్ లో 317 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ ప్రబాత్ జయసూర్య ఐదు వికెట్లు తీశాడు. ఆ తర్వాత 348 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన లంక ఆట చివరికి 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 358, లంక 328 పరుగులు చేశాయి. లంక నెగ్గాలంటే ఆఖరిరోజు మరో 143 రన్స్ చేయాలి.

గుచ్చుకుంది గులాబీ

10 వికెట్ల తేడాతో ఓడిన భారత్

- రెండో ఇన్నింగ్స్ 175
- కమిన్స్‌కు ఐదు వికెట్లు
- ఆసీస్‌తో డే/నైట్ టెస్టు



అడిలైడ్: అద్భుతం కాదు కదా.. టీమిండియా నుంచి కనీస పోరాటం కూడా లేకపోయింది. రెండున్నర రోజుల్లోనే ముగిసిన ఈ రెండో టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా పది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలి టెస్టును 295 పరుగుల తేడాతో గెలిపించిన భారత బ్యాటర్లు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పూర్తిగా విఫలం కావడం దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌లో ఒక్క బ్యాటర్ కూడా అర్ధసెంచరీ చేయలేకపోయాడు. జట్టు మొత్తంగా 81 ఓవర్లు మాత్రమే ఆడడం గమనార్హం. అంటే.. కనీసం ఓ రోజంతా (90 ఓవర్లు) కూడా బ్యాటింగ్ చేయలేకపోయారని చెప్పవచ్చు. అడిలైడ్‌లో భారత్‌కిది వరుసగా రెండో ఓటమి. 2020లో జరిగిన డే/నైట్ టెస్టులోనూ పరాజయం పాలైంది. అటు గులాబీ టెస్టుల్లో ఆస్ట్రేలియా మాత్రం 12-1తో తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. మూడో రోజు ఆదివారం భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 36.5 ఓవర్లలో 175 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ (42) మరోసారి టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అతడి నిలకడ కారణంగానే జట్టుకు ఇన్నింగ్స్ ఓటమి తప్పినట్టయ్యింది. కెప్టెన్ కమిన్స్ (5/57) తన బౌలింగ్ పదునేంటో రుచి చూపించగా.. బోలాండ్‌కు మూడు, స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 19 పరుగుల స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 3.2 ఓవర్లలో అన్నే పరుగులు చేసి నెగ్గింది. మెక్‌స్వీనే (10 నాటౌట్), ఖవాజా (9 నాటౌట్) అజేయంగా నిలిచారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ట్రావిస్ హెడ్ నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180, ఆసీస్ 337 పరుగులు చేశాయి.

గంటలోనే అంతా క్లోజ్...

128/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ గంటలోనే మిగిలిన వికెట్లన్నీ కోల్పోయింది. శనివారం ఆట ముగిసేసరికి పంత్ (28), నితీశ్ క్రీజులో ఉండడంతో వారి ఆటతీరుపై అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నారు. నిలకడగా ఆసీస్ బౌలర్లను ఎదుర్కొని గౌరవప్రదమైన ఆధిక్యాన్ని అందించకపోతారా? అని ఎదురుచూశారు. కానీ తొలి ఓవర్‌లోనే గట్టి షాకిస్తూ పంత్‌ను స్టార్క్ అవుట్ చేయడంతో ఫలితం ఎలా ఉంటుందో తేలిపోయింది. శనివారం నాటి స్కోరుకు అతను ఒక్క పరుగు కూడా జత చేయలేకపోయాడు. ఈ దశలో ఇన్నింగ్స్ ఓటమి తప్పదనిపించింది. కానీ ఈ సిరీస్‌లోనే అరంగేట్రం చేసిన నితీశ్ అడపాదడపా బౌండరీలతో స్కోరును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. అయితే మరో ఎండ్‌లో కమిన్స్ వికెట్ల పతనం సాగించాడు. 35వ ఓవర్‌లో ఫోర్‌తో నితీశ్ జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. తర్వాతి ఓవర్‌లో సిక్సర్ బాదినా.. కమిన్స్ అతడిని తన ఐదో వికెట్‌గా పెవిలియన్‌కు చేర్చాడు. ఆ వెంటనే సిరాజ్ (7)ను బోలాండ్ అవుట్ చేయడంతో భారత్ 18 పరుగుల ఆధిక్యంతో ఇన్నింగ్స్‌ను ముగించింది.

మూడో స్థానానికి రోహిత్ సేన

దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ర్యాంకింగ్స్‌లో భారత జట్టు మూడో స్థానానికి పడిపోయింది. గులాబీ బంతి టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఘోరంగా ఓడడంతో అగ్రస్థానం నుంచి మూడో ర్యాంక్‌కు పడిపోయింది. ఈ టెస్టులో గెలిచిన కంగారూ జట్టు మూడు నుంచి మళ్లీ టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 60.71 విజయాల శాతంతో మొదటి స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా (59.26) 2వ, భారత్ (57.29) 3వ స్థానంలో ఉన్నాయి. వెల్లింగ్టన్ టెస్టు ఓటమితో మూడోస్థానంలోని న్యూజిలాండ్ ఆరో స్థానానికి పడిపోయింది.

1 భారత్-ఆసీస్ జట్ల మధ్య వేగంగా (1031 బంతుల్లో) పూర్తయిన టెస్టు ఇదే.

3 కెప్టెన్‌గా ఎక్కువ సార్లు (8) 5 వికెట్లు తీసిన మూడో ప్లేయర్‌గా కమిన్స్. ఇమ్రాన్ (12), రిచీ బెనాడ్ (9) ముందున్నారు.

4 భారత్ తరఫున రెండు ఇన్నింగ్స్‌లోనూ ఏడు అంతకంటే దిగువన వచ్చి టాప్ స్కోరర్‌గా నిలిచిన నాలుగో బ్యాటర్‌గా నితీశ్. గతంలో చందూ బోర్డే, ధోనీ, అశ్విన్ ఉన్నారు.



నితీశ్ (42)

బుమ్రా ఒక్కడే బౌలింగ్ చేయలేడుగా..

ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయాలంటే ఇతర బౌలర్లు కూడా బాధ్యత తీసుకోవాలి. బుమ్రా ఒక్కడే ఇరువైపులా బౌలింగ్ చేయలేడు కదా! అతడూ మానవమాత్రుడే. అయితే జట్టులోని యువ బౌలర్లకు టెస్టు క్రికెట్‌లో అనుభవం లేదనే విషయం కూడా మరువరాదు. వారికి ఆత్మవిశ్వాసాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది. హర్షిత్ 16 ఓవర్లలో 86 పరుగులిచ్చినప్పటికీ.. తొలి టెస్టులో అతడు మెరుగ్గా రాణించాడు. ఇక బ్యాటింగ్‌లో ఒక్కసారి కూడా మేం 200 రన్స్ చేయలేకపోయాం. ఇలాంటి ఆటతో మ్యాచ్‌లు గెలవలేం. - రోహిత్ శర్మ

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 180;
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 337.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) క్యారీ (బి) బోలాండ్ 24; రాహుల్ (సి) క్యారీ (బి) కమిన్స్ 7; గిల్ (బి) స్టార్క్ 28; విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 11; పంత్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 28; రోహిత్ (బి) కమిన్స్ 6; నితీశ్ (సి) మెక్‌స్వీనే (బి) కమిన్స్ 42; అశ్విన్ (సి) క్యారీ (బి) కమిన్స్ 7; హర్షిత్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 0; బుమ్రా (నాటౌట్) 2; సిరాజ్ (సి) హెడ్ (బి) బోలాండ్ 7; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 36.5 ఓవర్లలో 175; వికెట్ల పతనం:** 1-12, 2-42, 3-66, 4-86, 5-105, 6-128, 7-148, 8-153, 9-166, 10-175; **బౌలింగ్:** స్టార్క్ 14-1-60-2; కమిన్స్ 14-0-57-5; బోలాండ్ 8.5-0-51-3.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనే (నాటౌట్) 10; ఖవాజా (నాటౌట్) 9; **మొత్తం: 3.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19; బౌలింగ్:** బుమ్రా 1-0-2-0; సిరాజ్ 1.2-0-9-0; నితీశ్ 1-0-8-0.

కుర్రాళ్లు
బోల్తా పడ్డారు

- ఫైనల్లో యువ భారత్ ఓటమి
- బంగ్లాదే అండర్-19 ఆసియా కప్



దుబాయ్: టైటిల్ ఫేవరెట్‌గా అండర్-19 ఆసియా కప్‌లో అడుగుపెట్టిన యువ భారత్ ఫైనల్లో మాత్రం అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ బంగ్లాదేశ్ 59 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తుచేసి టైటిల్ నిలబెట్టుకుంది. టాస్ నెగ్గి ఫీల్డింగ్‌కు దిగిన భారత జట్టులో బౌలర్లు రాణించినా, బ్యాటర్లు తేలిపోయారు. మొదట బంగ్లా 49.1 ఓవర్లలో కేవలం 198 పరుగులకు పరిమితమైంది. రిజాన్ హసన్ (47) టాప్ స్కోరర్‌గా నిలవగా.. షిహాబ్ (40), ఫరీద్ (39) పర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో యుధజిత్ గుహా, చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ రెండేసి వికెట్లు తీయగా.. కిరణ్, కార్తికేయ, ఆయుష్ తలో వికెట్ పడగొట్టారు. స్వల్ప ఛేదనలో భారత కెప్టెన్ అమన్ చేసిన 26 పరుగులే జట్టులో అత్యధిక స్కోరు కావడం గమనార్హం. అజీజుల్ (3/8), ఇక్బాల్ (3/24) ధాటికి భారత్ 35.2 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. హార్దిక్ రాజ్ (24), కార్తికేయ (21), సిద్దార్థ్ (20), చేతన్ (10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. బంగ్లా బౌలర్ ఇక్బాల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు గెలుచుకున్నాడు.

బిజినెస్

అంతటా అవినీతి..

- చేతులు తడిపితేనే పనులకు మోక్షం
- 66% వ్యాపార సంస్థల మనోగతం
- లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: ఎంత కంప్యూటరీకరణ జరిగినా.. ఎన్ని చట్టాలు వచ్చినా మా దారి మాదే అంటున్నాయి కొన్ని ప్రభుత్వ శాఖలు. అనుమతి దరఖాస్తులు, కంప్లయెన్స్ ప్రక్రియలు, ఆస్తులకు సంబంధించి డూప్లికేట్ కాపీ కావాలన్నా ప్రభుత్వ ఉద్యోగుల చేతులు తడపక తప్పడం లేదు. 'లోకల్ సర్కిల్' అనే సంస్థ దీనికి సంబంధించి దేశంలోని 159 జిల్లాలకు చెందిన 18,000 వ్యాపార సంస్థల ఉన్నతాధికారుల అభిప్రాయాలతో ఒక సర్వే విడుదల చేసింది. ఇందులో 66 శాతం సంస్థలు గత ఏడాది కాలంలో ఏదో ఒక పనికోసం ప్రభుత్వ ఉద్యోగుల చేతులు తడపక తప్పలేదని చెప్పాయి. 54 శాతం సంస్థలైతే ఇష్టం లేకపోయినా ఉద్యోగులకు లంచాలు ఇవ్వాల్సి వచ్చిందని చెప్పాయి. 46 శాతం సంస్థలు మాత్రం త్వరగా పని చేయించుకునేందుకు గత్యంతరం లేకే లంచాలు ఇచ్చామని తెలిపాయి.

సర్వే ఇతర ప్రధాన అంశాలు

- ఎప్పుడు లంచాలు ఇవ్వకుండానే పనులు చేయించుకున్నట్టు చెప్పిన 16 శాతం సంస్థలు
- లంచాలు ఇవ్వాల్సిన అవసరమే రాలేదన్న 19 శాతం సంస్థలు
- కంప్యూటరీకరణ, సీసీటీవీలు ఉన్నా చెలరేగిపోతున్న అవినీతి జలగలు
- న్యాయ, తూనికలు-కొలతలు, ఆహార, ఔషధ, ఆరోగ్య శాఖల్లో అవినీతి ఎక్కువ
- జీఎస్‌టీ, కాలుష్య నియంత్రణ, మున్సిపల్ కార్పొరేషన్లు, విద్యుత్ శాఖల్లోనూ అవినీతి తిమింగలాలు
- గత ఏడాదితో పోలిస్తే కొద్దిగా తగ్గిన అవినీతి

25 ఏళ్లు.. రూ.85 లక్షల కోట్లు

ఎఫ్‌డీఐలకు అడ్డాగా భారత్.. డీపీఐఐటీ



న్యూఢిల్లీ: సరళీకృత ఆర్థిక విధానాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు భారత్ కేంద్రంగా మారుతోంది. 2000 సంవత్సరం సెప్టెంబరు నుంచి 2024 సెప్టెంబరు మధ్య కాలంలో మన దేశం 1,03,340 కోట్ల డాలర్ల (సుమారు రూ.84.5 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) ఆదివారం ఇందుకు సంబంధించిన గణాంకాలు విడుదల చేసింది. ఈక్విటీ పెట్టుబడులు, ఆ పెట్టుబడులపై వచ్చిన ఆదాయాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టడం, ఇతర మూలధన పెట్టుబడులన్నీ ఎఫ్‌డీఐ కోవలోకి వస్తాయి. ఈ పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో 25 శాతం ఒక్క మారిషస్ నుంచే రావడం విశేషం. సింగపూర్ (24 శాతం), అమెరికా (10 శాతం), నెదర్లాండ్ (7 శాతం), జపాన్ (6 శాతం), యూకే (5 శాతం), యూఏఈ (3 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కేమన్ ఐలాండ్స్, జర్మనీ, సైప్రస్ నుంచి 6 శాతం పెట్టుబడులు వచ్చినట్టు డీపీఐఐటీ తెలిపింది. ఈ కాలంలో మారిషస్ నుంచి 17,718 కోట్ల డాలర్లు, సింగపూర్ నుంచి 16,747 కోట్ల డాలర్లు, అమెరికా నుంచి 6,780 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి.

అన్ని రంగాల్లోకి..

సేవల విభాగం, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, టెలికమ్యూనికేషన్స్, ట్రేడింగ్, కన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లోకి పెద్దఎత్తున ఎఫ్‌డీఐ వచ్చినట్లు డీపీఐఐటీ తెలిపింది. కాగా 2004-14 కాలంతో పోల్చితే 2014-24 మధ్య కాలంలో దేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐ ఏకంగా 119 శాతం మేర పెరిగిందని పేర్కొంది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులు షురూ

గత రెండు నెలలుగా అమ్మకాలతో హోరెత్తించిన విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు దిగారు. ఈ నెల తొలి వారంలోనే రూ.24,454 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అక్టోబరులో రూ.94,017 కోట్లు, నవంబరులో రూ.21,612 కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకున్నాయి. కుదుటపడుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ ఈ నెల మరోసారి వడ్డీ రేట్లు తగ్గించబోతోందన్న అంచనాలతో ఎఫ్‌పీఐలు మళ్లీ కొనుగోళ్లకు దిగాయని భావిస్తున్నారు. ట్రంప్ ఆర్థిక విధానాలు, మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, జీడీపీ వృద్ధి రేటు ముందు ముందు మన దేశంలో ఎఫ్‌పీఐల పెట్టుబడులను నిర్ణయించనున్నాయి.

ఈ వారం 11 ఐపీఓలు

ఐపీఓ మార్కెట్లోనూ జోరు పెరుగుతోంది. రూ.18,500 కోట్ల సమీకరణ కోసం ఈ వారం 11 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వస్తున్నాయి. ఇందులో ఐదు విశాల్ మెగా మార్ట్, ఫిన్‌టెక్ కంపెనీ ఒన్ మొబిక్విక్ సిస్టమ్స్, ఇన్వెంచరస్ నాలెడ్జ్ సొల్యూషన్స్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ జెమ్మాలాజికల్ ఇనిస్టిట్యూట్, హైదరాబాద్ కేంద్రంగా పని చేసే సాయి లైఫ్ సైన్సెస్ పెద్ద కంపెనీల ఐపీఓలు. మిగతా ఆరు ఐపీఓలు మాత్రం ఎస్ఎంఈ విభాగం నుంచి వస్తున్నాయి.

రూ.72,500 కోట్ల ప్యాకేజీ అవసరం

ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల సంఘం వినతి

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉపయోగించే విడి భాగాలు దేశంలోనే తయారై, దిగుమతుల ఆధారనీయత తగ్గాలంటే తమకు రూ.72,500 కోట్ల ప్యాకేజీ అవసరమని భారత ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల సమాఖ్య (ఎల్సినా) కోరింది. 2030 నాటికి దేశంలో ఎలక్ట్రానిక్స్ విడిభాగాల డిమాండ్ సరఫరా మధ్య వ్యత్యాసం రూ.21 లక్షల కోట్లకు చేరుతుందని తెలిపింది. 2030 నాటికి 50 వేల కోట్ల డాలర్ల (రూ.42 లక్షల కోట్లు) తయారీ లక్ష్యాన్ని సాధించాలంటే విడిభాగాలు దిగుమతి చేసుకోక తప్పదని పేర్కొంది. నాన్-సెమీ కండక్టర్ రంగానికి ప్రభుత్వం ప్రకటించే మద్దతు వల్ల ఈ లోటు రూ.12.36 లక్షల కోట్ల నుంచి రూ.8.63 లక్షల కోట్లకు తగ్గుతుందని తెలిపింది. తక్కువ రాబడులు, అధిక నిర్వహణ వ్యయాలు, ప్రాజెక్టు లాభదాయకం కావడానికి పట్టే సమయం అధికం కావడంతో ఎలక్ట్రానిక్ విడిభాగాల విభాగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రజలు ఆసక్తి ప్రదర్శించరని ఎల్సినా ప్రధాన కార్యదర్శి రాజు గోయెల్ అన్నారు. అందుకే పరిశ్రమను విస్తరించేందుకు ప్రోత్సాహకంగా రూ.72,500 కోట్ల ప్యాకేజీ, రూ.54,655 కోట్ల ఉత్పత్తి ఆధారిత పథకం (పీఎల్ఐ) ప్రకటించాలని తాము కోరుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తోడ్పాటునందిస్తే నాన్-సెమీ కండక్టర్ విభాగం 2030 నాటికి అదనంగా 50 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుందని రాజు తెలిపారు.

25,000 పైన బుల్లిష్

(డిసెంబరు 9-13 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో ట్రెండ్

నిఫ్టీ గత వారం 24,857-24,009 పాయింట్ల మధ్యన కదలాడి 547 పాయింట్ల లాభంతో 24,678 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,491, 24,361, 24,090, 24,116 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైకి రావడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25,000 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,400
నిరోధ స్థాయిలు: 24,880, 24,980, 25,080 (24,780 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,470, 24,370, 24,270 (24,570 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	104
వరంగల్	100	గుంటూరు	104
కరీంనగర్	100	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	82
కర్నూలు	100	నెల్లూరు	82
విశాఖపట్నం	96	అనంతపురం	82
గోదావరి	104		

బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలపై కన్నేయండి.!

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ).. వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించటంతో ఈ వారం ఆ ప్రభావం స్టాక్ మార్కెట్లపై పడే అవకాశం ఉంది. నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ని తగ్గించటంతో బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో మూమెంటమ్ కనిపించవచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత మదుపరులు తిరిగి వస్తే సూచీలు మరింత పైకి వెళ్లటం ఖాయం.

స్టాక్ రికమండేషన్స్

టాటా మోటార్స్: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు క్రమంగా పతనమవుతూ వచ్చింది. దాదాపుగా 36 శాతం మేర నష్టపోయింది. రూ.770 స్థాయిలో మద్దతు లభించింది. ప్రస్తుతం ఈ కౌంటర్‌లో అక్యుములేషన్ జరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 3.06 శాతం లాభంతో రూ.816 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.810 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.870/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.790 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. గత వారం చక్కని మూమెంటమ్‌తో వరుసగా లాభపడింది. ప్రతి త్రైమాసికంలో ఈపీఎస్, సేల్స్, లాభం, నిర్వహణ మార్జిన్లు మెరుగవుతున్నాయి. గత శుక్రవారం రూ.1,206 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,150/1,180 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,450/1,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,110 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

వరుణ్ బెవరేజేస్: సుదీర్ఘకాలంగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ జరుగుతోంది. బేస్ ఏర్పడుతోంది. మూమెంటమ్ ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. గత శుక్రవారం రూ.644 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.630/620 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.740 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.600 స్థాయి వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

ఏంజెల్ వన్: ప్రస్తుతం ఫైనాన్స్ స్టాక్ బ్రోకింగ్ రంగం బుల్లిష్‌గా ఉంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఈ షేరు స్టేజ్-2లో కొనసాగుతోంది. ఆగస్టులో ఈ షేరు 58 శాతం మేర ర్యాలీ కనబరిచింది. గత శుక్రవారం ఈ షేరు 2.2 శాతం లాభంతో రూ.3,292 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,250 వద్ద పొజిషన్ తీసుకుని రూ.3,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,200 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

క్యాస్ట్రాల్ ఇండియా: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు క్రమంగా దిద్దుబాటుకు గురైంది. మార్కెట్ పరిస్థితి బాగా లేకపోవటంతో 34 శాతం మేర పతనమైంది. కీలకమైన మద్దతు స్థాయి రూ.186 వద్ద టర్న్ అరౌండ్ అయ్యింది. చివరి రెండు వారాల్లో 24 శాతం మేర పెరిగింది.గత శుక్రవారం రూ.222 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.210/200 వద్ద పొజిషన్ తీసుకుని రూ.260/280 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.190 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ
కన్సాలిడేషన్‌కు ఆస్కారం



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కరెక్షన్‌కు గురైనా మానసిక అవధి 24,000 వద్ద రికవరీ సాధించి బలంగా ముగిసింది. తదుపరి వారం అంతా అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 550 పాయింట్ల లాభంతో 24,670 వద్ద ముగిసింది. అయితే శుక్రవారం మైనర్ కరెక్షన్‌లో పడడం గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి స్వల్పంగా ఏర్పడిందనేందుకు సంకేతం. గత మూడు వారాల్లో నిఫ్టీ 1,500 పాయింట్ల మేరకు రిలీఫ్ ర్యాలీ సాధించింది. ఈ ర్యాలీ కారణంగా ఇటీవలి డౌన్‌ట్రెండ్‌లో ఏర్పడిన నష్టంలో 50 శాతం భర్తీ చేసుకుంది. అయినా ఇప్పటికి కూడా మార్కెట్ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 26,250 కన్నా దిగువనే ఉంది. గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 2300 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 840 పాయింట్ల రికార్డు ర్యాలీ సాధించాయి. అయితే గత కొద్ది రోజుల్లో నిట్టనిలువుగా దూసుకుపోయినందు వల్ల కన్సాలిడేషన్ ఏర్పడే అవకాశం ఉంది. వారం చివరి రెండు రోజుల్లో అమెరికన్ స్టాక్ మార్కెట్లో కరెక్షన్ ప్రభావం కూడా మన మార్కెట్‌పై ఈ వారంలో పడవచ్చు. ఈ పరిస్థితుల్లో 24,500 వద్ద నిఫ్టీ మరోసారి పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే 24,750 వద్ద ప్రధాన నిరోధం ఉంది. ఇక్కడ నుంచే గత శుక్రవారం రియాక్షన్ ఏర్పడింది. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 25,000.

బేరిష్ స్థాయిలు: 24,500 వద్ద మైనర్ మద్దతు కనిపిస్తోంది. బలం కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,000. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 1,450 పాయింట్ల మేరకు బలంగా లాభపడింది. 52,000 వద్ద అప్‌ట్రెండ్‌ను పునరుద్ధరించుకుని 53,500 చేరువలో క్లోజైంది. ప్రధాన నిరోధం 54,000. మరింత అప్‌ట్రెండ్ ఏర్పడినట్టయితే మరింత సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఒకవేళ బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 53,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 50 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. 24,750 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,750, 24,820
మద్దతు	24,560, 24,500

www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 9-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 251
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మధుమేహ కేసుల్లో మూడో స్థానం 10

- తెలంగాణలో 30 దాటినవారిలో 14% మంది వ్యాధి బాధితులు
- పెద్ద రాష్ట్రాల్లో 32 శాతం కేసులతో అగ్రస్థానంలో పంజాబ్
- 16 శాతంతో 2వ స్థానంలో మహారాష్ట్ర.. జాతీయ సగటు 9.16%
- యూటీల్లో పుదుచ్చేరి టాప్.. ఈశాన్యంలోనూ భారీగా రోగులు
- గణాంకాలను విడుదల చేసిన కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ
- జీవనశైలి మార్పులతోనే మధుమేహానికి అడ్డుకట్ట



తెలంగాణ తల్లి పండుగ

ఏటా డిసెంబరు 9న అవతరణ ఉత్సవం

- నేడు అసెంబ్లీలో ప్రకటించనున్న సీఎం రేవంత్
- విగ్రహం ఆవిష్కరణకు ముందే ఉత్తర్వులు
- నేటి నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు
- ఆర్‌వోఆర్-2024 చట్టంపైనే ప్రధానంగా చర్చ!
- రైతు భరోసా పథకం విధివిధానాలపై కూడా
- పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లుకు ఆమోదం!
- మూసీ, హైడ్రా ప్రస్తావనకు వచ్చే అవకాశం
- వారంపాటు సమావేశాలు.. వాడీవేడి ఖాయం
- అస్త్రశస్త్రాలతో సిద్ధమైన అధికార, విపక్షాలు

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో ఇకపై ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఉత్సవం సందర్భంగా రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' ఆలాపన జరగనుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం శాసనసభలో ప్రకటన చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి తొలి ప్రకటన 2009 డిసెంబరు 9న వెలువడిన విషయం తెలిసిందే. దీంతో ఆ రోజును పండుగలా నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఈ మేరకు

మిగతా 10వ పేజీలో...

నింగి తనవైపు లాక్కున్నట్టు..

- ఎయిర్ షో అద్భుతం
- 9 విమానాలు.. అరగంట పైగా విన్యాసాలు 11
- మంత్రులతో కలిసి తిలకించిన సీఎం రేవంత్

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ నేడే

- సాయంత్రం 6.05కు
- లక్ష మంది మహిళలతో సీఎం రేవంత్ సభ
- ముగియనున్న ఉత్సవాలు


ఎయిర్‌షోను తిలకిస్తున్న రేవంత్, కోమటిరెడ్డి

విగ్రహ మార్పు మూర్ఖత్వం

- ఇలా మార్పులు చేసుకుంటూ పోతే ఎలా?
- ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా?
- అసెంబ్లీ, మండలిలో ప్రజా గొంతుకలు కావాలి
- రైతు భరోసా, బోనస్, మాఫీపై నిలదీయాలి
- ఫిబ్రవరిలో బీఆర్ఎస్ బహిరంగ సభ: కేసీఆర్
- ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ భేటీ.. దిశానిర్దేశం
- కాంగ్రెస్ హామీల అమలుపై పోరాడతాం
- ప్రజాప్రతినిధుల నిర్బంధాన్ని ప్రశ్నిస్తాం: కేటీఆర్
- సంక్షేమం నాశనం.. శాంతిభద్రతల్లో విఫలం
- తిట్లు, ఒట్లు తప్ప రేవంత్ చేసిందేముంది?
- ఇప్పుడు జరపాల్సింది వంచనోత్సవాలే: హరీశ్
- కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్ విడుదల



మర్కుక్/గజ్వేల్/హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహం రూపాన్ని మారుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తప్పుబట్టారు. ఇదొక మూర్ఖపు చర్య అని అన్నారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా? అని ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించారు. శాసనసభ, శాసనమండలిలో పార్టీపరంగా చర్చించాల్సిన అంశాలపై

మిగతా 12వ పేజీలో...


డమాస్కస్‌లో ప్రజలు, తిరుగుబాటుదారుల సంబరాలు

సిరియా.. రెబెల్స్ వశం

- రాజధాని డమాస్కస్ స్వాధీనం.. తిరుగుబాటుదార్ల విజయం
- 13 ఏళ్ల పోరాటం.. 54 ఏళ్ల అసద్ కుటుంబ పాలన అంతం
- కుటుంబంతో సహా రష్యాకు పలాయనమైన అధ్యక్షుడు బషర్
- సంబరాలు జరుపుకొన్న దేశ ప్రజలు.. అధ్యక్ష భవనం లూటీ
- సెంట్రల్ బ్యాంక్‌లోనూ దోపిడీ.. మిలటరీ కోర్టుకు నిప్పు



కూల్‌గానే క్రూరత్వం

14 ఏళ్ల బాలిక గ్రాఫిటీతో అసద్ పతనం షురూ

నేడో రేపో సిరియాలో కొత్త ప్రభుత్వం!

డమాస్కస్, డిసెంబరు 8: సరిగ్గా మూడేళ్ల కిందట అఫ్ఘానిస్థాన్, నిన్న శ్రీలంక, బంగ్లాదేశ్ పాలకులు ప్రజాగ్రహానికి గురవ్వగా.. తాజాగా సిరియాలోనూ అలాంటి పరిస్థితే ఎదురైంది. పశ్చిమాసియాలోని ఈ దేశం తిరుగుబాటుదార్ల హస్తగతమైంది. అప్పటి అఫ్ఘాన్ అధ్యక్షుడు మహమ్మద్ అష్రఫ్ ఘనీ, శ్రీలంక అధినేత గొటబాయ, బంగ్లాదేశ్ ప్రధాని హసీనా మాదిరిగా.. సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ కూడా దేశాన్ని వీడారు. నవంబరు 27 నుంచి నగరాలు, గ్రామాలను వశం చేసుకుంటున్న హయాత్ తహ్రీర్ అల్ షమ్(హెచ్‌టీఎస్) నేతృత్వంలోని రెబెల్స్. శనివారం కీలకమైన అలెప్పో, హమా,

మిగతా 2వ పేజీలో...


మీ సేవ యాప్‌ను ప్రారంభిస్తున్న ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు

మొబైల్ 'మీ సేవ' 11

- ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే 150 సేవలు
- యాప్, టీ ఫైబర్ సేవలను ప్రారంభించిన శ్రీధర్‌బాబు
- రూ.7,592 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

ఉగ్ర కొరియర్లుగా డ్రగ్స్ బానిసలు

- సరిహద్దుల గుండా భారతలోకి చొరబాటు
- అరెస్టై జమ్మూ, పంజాబ్, రాజస్థాన్ జైళ్లకు
- ఉగ్రవాదులకు కీలక సమాచారం చేరవేత!

2 పాకిస్థాన్ ఐఎస్ఐ సరికొత్త కుట్రలు




నకిలీ రోగులను చూపిస్తే కఠిన చర్యలు

- తనిఖీల్లో గుర్తించేందుకు ఎన్ఎంసీ కొత్త మార్గదర్శకాలు
- బోధనాస్పత్రుల అడ్డదార్లకు చెక్
- కాలేజీల ఏర్పాటుకు దరఖాస్తు తుది గడువు జనవరి 5

3

అరికాళ్లూ పట్టిస్తాయి 12

- నేరగాళ్ల ముఖం, కళ్లు కూడా స్కానింగ్
- 5 రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టు
- రష్యాలో టెక్నాలజీపై శిక్షణ



సిరియా.. రెబెల్స్ వశం

(మొదటి పేజీ తరువాయి)

హోమ్స్, అల్-కమల్, డెయిర్ ఎజోర్ నగరాలతోపాటు.. ఉత్తర సిరియాను ఆక్రమించిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి డమాస్కస్‌కు 10 కిలోమీటర్ల దూరం వరకు చేరుకున్న రెబెల్స్.. ఆదివారం ఉదయం రాజధాని నగరాన్ని పూర్తిస్థాయిలో ఆధీనంలోకి తెచ్చుకుంది. దీంతో ప్రజలు సంబురాలు జరుపుకోగా.. సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ దేశాన్ని వీడారు. ఆ వెంటనే రెబెల్స్ తమ విజయాన్ని ప్రకటించారు.

అసద్ ఎక్కడ

అసద్ ఆదివారం ఉదయమే తన కుటుంబంతో సహా రష్యా తయారీ ఐఎల్-76 విమానంలో సురక్షిత ప్రాంతానికి బయలుదేరారు. మధ్యాహ్నానికి ఆ విమానం నుంచి రాడార్‌కు సంబంధాలు తెగిపోవడంతో.. ప్రమాదం జరిగి ఉంటుందని, అసద్ చనిపోయి ఉంటాడని సోషల్ మీడియాలో వార్తలు వెల్లువెత్తాయి. సిరియా అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించలేదు. ఆయన విమానం 3,650 మీటర్ల ఎత్తు నుంచి ఒక్కసారిగా 1,070 మీటర్లకు పడిపోయినట్లు తేలిందని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్లు చెబుతున్నాయి. ఆ ప్రదేశం లెబనాన్ గగనతలం పరిధిలో ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే.. సురక్షిత ప్రాంతానికి వెళ్లే క్రమంలో రాడార్‌కు అందకుండా జాగ్రత్తలు తీసుకుని ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసద్ ఎక్కడున్నాడనే విషయం శనివారం రాత్రి నుంచే తెలియదని సిరియా ప్రధాని మహమ్మద్ అల్-జలాలీ పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకునే నాయకత్వంపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

నేడో రేపో కొత్త సర్కారు!

రెబల్స్ ఒకట్రెండ్రోజుల్లో కొత్త ప్రభుత్వాన్ని ప్రకటించే అవకాశాలున్నట్లు సిరియా వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అంతర్యుద్ధంతో 70% సిరియా దెబ్బతిన్నదని, పునర్నిర్మాణానికి చాలా సమయం పడుతుందని వివరించాయి. పశ్చిమదేశాలు, అమెరికా సాయం లేనిదే అది సాధ్యం కాదని, ఒకవేళ కొత్త సర్కారు ఇస్లామిక్ అతివాద ధోరణులను ప్రదర్శిస్తే.. ఆ దేశాలు సహకరించే అవకాశాలు అంతంతమాత్రమేనని పేర్కొన్నాయి. సౌదీ అరేబియా, ఇతర అరబ్ దేశాలు ఒకవేళ సాయం చేసినా.. పరిమితంగానే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశాయి. తిరుగుబాటు నాయకుడు అబూ మహమ్మద్ అల్-గోలానీని ప్రభుత్వాధినేతగా ప్రకటించే అవకాశాలున్నట్లు తెలిపాయి. మరోవైపు.. తాము ఇంతకాలం ప్రభుత్వం చెప్పినట్లు వార్తలు రాశామని, అది తమ తప్పు కాదని సిరియా పత్రికలు, వార్తాసంస్థలు రెబెల్స్‌కు సందేశాన్ని పంపాయి. తాము ప్రజల పక్షాన ఉంటూ.. నవ సిరియా నిర్మాణానికి సహకరిస్తామని, గత సర్కారు హయాంలో వార్తలు రాసిన జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలు వద్దని విజ్ఞప్తి చేశాయి.

జైళ్లలో అరాచకాలు

సొంత ప్రజలపైనే రసాయన, సిలిండర్ దాడులు చేయించిన అపఖ్యాతిని మూటగట్టుకున్న అసద్.. జైళ్లలో అమానుషంగా మరణ శిక్షలను విధించేవాడని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ 2016లోనే ఆరోపించింది. అమ్నెస్టీ తమకు 2011-15 మధ్యకాలానికి సంబంధించిన అరాచకాల వివరాలే అందాయని, ఆ తర్వాత డేటా దొరకలేదని పేర్కొంది. ఈ మధ్యకాలంలోనే అధికారికంగా లక్ష మందికి మరణ శిక్షలు విధించినట్లు పేర్కొంది. అనధికారికంగా ఈ సంఖ్య 3 లక్షల దాకా ఉంటుందని అంచనా. ఒక్క సాయ్‌డాన్‌యా జైలులోనే.. అధికారికంగా 30 వేల మంది ఖైదీలు మరణశిక్షకు గురయ్యారు. ఈ దారుణాలకు మారుపేరు సాయ్‌డాన్‌యా జైలు అని మాజీ ఖైదీలు చెబుతుంటారు. ముఖ్యంగా.. ఈ జైలులో రెండు భవనాలు ఉంటాయి. వాటిల్లో ఒకదానికి ఎరుపు రంగు, రెండోదానికి తెలుపు రంగు ఉంటుంది. సాయుధ తిరుగుబాటుదారులను ఎరుపు రంగు భవనంలో.. విచారణ కొనసాగుతున్న, తిరుగుబాటుదారుల సానుభూతిపరులను తెలుపురంగు భవనంలో పెట్టేవారు. రెండు వారాలకు ఓ సారి జడ్జితో విచారణ జరిపిస్తారు. 3-4 నిమిషాల్లోనే విచారణ పూర్తిచేస్తారు. ఎలాంటి వాదనలను వినకుండానే.. 30-50 మంది ఖైదీలకు మరణశిక్ష విధించేవారు. అదికూడా వెంటనే కాదు.! వారికి విషయం కూడా చెప్పేవారు కాదు.! వారిని వైట్ బిల్డింగ్‌కు తీసుకెళ్లి.. కళ్లకు గంతలు కట్టి, నానా చిత్రహింసలు పెట్టి, ఆ తర్వాత మరణశిక్షను అమలు చేసేవారని అమ్నెస్టీ వెల్లడించింది. ఇక జైలు అధికారులు బ్యారక్‌లకు వచ్చినప్పుడు.. తమ కళ్లకు గంతలు కట్టేవారని మాజీ ఖైదీలు చెబుతున్నారు. అర్ధరాత్రి పూట మరణశిక్షలు అమలు చేసేవారని, తుపాకీతో కాల్చినశబ్దాలు వినిపించేవారని, జైలులో ఉన్నన్ని రోజులు బిక్కుబిక్కుమంటూ గడిపామని వివరించారు.



రెబెల్స్ లీడర్ జులానీ



సిరియా సెంట్రల్ బ్యాంక్ వెలుపల నోట్ల కట్టలు

భారతీయులంతా క్షేమం

సిరియాలో ఉన్న భారతీయులంతా క్షేమంగానే ఉన్నారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. డమాస్కస్‌లోని భారత రాయబార కార్యాలయం యథావిధిగా పనిచేస్తోందని పేర్కొన్నాయి. సిరియాలో ఉన్న భారయులతో ఎంబసీ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపాయి. అధికారిక లెక్కల ప్రకారం సిరియాలో 90 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో 14 మంది ఐరాస సంస్థల్లో పనిచేస్తున్నారు.

14 ఏళ్ల బాలిక గ్రాఫిటీతో మొదలైన పతనం

అసద్ అణచివేత విధానాలతో విసిగిపోయిన ఓ 14 ఏళ్ల బాలిక దక్షిణ సిరియాలోని దారా అనే ఊళ్లో గోడపై 'డాక్టర్ ఇక నీ వంతు' అనే అర్థం వచ్చేలా గ్రాఫిటీ చిత్రాలు వేసింది. ఇందుకుగాను ఆ బాలిక, ఆమె స్నేహితురాళ్లని అరెస్టు చేసిన పోలీసులు 26 రోజులపాటు చిత్రహింసలకు గురి చేశారు. దీంతో దారాలో మొదలైన ప్రజాతిరుగుబాటు 2011 మార్చి 15 నాటికి దేశ వ్యాప్తంగా అంతర్యుద్ధానికి దారి తీసి అసద్ పతనానికి కారణమైంది.

సిరియాలో కొత్త శకం: రెబెల్స్

అసద్ పలాయనంతో.. తిరుగుబాటుదారులు సిరియా తమ వశమైందంటూ ఓ ప్రకటనను విడుదల చేశారు. "నిరంకుశ పాలకుడు అసద్ దేశాన్ని వీడాడు. సిరియాకు విముక్తి లభించింది. సిరియా ఇప్పుడే స్వేచ్ఛావాయువులను పీల్చనుంది. సిరియాలో కొత్త శకం ప్రారంభమైంది. విదేశాల్లో తలదాచుకుంటున్న సిరియన్లు "స్వేచ్ఛాయుత సిరియా"కు తిరిగి రావాలని కోరుతున్నాం" అని సోషల్ మీడియాలో పిలుపునిచ్చారు. నిజానికి హెచ్‌టీఎస్ నేతృత్వంలోని తిరుగుబాటు దళాల ప్రతినిధి హసన్ అబ్దుల్ ఘనీ డమాస్కస్‌ను చుట్టుముట్టడం ద్వారా ఆపరేషన్‌ను చివరి దశకు తీసుకొచ్చామని శనివారమే ప్రకటించారు. ఆదివారం ఉదయమే ఆయన తాము డమాస్కస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.




డమాస్కస్‌లోని ప్రసిద్ధ ఉమయ్యాద్ మసీదులో తిరుబాటుదారుడి ప్రార్థన


రాజధానిలో లూటీ

అసద్ దేశాన్ని వీడి పారిపోయాడన్న వార్తతో.. ఆదివారం మధ్యాహ్నం ప్రజలు డమాస్కస్ వీధుల్లోకి వచ్చి సంబురాలు జరుపుకొన్నారు. దేవుడి కరుణతో నిరంకుశ పాలన నుంచి తమకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. అదే సమయంలో.. రాజధాని నగరంలో లూటీలు కూడా జరిగాయి. అధ్యక్ష భవనంలోకి చొరబడ్డ ప్రజలు..దొరికిన వస్తువును దొరికినట్లు దోచుకున్నారు. రక్షణ శాఖ ఆఫీసులో కూడా లూటీ జరిగినట్లు వార్తలొచ్చాయి. సిరియా సెంట్రల్ బ్యాంక్‌లో కరెన్సీ కట్టలున్న డబ్బాలను కూడా పౌరులు ఎత్తుకెళ్లడం కనిపించింది. తర్వాత తిరుగుబాటు దారులు డబ్బులకు కాపలాగా ఉన్నారు.

గోలన్ హైట్స్‌లో ఇజ్రాయెల్ పాగా

సిరియా అధ్యక్షుడు అసద్ పరారీతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. ఇజ్రాయెల్-సిరియా సరిహద్దుల్లో తన సైన్యాన్ని మోహరించింది. 1974 కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా.. గోలన్‌హైట్స్‌లో 2/3వ వంతు ఇజ్రాయెల్, మిగతా భూభాగం(బఫర్‌జోన్) సిరియా ఆధీనంలో కొనసాగుతున్నాయి. అయితే ఆదివారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్వయంగా సరిహద్దులకు వెళ్లి.. సైనికులకు దిశానిర్దేశం చేశారు. గోలన్‌హైట్స్ పూర్తిగా తమ ఆధీనంలో ఉన్నట్లు ప్రకటించారు. అక్కడి ప్రజల(క్రిస్టియన్లు అధికం)ను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.





అసద్ పనైపోయింది: ట్రంప్



వాషింగ్టన్, డిసెంబరు 8: సిరియా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం విడిచి పారిపోయిన సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పనైపోయినట్లేనని పేర్కొన్నారు. ఆయనను కాపాడడంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇక ఏ మాత్రం ఆసక్తి లేదన్నారు. ఇన్నాళ్లూ అసద్‌కు పుతిన్ రక్షకుడిగా నిలిచారన్న ట్రంప్.. ఇక సిరియా యుద్ధానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఎలాంటి లాభం లేదని తెలుసుకున్నారని వ్యాఖ్యానించారు. దీనికి ఉక్రెయిన్‌తో యుద్ధం, దిగజారిన దేశ ఆర్థిక పరిస్థితి కారణమన్నారు. ఇరాన్ బలహీనపడడానికి ఇజ్రాయెల్‌తో ఘర్షణే కారణమన్నారు.

సిరియా... ఊపిరి పీల్చుకో: జర్మనీ

అసద్ ప్రభుత్వ పతనంతో సిరియా ప్రజలకు ఉపశమనం లభించిందని జర్మనీ వ్యాఖ్యానించింది. అయితే సిరియా రాడికల్స్ చేతిలో పడకూడదని జర్మనీ విదేశాంగ మంత్రి అన్నాలెనా బెర్బాక్ ఆకాంక్షించారు. దేవుడు తమకు ఊరటనిచ్చాడని లెబనాన్ రాజధాని బీరుట్‌లోని సిరియా శరణార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అసద్ పీడ విరగడవడంతో సిరియాకు సంతోషంగా తిరిగి వెళతామని వారు తెలిపారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో సిరియా శరణార్థులు రోడ్లపైకి వచ్చి సంబురాలు జరుపుకున్నారు. 'ఎన్నో ఏళ్ల తర్వాత స్వేచ్ఛా ద్వారాలు తెరుచుకున్నాయి. ఇది చరిత్రాత్మకమైన రోజు' అన్న యాంకర్ ప్రారంభ వాక్యాలతో సిరియా ప్రభుత్వ టీవీ ప్రసారాలు తిరిగి ప్రారంభమయ్యాయి. మొదట తిరుగుబాటుదారుల కమాండర్ అనస్ సల్ఖదీ ఇంటర్వ్యూ ప్రసారమైంది. కాగా, బషర్ అసద్ తిరుగుబాటుదారులతో చర్చలు జరిపిన తర్వాతే సిరియా విడిచి వెళ్లారని రష్యా విదేశాంగ పేర్కొంది. శాంతియుతంగా అధికార బదలాయింపునకు అసద్ సూచనలు చేశారని 'టెలిగ్రామ్' వేదికగా తెలిపింది.

13 ఏళ్లుగా తిరుగుబాటు

సిరియాలో 2011 నుంచి తిరుగుబాట్లు తీవ్రమయ్యాయి. అంతర్యుద్ధం మొదలైంది. అసద్ కుటుంబం షియాలోని అల్లవీట్ వర్గానికి చెందినది. సిరియాలో ఈ వర్గం జనాభా 12% మాత్రమే. దేశంలోని టార్టస్, లకాటియా ప్రాంతాల్లో వీరు అత్యధికంగా ఉండగా.. మిగతా ప్రాంతాల్లో సున్నీలదే మెజారిటీ. అసద్ షియాకు చెందిన వ్యక్తి కావడంతో.. ఇరాన్ మద్దతిస్తూనే.. లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లాను రంగంలోకి దింపింది. రష్యా కూడా అసద్‌కు సహకరించింది. అసద్ తండ్రి హయాం నుంచి కూడా అధికార వర్గాల్లో షియాలనే నియమించడం, సున్నీలను అణగదొక్కడం రివాజుగా ఉండేది. అంతర్యుద్ధానికి ఈ అణచివేతే ప్రధాన కారణం. 2015లో తిరుగుబాటుదారుల ధాటికి అసద్ పతనం అంచులదాకా వెళ్లారు. అయితే.. ఇరాన్, హిజ్బుల్లా సహకారం.. రష్యా వాయుసేన రంగంలోకి దిగడంతో.. తిరుగుబాటు దారులు వెనక్కి తగ్గారు. అసద్ గట్టెక్కారు.



అసద్ దేశాన్ని విడిచిపోవడంతో విజయ సంకేతం చూపుతున్న కుర్దు తెగకు చెందిన మహిళ

54 ఏళ్ల కుటుంబపాలనకు అంతం

సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశాన్ని వీడి పారిపోవడంతో 54 ఏళ్ల అతని కుటుంబపాలన అత్యంత నాటకీయంగా ముగిసింది. 1970ల్లో అసద్ తండ్రి హఫెజ్ అల్ అసద్ అధ్యక్షుడైనప్పటి నుంచి ఆదివారం దాకా ఆ కుటుంబమే సిరియాను శాసించింది. తండ్రి మరణం తర్వాత 2000 సంవత్సరంలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అసద్ తన అధికారాన్ని కాపాడుకునేందుకు 2011 నుంచి 13 ఏళ్లుగా రకరకాల ప్రయత్నాలు చేశారు. సిరియాను దేశ, విదేశీ శక్తులకు యుద్ధ భూమిగా మార్చేసిన అసద్.. చివరికి అంతర్యుద్ధానికి తలొగ్గి పారిపోయారు.

సున్నీల కోటలో హఫెజ్ సామ్రాజ్యం

సున్నీలు మెజార్టీ వర్గమైన సిరియాలో ఒకప్పుడు వారి ఆధిపత్యమే ఉండేది. దేశంలో రాజకీయ అనిశ్చితి, ప్రజాతిరుగుబాటులు అధికమైనప్పుడు అసద్ తండ్రి హఫెజ్ అల్ అసద్ 1970లో అనూహ్యంగా అధ్యక్షుడు అయ్యారు. షియా పద్ధతులను ఆచరించే అలావీట్ అనే మైనార్టీ వర్గానికి చెందిన హఫెజ్.. సిరియా రక్షణ మంత్రిత్వ శాఖ, వాయుసేన కమాండర్ ఇన్ చీఫ్‌గా ఉండేవారు. అధ్యక్షుడయ్యాక విభజించి పాలించు విధానంతో దేశంలో వర్గపోరుకు తెరలేపి తన అధికారాన్ని నిలబెట్టుకున్నారు. సైన్యం, సెక్యూరిటీ సర్వీసెస్ సహా ప్రభుత్వంలోని కీలక పదవుల్లో అలావీట్లు, తన కుటుంబసభ్యులను నియమించి సున్నీల ప్రాబల్యాన్ని క్రమంగా తగ్గించేశారు.



హఫెజ్ అసద్ తలపై రెబెల్ కాలు

దీంతో దేశ జనాభాలో 12 నుంచి 15 శాతం మాత్రమే ఉన్న అలావీట్‌లు హఫెజ్ అధికారానికి అండగా నిలబడ్డారు. హఫెజ్ 30 ఏళ్లకు పైగా సిరియాను ఓ నియంతలా శాసించారు. ఎంతలా అంటే.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్నేహితుల దగ్గర మాట్లాడేందుకు కూడా ప్రజలు వణికిపోయేవారు.

అనుకోకుండా అధ్యక్షుడైన డాక్టర్ సాబ్

బషర్ అల్ అసద్ దేశ అధ్యక్షుడు అవ్వడం అత్యంత నాటకీయంగా జరిగింది. నిజానికి, హఫెజ్ తన పెద్ద కుమారుడు, అసద్ అన్నయ్య బసిల్‌ను తన వారసుడిగా ప్రకటించారు. అయితే, 1994లో జరిగిన ఓ కారు ప్రమాదంలో బసిల్ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో లండన్‌లో కంటి వైద్యుడిగా పని చేస్తోన్న అసద్ తెరమీదకి వచ్చారు. ఉన్నపళంగా అసద్‌ను స్వదేశానికి రప్పించి సైనిక శిక్షణ ఇప్పించి, కల్నల్ హోదా కల్పించి.. భవిష్యత్తు నాయకుడు అసద్ అని సందేశం ఇచ్చారు. అయితే, హఫెజ్ 2000లో మరణించే నాటికి అసద్ వయస్సు 34 ఏళ్లు. కానీ దేశ అధ్యక్షుడు అవ్వాలంటే ఓ వ్యక్తికి కనీసం 40 ఏళ్లు ఉండాలి. అయితే, అసద్ కోసం ఈ కనీస వయస్సు పరిమితిని 40 నుంచి 34కు తగ్గిస్తూ పార్లమెంట్ చట్టం చేసేసింది. దాంతో డాక్టర్ సాబ్ తన తండ్రి వారసుడిగా అధ్యక్షుడు అయిపోయారు.

ఎగతాళి చేసిన ప్రజా వ్యతిరేకతకే తలొగ్గి

ప్రజా వ్యతిరేకతకు తలొగ్గి 2011లో ఈజిప్టు అధ్యక్షుడు ముబారక్ తన పదవికి రాజీనామా చేశారు. ఈజిప్టు నేతల ఈ నిర్ణయాన్ని ఎగతాళి చేస్తూ అసద్ అప్పట్లో ఓ ఈ-మెయిల్ పంపారు. ఇప్పుడు అదే ప్రజావ్యతిరేకతతో అసద్ తన పదవిని కోల్పోవడం, దేశాన్ని వదిలి వెళ్లిపోవడం యాదృచ్ఛికం.


కూల్‌గా కనిపించి క్రూరత్వం చూపిన అసద్



హఫెజ్‌తో పోలిస్తే పాలనపై ఏమాత్రం అనుభవం లేని అసద్ అధికారం చేపట్టిన తొలినాళ్లలో ప్రజానాయకుడిగా వ్యవహరించారు. రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేశారు. హఫెజ్ నిరంకుశత్వానికి అల్లాడిపోయిన ప్రజలు అసద్ శైలి చూసి తమకు ఓ మంచి నాయకుడు దొరికాడని భావించారు. క్రమంగా దేశంలో ప్రజాస్వామ్య విధానాల అమలుకు డిమాండ్లు పెరగ్గా, రాజకీయ పార్టీలు కూడా ఏర్పాటయ్యాయి. దీంతో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు అసద్ 2001లో తన అసలు రంగుని బయటపెట్టారు. ప్రభుత్వ వ్యతిరేకులను కటకటాల్లోకి నెట్టారు. తన తండ్రి లాగే కీలక పదవులను తన భార్య, తమ్ముడు, మరికొందరు సన్నిహితులకు కట్టబెట్టారు. 2010 నాటికి దేశ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. 2011లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు మొదలయ్యాయి. ఈ ఉద్యమాలపై అసద్ ఉక్కుపాదం మోపారు. సొంత ప్రజలపై రసాయన దాడులు, బాంబు దాడులు చేయించి ప్రజాఉద్యమాలను అణిచివేశారు. ఈ క్రమంలో 5లక్షల మందికిపై ప్రజల ప్రాణాలు తీశారు. ఇంత చేసినా దేశంలోని చాలా భాగాలు రెబల్స్ అధీనంలోనే ఉండిపోయాయి. 2015లో అధికారాన్ని కోల్పోయే స్థితికి వచ్చిన అసద్.. రష్యా, ఇరాన్, లెబనాన్‌కు చెందిన హిజ్బుల్లా అండతో ఇన్నాళ్లూ నిలదొక్కుకున్నారు.

కేంద్ర మంత్రుల ర్యాంప్ వాక్

న్యూఢిల్లీ, డిసెంబరు 8: కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, సుకాంత మజుందార్ ర్యాంప్ వాక్ చేశారు. శనివారం ఢిల్లీలోని భారతమండపంలో జరిగిన 'అష్టలక్ష్మి మహోత్సవ్' ఫ్యాషన్ షో ఇందుకు వేదికైంది. ఇద్దరు కేంద్రమంత్రులు ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించేలా కోట్లను ధరించి ఈ షోలో పాల్గొన్నారు. ఈశాన్య భారత సాంస్కృతిక వారసత్వ ప్రదర్శన కోసం ఈ ఫ్యాషన్ షోను ప్రధాని మోదీ ఈ నెల 6న ప్రారంభించారు. 8ఈశాన్య రాష్ట్రాల(అసోం, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, మణిపూర్, మేఘాలయా, సిక్కిం) సంఖ్య వచ్చేలా ఈ ఫ్యాషన్ షోకు అష్టలక్ష్మి అని పేరు పెట్టారు.



శబరిమలలో పంపా నుంచి సన్నిధి వరకు సీసీ కెమెరాలు

శబరిమల, డిసెంబరు 8: శబరిమలలో మొట్టమొదటి సారిగా.. పంపా బేస్ క్యాంప్ నుంచి సన్నిధానం వరకు ప్రతి అంగుళం కవర్ అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పంపా నుంచి శరణ్‌గుత్తి వరకు రెండువైపులా మార్గాలతోపాటు.. నడపందల్, పదునెట్టాంబడి, సన్నిధానం, భస్మకులం ప్రాంతాల్లో మొత్తం 258 హెచ్‌డీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వీటిని రేయింబవళ్లు పర్యవేక్షించేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

'సోరోస్' నిధులిస్తున్న సంస్థతో సోనియాకు సంబంధం: బీజేపీ

న్యూఢిల్లీ: జార్జి సోరోస్ ఫౌండేషన్ నిధులు సమకూరుస్తున్న సంస్థతో సోనియాగాంధీకి సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. కశ్మీర్‌ను స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలనే ఆలోచనకు సోనియా కో-చైర్‌గా ఉన్న ఫోరమ్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా పసిఫిక్ (ఎఫ్‌డీఎల్-ఏపీ) ఫౌండేషన్ మద్దతు ఇచ్చిందని పేర్కొంది. ఈ సంబంధం దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ సంస్థల ప్రభావాన్ని ప్రతిబింబిస్తోందని ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేసింది.

అట్టుడికిన శంభు

అన్నదాతల 'ఢిల్లీ చలో' ఉద్రిక్తం

» కొందరికి గాయాలు.. పాదయాత్ర నిలిపివేత

న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆందోళనలతో పంజాబ్, హరియాణా సరిహద్దు ప్రాంతం శంభు ఆదివారం అట్టుడికింది. కనీస మద్దతు ధర సహా 12 డిమాండ్ల సాధనకు పిలుపునిచ్చిన 'ఢిల్లీ చలో' ఉద్రిక్తంగా మారింది. రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా హరియాణా ప్రభుత్వం శంభూ సరిహద్దులో భారీగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించింది. పోలీసులు పెద్దఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు రైతులు పాదయాత్ర మొదలు పెట్టేందుకు సిద్ధం కాగా అనుమతి ఉంటే చూపించాలని పోలీసులు కోరారు. రైతులు బారికేడ్లు దాటుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ దశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు లాఠీచార్జ్ చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో కొందరు రైతులు గాయపడ్డారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం 'ఢిల్లీ చలో' పాదయాత్రను నిలిపివేస్తున్నట్టు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. పోలీసుల లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంతో ఎనిమిది మందికిపైగా రైతులు గాయపడ్డారు. "పోలీసులు 101 మంది రైతులకు అనుమతి ఇస్తామని చెప్పారు. కానీ అక్కడికి వచ్చిన తర్వాత అనుమతి లేదని లాఠీచార్జ్ చేశారు" అని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు.



పాక్‌కు బంగ్లా మరింత చేరువ!

సెక్యూరిటీ క్లియరెన్స్ లేకుండానే పాక్ పౌరులకు వీసా

కరాచీ నుంచి చిట్టగాంగ్‌కు నేరుగా రవాణా నౌకలకు అనుమతి

న్యూఢిల్లీ/ఢాకా, డిసెంబరు 8: పాకిస్థాన్ మారణహోమాలను అడ్డుకుని.. తన ఆవిర్భావానికి సహకరించిన భారత్ భద్రతకే బంగ్లాదేశ్ ఇప్పుడు ముప్పు తలపెడుతోంది. పాక్‌కు నానాటికీ చేరువవుతూ దానిని సంతృప్తిపరిచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ వీసా కోసం దరఖాస్తు చేసుకునే పాక్ పౌరులు భద్రతాపరమైన నిరభ్యంతర పత్రాన్ని తీసుకోవాలన్న నిబంధనను తీసివేసింది. పాక్‌లోని కరాచీ నుంచి బంగ్లాలోని చిట్టగాంగ్ వరకు సరుకు రవాణా నౌకలను నేరుగా అనుమతించాలని కూడా బంగ్లాదేశ్ నిశ్చయించింది. దీనివల్ల పాక్ ఉగ్రవాద సంస్థల నేతలు యథేచ్ఛగా బంగ్లాలోకి అడుగుపెట్టి.. తనను నష్టపరిచే కార్యకలాపాలు చేపడతారని భారత్ ఆందోళన వ్యక్తంచేస్తోంది. కాగా, ఇస్కాన్ భక్తులకు ఇస్లామిక్ ఛాందసవాదుల నుంచి బెదిరింపులు పెరుగుతున్నాయని ఇస్కాన్ ప్రతినిధి రాధారామ్ దాస్ అన్నారు.

ఉగ్ర కొరియర్లుగా డ్రగ్స్ బానిసలు!

సరిహద్దుల గుండా భారత్‌లోకి చొరబాటు.. పాక్ ఐఎస్‌ఐ కుట్ర

న్యూఢిల్లీ, డిసెంబరు 8: భారత్‌లో ఉగ్రవాదాన్ని మరింతగా పెంచి పోషించేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ సరికొత్త కుట్రలకు పాల్పడుతోంది. దేశంలోని జైళ్లలో ఖైదు చేయబడిన కరుడగట్టిన ఉగ్రవాదులకు కీలకమైన సమాచారాన్ని చేరవేసేందుకు డ్రగ్స్ బానిసలను టెర్రర్ కొరియర్లుగా ఉపయోగించుకుంటోంది. ఈ మేరకు మాదకద్రవ్యాలకు బానిసలైన వ్యక్తులను లేదా మానసికంగా కుంగుబాటుకు గురైనట్లు నటించే వాళ్లను సరిహద్దుల గుండా భారత్‌లోకి చొరబడేలా చేస్తోందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జూలై నుంచి ఇలాంటి పదికి పైగా కేసులు నమోదయ్యాయని, ఆయా సందర్భాల్లో పాకిస్థానీయులు తమ దేశం పాకిస్థాన్ లేదా పీవోకే నుంచి భారత్‌లోకి ప్రవేశించారని అధికారులు తెలిపారు. వీరిలో చాలా మందిని జమ్మూ, పంజాబ్, రాజస్థాన్‌లోని జైళ్లకు పంపినట్లు పేర్కొన్నారు. వీరంతా పాక్ ఐఎస్ఐ కొరియర్లు అని, వీలైన చోట్ల జైళ్లలోని ఉగ్రవాదులకు కీలకమైన సమాచారం అందించే పనిని వారికి అప్పగించినట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయని తెలిపారు. మొబైల్ ఫోన్లు లేదా ఇంటర్నెట్ వినియోగంతో ప్లాన్లు బహిర్గతం అవుతున్నాయని, ఈ నేపథ్యంలో ఐఎస్ఐ ఈ విధానాన్ని ఎంచుకుందని వివరించారు. ఈ చొరబాటు వ్యూహంలో పావులుగా మహిళలు, మైనర్లు కూడా ఉన్నారు.

సరిహద్దుల్లో త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక వ్యవస్థ

జోధ్‌పూర్, డిసెంబరు 8: సరిహద్దుల్లో భద్రతను పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆదివారం రాజస్థాన్‌లో జోధ్‌పూర్‌లోని బీఎస్ఎఫ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నిర్వహించిన బీఎస్ఎఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేజర్ యాంటీ డ్రోన్ గన్ మౌంటెడ్ మెకానిజం మంచి ఫలితాలు ఇచ్చిందని, దీని వల్ల పంజాబ్‌లో పాకిస్థాన్‌తో సరిహద్దు ప్రాంతంలో శత్రు డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతలు 3 శాతం నుంచి 55 శాతానికి పెరిగాయని అన్నారు. రాబోయే రోజుల్లో శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు మరింత పెరగనుందని, దాన్ని ఎదుర్కొనేందుకు బీఎస్ఎఫ్‌లో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని తీసుకురానున్నట్లు అమిత్ షా వెల్లడించారు.

అమ్మా.. నన్ను చంపొద్దే.. ప్లీజ్..!!

- ఆరేళ్ల కొడుకును బావిలోకి తోసి తాను దూకిన తల్లి
- తొలుత కూతురిని నెట్టేందుకు యత్నం
- చంపొద్దని వేడుకోవడంతో చిన్నారిని వదిలేసిన వైనం
- అక్కడికక్కడే మృత్యువాత పడిన తల్లీకొడుకులు
- వికారాబాద్ జిల్లా గేటువనంపల్లిలో ఘటన

నవాబుపేట/ వికారాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఓ మహిళ ఆరేళ్ల వయస్సు ఉన్న తన కన్నకొడుకును బావిలోకి తోసేసి.. అనంతరం ఆమె కూడా బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆ మహిళ తొలుత తన కూతురిని బావిలోకి నెట్టాలని ప్రయత్నించగా.. "అమ్మా నన్ను చంపొద్దు ప్లీజ్" అని వేడుకోవడంతో ఆ చిన్నారిని వదిలేయడంతో ఆ బాలికతో ప్రాణాలతో మిగిలింది. వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట మండలం, గేటువనంపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు, గ్రామ ప్రజల కథనం ప్రకారం.. గేటువనంపల్లికి చెందిన గుల్ల రాములు మోమిన్‌పేట మండలం టేకులపల్లికి చెందిన అరుంధ(32)ను 2008లో రెండో వివాహం చేసుకున్నాడు. రాములు మొదటి భార్య అప్పటికే మరణించింది.


అరుంధ, రిత్విక్ (ఫైల్)

రాములు, అరుంధ దంపతులకు కూతురు ప్రజ్వల(11), కొడుకు రిత్విక్(6) ఉన్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం రాములు శనివారం పొలానికి వెళ్లగా... గేటువనంపల్లికే చెందిన శేఖర్ అనే వ్యక్తితో అరుంధ ఫోన్‌లో మాట్లాడింది. అనంతరం సాయంత్రం నాలుగు గంటలప్పుడు ప్రజ్వల, రిత్విక్‌ను వెంటబెట్టుకుని పొలానికి బయలుదేరింది. దారిలో ఓ బావి వద్ద ఆగి శేఖర్‌తో మరోసారి ఫోన్‌లో మాట్లాడి గుడ్ బై చెప్పింది. ఆ తర్వాత ప్రజ్వలను బావిలోకి నెట్టేందుకు యత్నించగా.. చంపవద్దని ఆమె ఏడవడంతో వదిలేసింది. అనంతరం రిత్విక్‌ను బావిలోకి తోసేసి ఆమె కూడా దూకేసింది. ఘటనా స్థలి నుంచి గ్రామానికి వచ్చిన ప్రజ్వల జరిగిన విషయం కుటుంబసభ్యులకు చెప్పగా బావి వద్దకు చేరుకున్నారు. అప్పటికే తల్లీకొడుకులు చనిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం మృతదేహాలను వెలికి తీయించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ఆస్పత్రికి తరలించి.. అరుంధ తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రుతుస్రావ పరిశుభ్రతపై ఏం చర్యలు తీసుకుంటున్నారు..?

- ప్రణాళిక సమర్పించండి... రాష్ట్రాలను కోరిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 8: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని బాలికలకు రుతుస్రావ పరిశుభ్రత విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు తీసుకుంటున్న కార్యచరణ ప్రణాళికలను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలనూ కోరింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆమోదించిన జాతీయ రుతుస్రావ పరిశుభ్రత విధానం గురించి కేంద్రం ఈ ఏడాది నవంబరు 2న సుప్రీం కోర్టుకు తెలియజేసింది. అయితే దీన్ని జాతీయస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సమగ్ర కార్యచరణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో.. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ దీనికి సంబంధించిన కార్యచరణ ప్రణాళికలు పంపాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాసింది.

బీదర్ హిందూ సభకు మాధవీలత, ప్రమోద్ ముతాలిక్‌పై నిషేధం

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీదర్‌లో నిర్వహిస్తున్న హిందూ జాగృతి సభకు హైదరాబాద్‌కు చెందిన బీజేపీ మహిళానేత మాధవీలత, శ్రీరామసేన వ్యవస్థాపకుడు ప్రమోద్ ముతాలిక్, కాజల్ హిందూస్తానీ హాజరుకాకుండా జిల్లాలోకి వారి ప్రవేశాన్ని నిషేధిస్తూ అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్‌బోర్డు ద్వారా రైతులకు జారీ చేసిన నోటీసుల రద్దు, తదితర డిమాండ్లతో శనివారం రాత్రి నుంచి బీదర్‌లోని సాయి పాఠశాల మైదానంలో హిందూజాగృతి సభ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సభకు ప్రమోద్‌ముతాలిక్, మాధవీలత అతిథులుగా హాజరు కావాల్సి ఉంది. వీరి ప్రసంగాలు రెచ్చగొట్టేలా ఉంటాయన్న ఉద్దేశంతో జిల్లాలోకి ప్రవేశించకుండా అధికారులు నిషేధం విధించారు.

కరెంటు వైరు పడి గాయపడ్డ ఐదేళ్ల బాలికకు రూ.99 లక్షల పరిహారం

- ఉత్తర్వులు జారీ చేసిన జైపూర్ కోర్టు

జైపూర్, డిసెంబరు 8: విద్యుత్తు వైరు పడి గాయపడ్డ అయిదేళ్ల బాలికకు రూ.99 లక్షల పరిహారం చెల్లించాలని జైపూర్‌లోని కోర్టు రాజస్థాన్ విద్యుత్ వితరణ్ నిగం సంస్థను ఆదేశించింది. 2015 మార్చిలో హైటెన్షన్ వైరు తెగిపడడంతో ఆమె చేతులను కోల్పోయింది. దాంతో ఆమె వైద్యం, భవిష్యత్తు ఖర్చుల నిమిత్తం దాదాపు రూ. కోటి చెల్లించాలని ఆదేశించింది. ఆ సొమ్మును బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేయాలని సూచించింది. దానిపై 6% వడ్డీని ప్రతి నెలా ఆ కుటుంబానికి చెల్లించాలని ఆదేశించింది.

విజయసాయిరెడ్డిపై కేసు పెట్టండి

- సీఎంనే బ్లాక్ మెయిల్ చేసేలా ఉన్మాద ట్వీట్లు
- విజయవాడ సీపీకి బుద్దా వెంకన్న ఫిర్యాదు

విజయవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఇష్టానుసారంగా ఎక్స్‌లో ట్వీట్లు చేస్తున్న రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత బుద్దా వెంకన్న ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబును కోరారు. ఈ మేరకు విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆదివారం ఫిర్యాదు చేశారు. అనంతరం కార్యాలయం బయట మీడియాతో మాట్లాడారు. 'విజయసాయిరెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు. మేము అధికారంలోకి రాగానే.. అప్పటికి చంద్రబాబు బతికుంటే జైల్లో వేస్తామని బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేస్తే భయపడిపోతారా? కాకినాడ పోర్టును జగన్ బలవంతంగా లాక్కున్నారనేది వాస్తవం కాదా? కేవీ రావు దగ్గర మీరు ఎలా తీసుకున్నారో చెప్పగలరా? 2019 నుంచి 2024 వరకు వైసీపీ నాయకులు చేసిన దాడులు, దారుణాలు అన్నీ ఇన్నీ కావు. ఎంతో మంది బాధితులు ఇప్పుడు పోలీసులకు, కలెక్టర్లకు ఫిర్యాదులు చేస్తున్నారు. కేవీరావు ఇదే విధంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే కులాన్ని అంటగడతావా? జగన్ తప్పు చేయలేదని, కాకినాడ పోర్టులో వాటాలను లాక్కోలేదని నిరూపించే దమ్ము విజయసాయిరెడ్డికి ఉందా? మీ తప్పులు, పాపాలను ఎత్తి చూపితే కులం పేరుతో కుట్రలు చేస్తారా' అని నిలదీశారు. సీఎంగా ఉన్న చంద్రబాబును బెదిరించినందుకు విజయసాయిరెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పరువునష్టం దావా వేయడానికి అసలు విజయసాయిరెడ్డికి పరువు ఉందా.. అని ఎద్దేవా చేశారు.

నకిలీ రోగులను చూపిస్తే కఠిన చర్యలు

ఎన్ఎంసీ బృందాల తనిఖీల్లో వారిని గుర్తించేందుకు కొత్త మార్గదర్శకాలు

- ఎక్కువమంది రోగులు చేరుతున్నట్లుగా చూపాలని బోధనాస్పత్రుల అడ్డదార్లు
- చెక్ పెట్టేందుకు ఎన్ఎంసీ చర్యలు
- కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు దరఖాస్తులు.. జనవరి 5 తుది గడువు
- సీట్లను 100కు పెంచే యోచనలో సర్కారు

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాలా మెడికల్ కాలేజీలు తమ బోధనాస్పత్రుల్లో రోగులు లేకపోయినా... 'బెడ్ ఆక్యుపెన్సీ' కోసం నకిలీ రోగులను చూపిస్తుండడాన్ని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తీవ్రంగా పరిగణిస్తోంది. ఎన్ఎంసీ బృందాలు తనిఖీకి వచ్చే సమయంలో ఆస్పత్రుల యాజమాన్యాలు ఇలా చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. ఆస్పత్రుల్లో ఉన్న రోగులు అసలా నకిలీయా తేల్చేందుకు ఎన్ఎంసీ ఈసారి కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేసింది. తనిఖీల సమయంలో పెద్దసంఖ్యలో రోగులు అడ్మిట్ అయి ఉంటే... అంతకుముందు కొన్ని రోజులు వరుసగా ఇదే తరహాలో రోగులు ఉన్నారా లేదా అని పరిశీలిస్తామని వెల్లడించింది. పిల్లల వార్డులో చిన్నారులు ఎటువంటి అనారోగ్యం లేకుండా ఆడుకుంటూ ఉన్నా నకిలీ పేషెంట్ల కింద పరిగణిస్తామని తెలిపింది. ఒకే



కుటుంబం నుంచి ఎక్కువమంది అదే ఆస్పత్రిలో చేరినా, ఎక్కువమంది వైద్య శిబిరం పేరుతో ఆస్పత్రికి వచ్చినా వారిని నకిలీ రోగులుగా గుర్తిస్తామని పేర్కొంది. నకిలీ రోగులను చూపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఎంసీ హెచ్చరించింది. కాగా, కొత్త వైద్య విద్య కళాశాలల ఏర్పాటుకు ఎన్ఎంసీ దరఖాస్తులు ఆహ్వానించింది. ఇప్పటికే ఉన్న కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్ల పెంపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే ఏడాది జనవరి 4 వరకు గడువు ఉందని తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు సమాచారం పంపింది. దరఖాస్తులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని వైద్య కళాశాలల్లో అదనపు పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని తనిఖీల నుంచి మినహాయిస్తామని పేర్కొంది. వారిచ్చే స్వీయ ధ్రువీకరణ, సమర్పించే పత్రాల ఆధారంగా భౌతిక తనిఖీల నుంచి మినహాయిస్తామని తెలిపింది.

కొడంగల్‌లో 50 సీట్లా? వందా?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఇప్పటికే సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత 50 ఎంబీబీఎస్ సీట్లతో ఈ కాలేజీని ఏర్పాటు చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులివ్వగా ప్రస్తుతం సీట్ల సంఖ్యను వందకు పెంచే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ అంశంపై స్పష్టత వచ్చిన తర్వాతే కొడంగల్ మెడికల్ కాలేజీ కోసం దరఖాస్తు చేయనున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్నాయి.

జీడిపల్లి క్యాంప్‌పై మళ్లీ మావోయిస్టుల దాడి

మూడు రోజుల్లో రెండోసారి.. బీజీఎల్స్‌తో కాల్పులు.. గాయపడ్డ ముగ్గురు జవాన్లు

- బీజాపూర్‌లో ఇన్‌ఫార్మర్ నెపంతో మహిళ హత్య

చర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మళ్లీ రెచ్చిపోయారు. బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడిపల్లి రెండో పోలీస్ క్యాంప్‌పై శనివారం అర్ధరాత్రి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. నాలుగు రోజుల వ్యవధిలో రెండోసారి మావోయిస్టులు ఈ క్యాంపుపై దాడి చేయడం గమనార్హం. జీడిపల్లిలో సీఆర్‌పీఎఫ్-228కి చెందిన రెండు క్యాంపు లు ఏర్పాటు చేశారు. వీటిలో రెండో క్యాంప్‌పై గత గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు మావోయిస్టులు కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. శనివారం అర్ధరాత్రి అదే క్యాంప్‌పై మావోయిస్టులు మళ్లీ కాల్పులు జరిపారు. సుమారు5 గంటల పాటు బీజీఎల్స్‌తో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు గాయపడ్డారు. కాగా, ఈ రెండు దాడుల ఘటనల్లో మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ నాయకుడు మాద్వి హిడ్మా హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. పథకం ప్రకారం పోలీసు బలగాలను అడవుల్లోకి రప్పించేందుకే ఇలా కాల్పులు జరుపుతూ కవ్విస్తున్నట్లు బలగాలు అనుమానిస్తున్నాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మద్దేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లోడెడ్ గ్రామానికి చెందిన సుక్ర(40) అనే మహిళను ఆదివారం మావోయిస్టులు హత్య చేశారు. తెలంగాణ పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందుకే ఈ హత్య చేసినట్లు మృతదేహం వద్ద మావోయిస్టులు లేఖ వదిలారు.

నేడు తెలంగాణ బంద్‌కు పిలుపు

ఏటూరు నాగారం మండలం చెల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా తెలంగాణ మావోయిస్టు పార్టీ 9వ తేదీ సోమవారం రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు.

వాజేడు ఎస్సై నాకు కొత్త జీవితం ఇస్తానన్నాడు!

- గతం తెలిసే ప్రేమించాడు
- నేనేమీ బ్లాక్ మెయిల్ చేయలేదు
- ఎస్సైతో సంబంధాన్ని వెల్లడించిన యువతి
- వైరల్‌గా మారిన వీడియో

ములుగు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆత్మహత్య కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. ఆత్మహత్య సమయంలో అతడి వద్దే ఉన్న యువతి.. తమ మధ్య ఉన్న సంబంధంపై ఆదివారం పలు విషయాలు వెల్లడించింది. పెళ్లి చేసుకోవాలని తాను హరీశ్‌ను ఒత్తిడి చేయలేదని, డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేయలేదని తెలిపింది. తన గతం గురించి అన్నీ తెలిసిన హరీశ్ కొత్త జీవితం ఇస్తానని మాటిచ్చాడని, ఆత్మహత్య చేసుకునే ముందు నిమిషం వరకు కూడా తనను ప్రేమించాడని తెలిపింది. ఓ మీడియా ఛానెల్‌కు ఫోన్ ద్వారా ఆమె చెప్పిన ఈ సమాచారం వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పెళ్లి విషయమై ఎస్సై హరీశ్ ఆమెతో మాట్లాడిన ఆడియో కూడా అందు లో ఉంది. ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో హరీశ్‌తో తనకు పరిచయం ఏర్పడిందని ఆమె తెలిపింది. ఆయన ఎస్సై అని కొద్దిరోజుల తర్వాత తెలియడంతో గతంలో తనను కొందరు మోసం చేసిన విషయం, కేసుల సమాచారాన్ని చెప్పి న్యాయ సహాయం కోరానని పేర్కొంది. ఈ పరిచయం ప్రేమకు దారితీసిందని తెలిపింది. తనకు కొత్తజీవితం ఇస్తానని చెప్పి తొలుత హరీశే పెళ్లి ప్రస్తావన చేశాడని చెప్పింది. 'మనిద్దరికి పెళ్లి కావాలంటే మా ఉన్నతాధికారుల ఎదుటనైనా, పోలీస్‌స్టేషన్ ముందైనా, నా ఇంటివద్దనైనా ధర్నా చేయాలి' అని సలహా కూడా ఇచ్చాడని తెలిపింది. ఆత్మహత్యకు ముందురోజు తాము ప్రైవే టు రిసార్టులో కలిశామని, ఇద్దరి మధ్య ఏ గొడవా జరగలేదని పేర్కొంది. హరీశ్ సోదరుడి సమక్షంలోనే పెళ్లి గురించి మాట్లాడుకున్నామని చెప్పింది. పెద్దలు ఒప్పుకోకుంటే ఎవరి జీవితం వాళ్లు గడుపుదామని చెప్పానని వెల్లడించింది. హనుమకొండలో పెళ్లిచేసుకుందామని చెప్పి తనను వాహనం వద్దకు వెళ్లాలని పంపించిన హరీశ్.. గడియ పెట్టుకొని తుపాకీతో కాల్చుకున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ రోజు మీడియాతో మాట్లాడే అవకాశమివ్వకుండా పోలీసులు తనను దూరం గా తీసుకెళ్లారని ఆమె తెలిపింది. ఈనెల 3న పేరూరు పోలీసులు ఆ యువతిని సూర్యాపేట జిల్లాలోని స్వగ్రామానికి తీసుకువెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆతర్వాత ఆమె అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. తాజాగా ఆమె చెప్పిన సమాచారమంటూ ఈ వీడియో వెలుగులోకి వచ్చింది.

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

నజ్రుల్ విప్లవ ప్రేమతత్త్వం



"**నేను** ఆర్ఫియస్ (రాత్రి అంధకార దేవత) వేణువును. జ్వర పడిన ప్రపంచానికి నేను నిద్ర తెప్పిస్తాను. ఆయాసపడుతున్న నరక దేవాలయం భయంతో మరణించేలా చేస్తాను. నేను భూమికీ, ఆకాశానికీ విప్లవ సందేశం తెస్తాను. నేను సదా విద్రోహిని. నేను ఈ ప్రపంచానికతీతంగా శిరసు ఎత్తుతాను. చాల ఉన్నతంగా, ఒక్కణ్నే, స్థిరంగా." – కాజీ నజ్రుల్ ఇస్లాం 'విద్రోహి', 1922

భీమా కోరేగావ్ ఎల్గార్ పరిషత్ కేసులో రెండవ ఐదుగురు 28 ఆగస్టు 2018న అరెస్ట్ అయినప్పుడు రోమిలా థాపర్‌తో పాటు ఐదుగురు ప్రముఖులు, ఈ కేసు శోధించడానికి స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ వేయాలని, అందాకా అరెస్టయినవారికి బెయిల్ ఇవ్వాలని సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను 2-1 మెజారిటీతో నిరాకరిస్తూ మా హౌజ్ అరెస్టుకు మరేదయినా సముచితమైన న్యాయావకాశాలు వెతుక్కొమ్మని రెండు నెలల వ్యవధి యిచ్చినపుడు, 'ఈ రెండు నెలలు ఇంటి నుంచి కదలలేరు కదా మా కోసం ఏదైనా పుస్తకం రాయండి' అని ఫోన్ మీద కోరింది గీతా రామస్వామి (హైదరాబాద్ బుక్ ట్రస్ట్ తరఫున). అపుడామె నాలుగు ప్రత్యామ్నాయాలు సూచించింది. వాటిలో రెండే స్పష్టంగా గుర్తున్నాయి. సుభాష్ చంద్రబోస్‌పై లేదా కాజీ నజ్రుల్ ఇస్లాంపై. నేను వెంటనే కాజీ నజ్రుల్ ఇస్లాంపై రాస్తానని ఒప్పుకున్నాను.

ఒక విద్రోహి కవిగా నజ్రుల్ ఇస్లాం గురించి ఎప్పుడు మొదటిసారి విన్నానో చెప్పలేను గానీ నక్సల్బరీతో పాటే అప్పటి తూర్పు పాకిస్తాన్‌గా ఉన్న బాంగ్లాలో కూడ ఆ ప్రభావంతో ఏర్పడిన ఎం.ఎల్. పార్టీ గురించి విన్నాను. ఆ పార్టీ బాంగ్లా విప్లవ సంప్రదాయానికి దోహదం చేసిన తొలి విప్లవ తత్వవేత్తలుగా మౌలానా భషానీ, కాజీ నజ్రుల్ ఇస్లాంలను గుర్తించడం విన్నాను.

1971లో బాంగ్లా జాతీయోద్యమాన్ని సృజన, విరసం తొలి దశలో (ముక్తి ఫౌజ్ ప్రవేశం దాకా) సమర్థించినప్పుడు సాహిత్య అకాడమీ ప్రచురించిన 'నజ్రుల్ ఇస్లాం జీవితం – సాహిత్యం' ఆధారంగా సృజనలో పరిచయం ప్రచురించాం. ఎస్.కె. సంపాదకత్వంలో వెలువడిన 'బాంగ్లాదేశ్‌లో మార్చింగ్ గీతం' కవితానువాదం ప్రచురించాం. నజ్రుల్ ఇస్లాంపై రాయడానికి ఒప్పుకోవడానికి ఆ నేపథ్యం ఉంది.

నేను పూణే ఎరవాడ జైలుకు పోయాక కవిత్వానువాదం మొదలుపెట్టి, కరదీపికగా ఆమె ఇచ్చిన పీటర్ కస్టర్స్ నజ్రుల్‌పై ప్రసంగ వ్యాసాలు చదివాక – కమ్యూనిస్టు విప్లవకారుని నుంచి, విప్లవధార అంతస్స్రోతస్విని గానే ఉంటూ 1921 నుంచి 41 దాకా ఈ దేశం సంపూర్ణ స్వాతంత్ర్యం పొందాలంటే కార్మిక వర్గ రాజకీయ దృక్పథంతోపాటు హిందూ ముస్లిం మత సామరస్యం లక్ష్యాన్ని తీవ్రమైన వ్యగ్రతతో కాజీ నజ్రుల్ ఇస్లాం ఎంచుకున్నాడని అర్థమైంది.

ఆయనకన్నా ముందు ఈ అవసరాన్ని గాంధీ గుర్తించినా ఆయనకు కార్మిక వర్గ దృక్పథం లేదు. ఆయన చేపట్టిన సహాయ నిరాకరణోద్యమంతోపాటు ప్రపంచ రాజకీయాల్లో వచ్చిన ఒక కుదుపు వల్ల 'ఖిలాఫత్' ఉద్యమానికి మద్దతివ్వడంతో భారత స్వాతంత్ర్యోద్యమంలో హిందూ ముస్లింలు కలిసి పని చేసే అవకాశం వచ్చింది. కానీ గాంధీకి అప్పటికి సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యంగా లేకపోవడం, సహాయ నిరాకరణకు అహింస అనే ఒక పరిమితి ఉండడం రెండూ నజ్రుల్ ఇస్లాంకు అసంతృప్తినే కలిగించాయి. 1926లో కృష్ణనగర్‌లో గాంధీ పాల్గొన్న జాతీయ కాంగ్రెస్ సభలో నజ్రుల్ 'కంధహారీ హోషియార్' (కర్ణధారీ జాగ్రత్త) కవిత ద్వారా అసంతృప్తినే చూపాడు.

నజ్రుల్ దేశ స్వాతంత్ర్యం కోసం కలగని అందుకు సైనిక శిక్షణ పొందడానికి 18ఏళ్ల వయసు లోనే సైన్యంలో చేరి కరాచీ పోయాడు. అక్కడ కవిగా మారి, 1917 రష్యాలో బోల్షివిక్ విప్లవ ప్రభావంతో ఉద్యోగం వదిలి, ముజఫర్ అలీ ఆహ్వానంతో కలకత్తా వచ్చి అక్కడే పూర్తి కాలం సాహిత్య రాజకీయోద్యమానికి అంకితమయ్యాడు. అప్పటికింకా పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీగానే పని చేస్తున్న కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడై ఆ పార్టీ కోసం ముజఫర్ అలీ స్థాపించిన 'లంగల్' పత్రికకు సంపాదకుడయ్యాడు. ఇప్పుడు అస్సాంలోని బ్రాహ్మణీయ హిందుత్వ రాజకీయాలు ఈసడింపుగా పిలిచే 'మియా' కవిత్వోద్యమం ఈ లంగల్ (నాగలి)ని, లుంగీని తమ అస్తిత్వ చిహ్నాలుగా ఎంచుకుంది.

ఇంక 'విద్రోహి' కవితతో, 'ధూమకేతు' పత్రికతో నజ్రుల్ బాంగ్లా సాహిత్యాకాశంలోనే కాదు, రాజకీయ భూమికలో కూడ ఒక రాజీలేని 'విద్రోహి' సంప్రదాయానికి ప్రతీక అయ్యాడు.

నజ్రుల్ 5, 6 ఏళ్ల వయసప్పుడే బ్రిటిష్ పాలకులు 1905 బాంగ్లా విభజనకు పూనుకున్నారు. ఈ దేశప్రజలను, ప్రజల ఆయువుపట్టయిన రైతాంగాన్ని హిందూ ముస్లింలుగా చీల్చే కుట్రలో 1857లో చేసిన ఒక ప్రయత్నమే మళ్లీ బాంగ్లాలో చేసారు. మొదటి ప్రయత్నంలో బ్రిటిష్ వలస సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బహదూర్ షా నాయకత్వంలో ఏర్పడిన విశాల ఐక్యసంఘటనను ఓడించి సంస్థానాలను, ఫ్యూడల్ శక్తులను తమకు తాబేదార్లుగా మార్చుకున్నారు గానీ, బ్రిటిషిండియా ఏర్పడి బాంగ్లా రైతాంగాన్ని హిందూ ముస్లింలుగా చీల్చాలన్న కుట్ర మాత్రం విఫలమైంది. దేశ విభజనలో అది సాధ్యమైనా, బాంగ్లా జాతీయ భావన తూర్పు పాకిస్తాన్ ఏర్పడినా అంతర్గతంగా కొనసాగుతూనే ఉన్నది. అందుకు ముఖ్య కారణం 'యుగంతర్' కాలం నుంచి బాంగ్లాలో ఉన్న విప్లవ సంప్రదాయమే. అది తెభాగా, చిటగాంగ్ పోరాటాల్లో నిప్పురవ్వలు ఎగజిమ్మి నాయకత్వ వైఫల్యంతో అణగారిపోయినా మళ్లీ నక్సల్బరీతో స్పష్టమైన రూపాన్ని తీసుకున్నది. అందుకే తెలంగాణలో 1948లో సైనిక జోక్యం వలె బాంగ్లాదేశ్ జాతి విముక్తి పోరాటాన్ని 'ముక్తిఫౌజ్' ప్రధాన స్రవంతి (బూర్జువా) రాజకీయాల్లోకి మళ్లించింది పొరుగు దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ. అయితే ఈ కాలమంతా రవీంద్రుని 'సోనార్ బంగ్లా' వలెనే, నజ్రుల్ ఇస్లాం 'విద్రోహి' భావజాలం బాంగ్లా సాహిత్య, సాంస్కృతిక రంగాలపై తమ ప్రభావాన్ని కొనసాగించాయి. భౌతికంగా నజ్రుల్ 'క్విట్ ఇండియా' ఉద్యమానికన్నా ముందే మాట పడిపోయి, మతిస్థిమితం కోల్పోయిన స్థితిలోకి వెళ్లినప్పటికీ.

చివరకొక ఆవేదన వంటి ఫిర్యాదుతో నజ్రుల్ ఇస్లాంకు మన దేశ స్వాతంత్ర్యోద్యమంలో దక్కవలసిన స్థానం గురించి ప్రస్తావిస్తాను.



వచనం కన్నా కూడా శ్రవణ సంగీతంతో ఉత్తేజపరిచే నజ్రుల్ బాంగ్లా కవిత్వం ఇంగ్లీషు నుంచి తెలుగులోకి వచ్చినపుడు ఎంత మౌలికత కోల్పోతుందో 'ప్రళయోల్లాస్' వంటి కవితను అనువదించినపుడు నాకే అనిపించింది. అయినా ఒక సాహసం చేసాను. నజ్రుల్ నుంచి నేను నేర్చుకున్న విప్లవ ప్రేమతత్త్వం నాలో ఎంత జీర్ణమైందో పాఠకులకు ఎంత అందివ్వగలుగుతున్నానో కాలానికి వదిలేస్తాను.

మతసామరస్యం కోసం ఆయన సాహిత్యం, సంగీతం, రాజకీయాల్లో చేసిన కృషి రవీంద్రుడికీ, గాంధీకీ తీసిపోనిది. మతసామరస్యం కోసం ఆయన ద్వేషం స్థానంలో ప్రేమను నిలపాలని ఎన్నో ప్రయోగాలు చేశాడు. ఈ ప్రేమతత్త్వాన్ని స్థాపించడంలో రూమీ, హఫీజ్‌ల నుంచి, కశ్మీరీ సూఫీ కవిత్వం నుంచి తనకన్నా ముందున్న బాంగ్లా సూఫీ కవుల దాకా అందరినీ ఆకళింపు చేసుకొని బాంగ్లా భక్తి ఉద్యమంలోని సారాన్నంతా గ్రహించి చివరకు వేణువు విరిగిపోయినా పాట ఆగకూడదనే సందేశంతో ఒక ప్రేమభావనతో తన వ్యక్తినే రద్దు చేసుకున్నాడు.

వచనం కన్నా కూడా శ్రవణ సంగీతంతో ఉత్తేజపరిచే నజ్రుల్ బాంగ్లా కవిత్వం ఇంగ్లీషు నుంచి తెలుగులోకి వచ్చినపుడు ఎంత మౌలికత కోల్పోతుందో 'ప్రళయోల్లాస్' వంటి కవితను అనువదించినపుడు నాకే అనిపించింది. అయినా ఒక సాహసం చేసాను. నజ్రుల్ నుంచి నేను నేర్చుకున్న విప్లవ ప్రేమతత్త్వం నాలో ఎంత జీర్ణమైందో పాఠకులకు ఎంత అందివ్వగలుగుతున్నానో కాలానికి వదిలేస్తాను.

■ వరవరరావు

(కాజీ నజ్రుల్ ఇస్లాం సాహిత్యం నుంచి ఎంపిక చేసిన కవితలను, వ్యాసాలను వరవరరావు అనువదిస్తే ఆ పుస్తకాన్ని 'విద్రోహి' పేరుతో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అచ్చు వేసింది. ఈ సందర్భంగా ఈ పుస్తకానికి వరవరరావు రాసిన ముందుమాట నుంచి ఎంపిక చేసిన భాగమిది.)



I'll call you later

సరే
తర్వాతే మాట్లాడుకుందాం
ఈ క్షణం నిర్జీవమైందే

చేతులు ఖాళీగా ఉండి ఉండవు
చుట్టూ జతగాళ్ళు మూగి ఉంటారు
రెండుకాళ్ళపై నిలబెట్టే పని
జీవితాన్నంతా నంజుకు తినేస్తూంటుంది

ఆకలి–
రోజూ టైముకు రాని రైలు బండి
నిద్ర–
నీటిలో కన్నార్పని చేపపిల్ల
ఆశల బహు సుందరమైన దినచర్య–
పులి నోట్లో మెలిపడ్డ బెదురుజింక

చవిచూసేందుకో
రవ్వంత బ్రతుకుతీపి కావాలిప్పుడు

నిజమే
అస్సలు తీరిక లేదు
ఇనుప చువ్వలపై పాకే మనీ ప్లాంట్ తీగ
నాజూగ్గా అల్లుకుంటున్న పక్షుల తావు
ఎప్పటిదో చాలా పాత ఉత్తరం
ఇవన్నీ పేరు చెప్పలేని ప్రేమ పాశాలు
ఎన్నో ఊర్లు తిరిగొచ్చాక తీరే
ఇంటి బెంగ వర్ణించేది కాదు
ఊసుల్ని దోసిలి పట్టలేం

మొబైల్ నంబర్లో అంకెలన్నింటికీ
ఎదురుచూపు అలసట తెలుసు
ఉండబట్టలేకే అవి
మళ్ళీ మళ్ళీ గుండె సవ్వళ్ళై
మోగుతాయి

పోనీలే ఏం ఫర్వాలేదు
కలబోసుకుంటే కడుపు నిండుతుంది

కన్నీళ్ళలోంచి ఒంటరితనం ఒడ్డున పడుతుంది
ఉప్పుసముద్రం రుచిదేలి
ఇసుకలోని గవ్వలన్నీ
పలుకు నేర్చిన చిలుకలవుతాయి

కలవడం-విడిపోవడం
బొమ్మాబొరుసులయ్యాక
ఆదుర్దానే అసలు దిగులు
మాటలు చాలని మాటలుండిపోతాయ్
అక్కరపడి మాట్లాడ్డమే అబ్బురపు పని

వశపడది గానీ,
జర అయినంకే, మనసు కొమ్మకు
తంగేడు పువ్వుల ముడుపు గట్టు
అంతే, అంతకు మించింకేం లేదు

■ శ్రీరామ్ పుప్పాల

✆ 99634 82597

స్థానికతే మా బడి పిల్లల కవిత్వ వస్తువు







తగుళ్ళ గోపాల్

అజిలాపూర్ బడిలో మీరు చదువు చెప్పే పిల్లల చేత కవిత్వం రాయించి, ఆ కవితల్ని 'దేవగన్నేరు' పేరుతో పుస్తకంగా వేశారు. బడి పిల్లల్ని కవిత్వ వ్యక్తీకరణ వైపు మళ్ళించటం సులువైందా, కష్టమైందా?

బడిపిల్లలతో, అందులోను ప్రైమరీ స్కూల్ పిల్లలతో కవిత్వం రాయించడం కొంచెం కష్టమైనదే. నేను అజిలాపూర్ బడి లోనే పన్నెండేళ్ళు పని చేయడం వలన ఇది సాధ్యమైంది. మొదట తప్పులు లేకుండా తెలుగు రాయడం, బాలగేయాలు నేర్పించడం, ఏడవ తరగతికి వచ్చేవరకు వంద పద్యాలు నేర్పించడం చేశాను. దీని ద్వారా ఊర్లో కూడా 'బడిలో బాగా చదువు చెబుతున్నారు, మా పిల్లలను ప్రభుత్వ బడికే పంపాలీ' అన్న చైతన్యం వచ్చింది. పిల్లల చేత కవితలు రాయించాలని అనుకున్నపుడు 'కవిసంగమం' ఫేస్‌బుక్ గ్రూప్‌లో విమర్శకుడు జి. లక్ష్మీనరసయ్య సార్ చెప్పిన కవిత్వ నిర్మాణ విషయాలను పిల్లలకు చెప్పేవాడిని. ఒక మాములు విషయాన్ని ఎట్లా కవిత్వం చేయాలో అనేక ఉదాహరణలతో సందర్భం వచ్చినపుడల్లా చెప్తుండేవాడిని.

"పంట చూస్తే/ పచ్చగానే ఉంది.

ఆ పంట వేసిన రైతు చేతులే/ ఎందుకో ఏడుస్తున్నాయి." – అని కాలె యశ్వంత్ లాంటి పిల్లలు ప్రాసను దాటి కవితలు రాసిన కవిత్వాన్ని ఎక్కువగా వినిపించేవాడిని. ఏదైనా ఒక అంశం ఇచ్చి, వాళ్ళు ఏమనుకుంటున్నారో రాయమని చెప్పి, వాళ్ళ ముందటనే సరిచేసి, 'ఇలా కూడా ఊహ చేయొచ్చు' అనే దానిని బలంగా చెప్పగలిగినాను. ఇది ఒక రోజులో అయ్యే పని కాదు. దీని వెనుక ఆరేడేండ్ల శ్రమ ఉంది. ప్రధానోపాధ్యాయులు డేవిడ్ రాజు, అలివేలు, పూలమ్మ, శ్రీనివాసులు, కట్ట జంగయ్య... ఇంకా ఇక్కడ పని చేసిన టీచర్లందరి సహకారం లేనిది ఈ పుస్తకం లేదు.

పిల్లలు తమ కవిత్వంలో ఎలాంటి ఇతివృత్తాల వైపు ఎక్కువ మొగ్గు చూపటం గమనించారు?

అమ్మ, నాయిన, రైతు, వాన, గురువులు, పల్లె – ఇదే మా దేవగన్నేరుల ప్రపంచం. అమ్మ ప్రేమ దగ్గరనే ఆగిపోలేదు. ఆడపిల్లలను కడుపులనే చిదిమేస్తున్న సమాజాన్ని చూసి దుఃఖపడ్డారు. ప్రశ్నగా నిలబడ్డారు. రైతు గొప్పతనాన్ని వర్ణించడమే కాదు, అన్నం మెతుకు మీద రైతు బొమ్మను కలగంటున్నారు. అజిలాపురంలో తాటిచెట్ల మధ్య నుంచి సూర్యుడు ఉదయిస్తాడు. గౌడన్నలు మోకుముస్తాదు విడిచినంకనే పొద్దు గూట్లో పడుతుంది. ఇక్కడి స్థానికతే మా బడి పిల్లలకు కవిత్వ వస్తువు.

3? మూడు ప్రశ్నలు

ఈ మొత్తం పనిలో మీకు గుర్తుండిపోయే అంశాలు...

అజిలాపూర్ బడిలో ఏ విద్యార్థిని కదిపినా కవితలు అలవోకగా చెబుతూంటారు. మూడవ తరగతిలో ఉన్నప్పుడే కేశమోని అక్షిత, మహమ్మద్ సోను కవితలు రాయడం నా లోపల ధైర్యం నింపింది. బడిని చూడడానికి వచ్చిన అతిథుల, పిల్లల తల్లితండ్రుల కళ్ళలో మెరుపును చూసిన ప్రతి క్షణం గుర్తుండిపోయేదే. కవి యాకూబ్, ఎస్.సి.ఈ.ఆర్.టి సంచాలకులు గాజర్ల రమేశ్ గార్లు మా బడి పిల్లల కవితలు విని మెచ్చుకోవడం ఎప్పటికీ మరిచిపోలేని క్షణాలు.

ఈ 'దేవగన్నేరు' మా నాగర్ కర్నూల్ జిల్లాలోనే ప్రాథమిక పాఠశాల నుంచి వస్తున్న మొదటి కవిత్వ సంకలనం కావడం చాలా ఆనందం. ఊరి వాళ్ళంతా కలిసి దాదాపు యాభై వేల ఖర్చుతో ఊరి పండుగగా 'దేవగన్నేరు' ఆవిష్కరణ సభ గొప్పగా జరిపారు.

✆ 95050 56316



అపురూపం

ఉండాల్సిన దృష్టి ఉండాలే గానీ
సృష్టిలో ఏ మనిషైనా సౌందర్య శిల్పమే
మానవ దేహ నిర్మాణమే
జవ జవలాడే జీవకణజాలం

ఎర్రటి బొగ్గుల మీద చక చకా
కంకులు కాల్చి ఆకలి తీర్చుతున్న
ఆమె నుదురు మీది తడి తడి స్వేదం
మనోహరమై మెరుస్తున్న ప్రతిబింబం

ఒక చేత్తో విసురుతున్న విసనకర్ర
మరోక చేత్తో నిప్పుల మీద మర్లేస్తున్న కంకి
అంటుకున్న బొగ్గుల వేడి విస్తరించి

చిప్పిరి చిప్పిరైన తల వెంట్రుకల మీదా
చెమట పట్టిన చామనఛాయ ముఖమ్మీదా
ఎగిరి పడుతున్న తెల్లని బూడిద నుసి
వెండి పువ్వుల నవ్వుల్లా మెరుస్తున్నాయి

రగ రగ బొగ్గుల మీద బొర్లిచ్చిన
మక్కంకిని చేతికందిస్తూ నవ్విన నల్లని నవ్వు
సహజ సుందర ఫోటోజెనిక్ సొగసు

ఆమె పెదవులకు లిప్‌స్టిక్ పూతా లేదు
ఆమె చెక్కిళ్ళకూ పౌడర్ దట్టించిన దాఖలా లేదు
కనుబొమ్మల కత్తిరింపులూ కనపడలేదు
శ్రమించే చలాకీ రూపమే అపురూప సౌందర్యం.

■ అన్నవరం దేవేందర్

✆ 94407 63479


త్రిపురనేని శ్రీనివాస్ నాలుగు పేజీల ఉత్తరంతో నన్ను ఒప్పించాడు

నా మొదటి పుస్తకం

గాలి నాసరరెడ్డి

ఏప్రిల్ 1990. ఒకరోజు శివారెడ్డిగారు నా చేతికి ఒక ఉత్తరం ఇచ్చారు. అది ఆయనకు త్రిపురనేని శ్రీనివాస్ రాసిన ఉత్తరం. అందులో శ్రీనివాస్ నా ఆచూకీ అడుగుతూ, నా కవితలు పద్నాలుగింటిని ఒక బుక్‌లెట్‌గా వేయాలని అనుకుంటున్నట్టుగా రాశాడు. "అతను నాకు చిక్కకపోయినా నా అంతట నేనే నిర్ణయం తీసుకుని బుక్‌లెట్ వేసేద్దామని అనుకుంటున్నాను" అని కూడా రాశాడు. శ్రీనివాస్ అంతకుముందే 'క్రితం తర్వాత' అనే సంయుక్త కవితను బుక్‌లెట్‌గా ప్రచురించాడు. అది పొడుగ్గా odd size లో ఉంటుంది. శ్రీనివాస్ నాకు ప్రియ మిత్రుడే కానీ నా పుస్తకం ఎలా వేస్తాడో అనే సందేహంతో వద్దని ఉత్తరం రాశాను. అప్పుడు శ్రీనివాస్ "నీ కవిత్వాన్ని అచ్చువేద్దామని నాకు ఎంతగానో అనిపించింది. ఇప్పటికీ అనిపిస్తోంది. నీ కవిత్వం అంటే నాకిష్టం. ప్రేమ" అంటూ నాలుగు పేజీల పెద్ద ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరం చదివాక ఒప్పుకోకుండా ఉండలేకపోయాను. శ్రీనివాస్‌కి కొన్ని కవితలూ, కొన్ని హైకూలూ పంపాను. 'స్వాప్నికమేఘం' అనిగానీ, కవితల సంఖ్యతో గానీ పేరు పెడదామని రాశాను. తర్వాత విజయవాడ వెళ్లి రెండు మూడు రోజులు ఉన్నాను. కవితల సంఖ్యతో పేరు పెట్టడానికే శ్రీనివాస్ ఇష్టపడ్డాడు. '19 కవితలు' అని పుస్తకానికి పేరు పెట్టాలనుకున్నాం. నిజానికి '19 కవితలు' పుస్తకంలో 19 కవితలతో పాటు 5 హైకూలు కూడా ఉన్నాయి. ముఖచిత్రం ఎలా ఉండాలో నేనే చెప్పాను. ఆ విధంగానే టి.వి. ప్రసాద్ చేత ముఖచిత్రం వేయించాడు శ్రీనివాస్.

'19 కవితలు' పుస్తకం 1990 జూన్‌లో విజయవాడలో శ్రీకృష్ణా ప్రింటర్స్‌లో అచ్చయింది. శ్రీనివాస్ కొన్ని కాపీలు మా ఊరికి పంపించాడు. అయితే అప్పుడు నేను హైదరాబాదులో ఉన్నాను. ఒక సభలో నేను దగ్గరికి వెళ్లగానే కె.కె. రంగనాథాచార్యులుగారు "నీ పుస్తకం చదివాను. చాలా కాలం తర్వాత హాయిగా కవిత్వం చదువుకున్నానని పించింది" అన్నారు. అదే ఆ పుస్తకానికి నేను పొందిన తొలి ప్రశంస. అప్పటికి ఇంకా నేను పుస్తకం చూడనే లేదు. తర్వాత 'ఉదయం' పత్రికాఫీసుకు వెళ్లి కూచిమంచి ఉదయ్ దగ్గర చూశాను. పుస్తకం ఎంతో అందంగా కనిపించింది. ఆ తర్వాత నా కాపీలు నాకు అందాక, ముందుగా నా చిన్నచెల్లెలు మాధవీలతకు ఒక కాపీ పోస్టులో పంపాను.



'19 కవితలు' పుస్తకానికి నేను ఊహించని ప్రశంస లభించింది. తల్లావఝల శివాజీ, వాడ్రేవు చినవీరభద్రుడు సమీక్షలు ఎంత బాగా రాశారో! చేకూరి రామారావు 'చేరాతలు'లో పెద్ద వ్యాసం రాశారు. ఆరుద్ర, శేషేంద్ర, ఇస్మాయిల్ ప్రభృతులు అభినందిస్తూ ఉత్తరాలు రాశారు.

ఇటీవల 2020లో పసునూరు శ్రీధర్‌బాబు '19 కవితలు' గురించి రాసిన వ్యాసం లోని మాటలు ఇవి: "త్రిపురనేని శ్రీనివాస్ ప్రారంభించిన కవిత్వం ప్రచురణల్లో మూడో పుస్తకంగా 1990లో అచ్చయిన ఈ పుస్తకం అప్పట్లో ఒక సెన్సేషన్. గాలి నాసరరెడ్డి అంటే అప్పటికే ఏర్పడిన ఇష్టంతో ఈ పుస్తకాన్ని ప్రేమగా చేతుల్లోకి తీసుకున్నాను. ఆ ఇరవై పేజీల పుస్తకాన్ని అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ ఎన్నిసార్లు చదివానో! శ్రీశ్రీ 'మహాప్రస్థానం' చదివాక తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' చదవకుండా ఉంటే ఏమైపోయేవాడినో కవిత్వంలో అనిపిస్తుంది ఇప్పటికీ నాకు. అలాగే, ఎనభైల తరువాత వచ్చిన ఆధునిక కవిత్వంలో ఈ '19 కవితలు' నా జీవితంలోకి రాకుంటే ఎలా ఉండేదో అన్న ప్రశ్న కూడా నన్ను వెంటాడుతుంటుంది."

వర్తన ఆరవ సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆరవ సమావేశం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డిసెంబర్ 12 సా.6గం.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం – ఆవశ్యకత ఆచరణ' అంశంపై సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి గుడిపాటి అధ్యక్షత వహిస్తారు.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

'జస్ట్ ఎ హౌజ్ వైఫ్' కవిత్వ సంపుటి

కుందుర్తి కవిత రాసిన కవిత్వ సంపుటి 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్'తో పాటు ఫ్రీవర్స్ ఫ్రంట్ వాట్సాప్ సమూహం పోటీ కవితల సంకలనం 'ఆనవాళ్ళు' పుస్తకాల ఆవిష్కరణ డిసెంబరు 14న రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో శివారెడ్డి, శిఖామణి, శీలా సుభద్రాదేవి, అనిల్ డ్యానీ, శ్రీరామ్, సమత పాల్గొంటారు.

ఫ్రీవర్స్ ఫ్రంట్ ప్రచురణలు

రాయలసీమ మహాకవిసమ్మేళనం

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ మహాకవిసమ్మేళనం డిసెంబరు 15 తేదీన అనంతపురం లోని యస్.యస్.బి.యన్ కాలేజి ఆడిటోరియంలో జరుగుతుంది. రాయలసీమ ప్రముఖులపై 140 మంది కవులు కవితాగానం చేస్తారు. తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి, మెట్టుపల్లి సుదర్శనరెడ్డిల స్మారకంగా ఈ కార్యక్రమం జరుగుతున్నది. వివరాలకు: 99639 17187.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి

ఉమ్మడిశెట్టి అవార్డు 2024

37వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు – 2024 కోసం కవుల నుండి కవితా సంపుటాలు ఆహ్వానిస్తున్నాము. 2024లో ప్రచురింప బడిన కవితా సంపుటాలు నాలుగు ప్రతులను జనవరి 10, 2025లోగా ఈ చిరునామాకు పంపాలి: రాధేయ, చైర్మన్, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్, 13-1-606-1, షిర్డీ నగర్, రెవిన్యూ కాలనీ, అనంతపురం – 515001, ఫోన్: 9985171411. అవార్డు విజేతకు రూ.ఆరువేల నగదు, షీల్డ్ తో సత్కారం ఉంటుంది.

రాధేయ



నిధులివ్వండి



అధ్యక్షా..!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



- నగరంలో మెట్రో రైల్, ఐటీ పార్కు విస్తరణ ఏమవుతుందో..?
- మడికొండలో వీవర్స్ పార్కు, ఘన్‌పూర్‌లో లెదర్‌పార్కుపై ఆశలు
- ములుగులో బిల్ట్ ఫ్యాక్టరీ, మేడారం అభివృద్ధికి ఆమోదం లభించేనా?
- భూపాలపల్లిలో మైనింగ్ యూనివర్సిటీపై కార్మికుల్లో ఉత్కంఠ
- పాలకుర్తి-చెన్నూరు రిజర్వాయర్, జనగామలో పాలిటెక్నిక్ కాలేజీకి మోక్షం వచ్చేనా?
- దొర్నకల్‌లో వంతెనలు, జూనియర్, డిగ్రీ కాలేజీల మంజూరుకు డిమాండ్
- మహబూబాబాద్‌లో భూగర్భ డ్రైనేజీ, భారీ పరిశ్రమలపై ఆశలు
- పురోగతి లేకుండా పడి ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి..
- ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు గళం విప్పాలంటున్న ప్రజలు

8

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత అంతటి ప్రాధాన్యమున్న ఓరుగల్లు అభివృద్ధి మరింత ముందుకు సాగాల్సి ఉంది. కాంగ్రెస్ యేడాది పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.10వేల కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. ఏళ్ల తరబడి ఆగిపోయిన పనులకు మోక్షం కలిగినట్లు అయింది. అయినా ఇంకా కొన్ని పనులు పురోగతి లేకుండా పడి ఉన్నాయి. ఇవి పూర్తికావాలని స్థానిక ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఎన్నికల్లో సైతం నాయకులు స్థానిక అంశాలను ప్రచారంలో వినియోగించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు అవకాశమొచ్చింది. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు గళం విప్పాల్సిన అవశ్యకత ఏర్పడింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా నగరంలో ప్రతిపాదనలో ఉన్న మెట్రో రైలు, ఐటీ పార్కు వి స్తరణపై నగర పరిధి ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి. అలాగే ములుగు జిల్లాలోని కమలాపురం బిల్ట్‌ఫ్యాక్టరీ, మేడారం అభివృద్ధి ప్రణాళికలపై స్పందించాలి. ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, రోడ్లు, యూనివర్సిటీలపై సర్కారు దృష్టికి శాసన సభ్యులు తీసుకెళ్లాల్సి ఉంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



రైతుల కృషితోనే చపాటా మిర్చికి గుర్తింపు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



తిమ్మంపేటలోని చిల్లీ ఫార్మర్ సొసైటీ డైరెక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

దుగ్గొండి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చపాటా మిర్చికి జియోగ్రాఫికల్ ఇండెక్స్ ట్యాగ్ (జీఐ) లభించడం నర్సంపేట ప్రాంత రైతుల కృషి ఫలితమేనని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని తిమ్మంపేట చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ కంపెనీ లిమిటెడ్ సంఘం డైరెక్టర్లను ఆదివారం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సన్మానించి మాట్లాడారు. చపాటా మిరపకు జీఐ ట్యాగింగ్ కోసం దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటలో ఏర్పాటుచేసిన మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ వారు రెండేళ్ల కిందట దరఖాస్తు చేసుకోగా ఇండియన్ పేటెంట్ ఆఫీసు వారు తాజాగా ఆమోదించారన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట రూరల్, నల్లబెల్లి, దుగ్గొండి మండలాల్లో చపాటా రకం మిర్చిని రైతులు పండించడంలో ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ఈ ప్రాంతంలో పండించిన మిర్చి పంటకు అంతర్జాతీయస్థాయిలో ప్రామాణికం కలిగినదిగా పేరు రావడంవల్ల అధిక ధర లభిస్తోందన్నారు. ఈ ప్రాంతంలో మిర్చి అధికంగా పండించడం వల్ల నల్లి పురుగు, తామ పురుగు లాంటి రావడంతో రైతులు నష్టపోవడం గుర్తించి ముంబాయి, బెంగుళూరు నుంచి సైంటిస్టులను పిలిపించి జాతీయ ల్యాబ్ ద్వారా పరీక్షలు చేయించారన్నారు. 2019లో ఈ ప్రాంతంలో ఎక్కడాలేని విధంగా చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలను (ఎఫ్‌పీవోలు) ఏర్పాటు చేసి మిర్చి రైతుల యూనిట్‌లకు పలు పరిశోధన సంస్థలను సంప్రదించి చపాటా మిరప పంటకు గుర్తింపు లభించే విధంగా కృషి చేశారన్నారు. ఆ ప్రయత్నం ఫలితంగా రాష్ట్రం నుంచి జీఐ ట్యాగ్ సాధించిన 18వ ఉత్పత్తిగా చపాటా జిల్లాలోని ఈ ప్రాంతం నిలిచిందన్నారు.

ఈ నియోజక వర్గంలో 89 ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేయగా. ఎఫ్‌పీవోల కింద 32వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారని పెద్ది పేర్కొన్నారు. నియోజకవర్గంలో బుధరావుపేట, నర్సంపేట పట్టణంలో ప్రభుత్వ సొమ్ముతో ఏర్పాటు చేశారన్నారు. వీటి ద్వారా రైతులకు మంచి ఫలితాలు వస్తాయన్నారు. స్వతంత్రంగా వ్యాపారం చేయడం, రైతులు కోరిన విధంగా మందులు అందించడంతోపాటు నకిలీ వి త్తనాలు, మందుల బెడద లేకుండా చేసుకున్నారన్నారు. స్పైసిస్ బోర్డు ద్వారా మి ర్చి రైతులకు సబ్సిడీలు, శాస్త్ర వేత్తలు సూచనలు చేసే విధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా తిమ్మంపేట ఎఫ్‌పీవో సంఘం అధ్యక్షుడు నరహరి రాజ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్లు సొడారపు శోభన్‌బాబు, పోశాల పాణి, పాలడుగుల చంద్రమౌళి, పొదిల రాజేందర్, ఈదుల అశోక్, బొడె కర్నాకర్‌రెడ్డిలను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, సొసైటీ చైర్మన్ సుకినె రాజేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, అనుమాండ్ల సమ్మిరెడ్డి, తోటకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ఓవర్‌టేక్!

క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డీసీఎం డ్రైవర్ మృతి

బైక్‌ను దాటేస్తుండగా డీసీఎంను ఢీకొన్న కారు

కారు డ్రైవర్, బైకర్‌కు తీవ్రగా గాయాలు

ఐనవోలు మండలం పంథిని వద్ద ఘటన



చింత చెట్టుకు ఢీకొని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ లక్ష్మణ్, చింతచెట్టుకు ఢీకొట్టిన డీసీఎం

ఐనవోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డీసీఎం - కారు ఢీకొన్న ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని పంథిని గ్రామంలో వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారి (563)పై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. హనుమకొండ నుంచి కొడకండ్ల వైపు వెళ్తున కారు.. పంథిని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపంలో బైక్‌ను ఓవర్‌టేక్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వరంగల్ వైపు పత్తిలోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ కారుకు కుడివైపు ముందు భాగాన తగిలింది. దీంతో అదుపుతప్పి పక్కనే ఉన్న చింతచె ట్టును ఢీకొట్టి ఆగిపోయింది. డీసీఎం క్యాబిన్‌లో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలం కాతర్లపాడు గ్రామానికి చెందిన డ్రైవర్ వేమ లక్ష్మణ్ (40) ఇరుక్కుపోయాడు. దీంతో బ్యాకోలోడర్ (జేసీబీ) సహాయంతో డీసీఎం డ్రైవర్‌ను అతీకష్టంమీద బయటికి తీశారు. ఒక కాలు విరిగి కడుపులో బలమైన గాయాలు కావడంతో వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా మృతిచెందాడు. ఈ ప్రమాదంలో కారులో భార్యతో వెళ్తున్న కొడకండ్లకు చెందిన పేరం శ్యాంసుందర్ కాలు విరిగింది. అదే సమయం లో బైక్‌పై వెళ్తున్న నకిరేకల్‌కు చెందిన రవీందర్‌కు గాయాలయ్యాయి. గాయపడి న ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో 30 నిమిషాలు ట్రాఫిక్ జామ్ అయింది. ఎస్సై సిబ్బందితో కలిసి రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అటుగా వచ్చారు. తన వాహనం దిగి సంఘటనా స్థలంలో చింత చెట్టుకు డీసీఎం ఢీకొని క్యాబిన్‌లో ఇరుక్కపోయిన డ్రైవర్‌ను బయటికితీసేంత వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎంజీఎం వైద్యులకు ఫోన్‌చేసి సూచించారు.

అన్ని రంగాల్లో ఘన్‌పూర్ అభివృద్ధే లక్ష్యం

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మడికొండలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



మడికొండలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన స్టేషన్ ఘన్‌పూర్ నియోజకరవ్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మడికొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌హాల్లో ఆదివారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఆశీర్వదించి అక్కున చేర్చుకున్న నియోజకవర్గ ప్రజలకు యేడాదిగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని అన్నారు. ని యోజకవర్గ అభివృద్ధికి రూ.750 కోట్లు మంజూరు చే యించానని అన్నారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వి ద్యను అందించేందుకు రూ.200 కోట్లతో యంగ్ ఇండి యా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, రూ.45 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, రూ.26కోట్లతో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్, రూ.148కోట్లతో ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబ్‌పేట రిజర్వాయర్ మెయిన్ కెనాల్ సీసీ లైనింగ్, రూ.30కోట్లతో డిగ్రీ కళా శాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానన్నా రు. నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇండ్లతో పాటు అదనంగా మరో 1500 ఇండ్లు మంజూరి చేయించినట్లు తెలిపారు. రూ.10కోట్లతో కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, రూ.15కోట్లతో ఘన్‌పూర్ నుంచి మల్లన్న గండి వరకు పీఆర్ రోడ్డు నిర్మాణం మొత్తం రూ.750కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు తీసుకు వచ్చినట్లు, త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని కడియం స్పష్టం చేశారు. యేడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భు త విజయాలు సాధించిందన్నారు. కానీ ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీపై విషప్రచారం చేస్తున్నాయని ఆరోపిం చారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అధికారంలోకి రావాల ని అసత్య ప్రచారాలు, తప్పుడు ప్రచరాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌పార్టీ సాధించిన విజయాలను సాక్ష్యాధారాలతో నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరా రు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మ క మార్పులకు శ్రీకారం చుట్టిందని, రాష్ట్రంలో ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే 66లక్షల 70వేల ఎకరాలలో వరిసాగు చేసి కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండిం చినట్లు, ఇది ఆల్ టైమ్ రికార్డు అని వెల్లడించారు. కాళేశ్వరం నీళ్ల లేకుండానే ఇంత పెద్దఎత్తున ధాన్యం పంట దిగుబడి సాధించామని ఇది, కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయం అని తెలిపారు. ఏడాదిలోనే 25 లక్షల 35వేల 964 మంది రైతులకు 20వేల 617 కోట్ల పంట రుణాలు మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఒక సంవత్సరంలోనే 55 వేల 143 ఉద్యోగ నియామకాలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని వెల్లడించారు. బీజేపీ 11ఏళ్లలో రాష్ట్రానికి చేసిందేం లేదని, బీఆర్ఎస్ 10 ఏళ్లలో విచ్చలవిడిగా అ ధికార దుర్వినియోగానికి పాల్పడి, భూకబ్జాలకు పాల్ప డి వేల కోట్ల ఆస్తులు సంపాదించిందని ఆరోపించారు.

ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని అన్నారు. అందుకే వరంగల్ సమగ్ర అభివృద్ధికి రూ. 5 వేల కోట్లు మంజూరు చేశారన్నారు. ఎన్నో ఏళ్ల కల రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మామునూరు ఎయిర్‌పోర్ట్, మెగా టెక్స్‌టైల్ పార్క్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయని గుర్తు చేశారు. తాను ఎంపీగా ఉన్నపుడు ఈ అభివృద్ధి కార్యక్రమాలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నష్కల్ నుంచి హసన్‌పర్తి, నష్కల్ నుంచి చింతలపల్లి వెళ్లే రైల్వే బైపాస్ లైన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. త్వరలోనే కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మార్కెట్ కమిటీ, దేవాలయ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లకు యూత్ కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్మన్ లావణ్యరెడ్డి, అమృతారావు, శివరాజ్‌యాదవ్, బెలిదె వెంకన్న, నరేందర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్‌రెడ్డి, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నర్సంపేటలో అయ్యప్ప పల్లివేట ఊరేగింపు



‘పేట’లో వైభవంగా ‘పల్లివేట’

- అయ్యప్పదేవాలయంలో ప్రత్యేక పూజలు
- గురుస్వామి వెంకటేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు
- గోగుల రాణాప్రతాప్‌రెడ్డి దంపతులతో ఉత్సవం
- నర్సంపేటలో మార్మోగిన అయ్యప్ప స్వామి నామస్మరణ

8



నేరస్థుల పాలిట ‘అంబిస్’ అస్త్రం

- వేలిముద్రలతో పాటు రూపురేఖలు నిక్షిప్తం
- అంబిస్‌లో అప్‌లోడ్ అయితే ఎక్కడున్నా దొరికిపోవాల్సిందే..
- పైలట్ ప్రాజెక్టులో భాగంగా హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఎంపిక

6

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! నా క్లయింటు శ్రీ అడి నరసింహా రావు, తండ్రి : కీ॥శే॥ వెంకటేశ్వర్‌రావు అడి, వయస్సు : 66 సం॥లు, వృత్తి : విశ్రాంత న్యాయవాది, నివాసం : ఇంటి నెం. 1-7-1113/1/502, అడి రెసిడెన్సీ, అడ్వకేట్స్ కాలనీ, హనుమకొండ మండలం, హనుమకొండ జిల్లా వాస్తవ్యులు స్థిరాస్థిని కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని యుండగా ఈ దిగువ షెడ్యూలు దాఖల గల ఓపెన్ ప్లేస్ యొక్క సర్వే నెం. 851, విస్తీర్ణం : ఎ.1-32 గుంటలు, హంటర్ రోడ్, హనుమకొండ జిల్లా, యందు కలదు. శ్రీ అడి నరసింహా రావు, తండ్రి : కీ॥శే॥ వెంకటేశ్వర్‌రావు అడి, నివాసం ఇంటి నెం. 1-7-1113/1/502, అడి రెసిడెన్సీ, అడ్వకేట్స్ కాలనీ, హన్మకొండ మండలం, హనుమకొండ జిల్లా వాస్తవ్యులు గారు సదరు ఆస్థిని శ్రీ బొబ్బా వెంకటసుబ్బా రావు మరియు ఇతరుల నుండి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం.503/1978 ద్వారా కొనుగోలు చేసినటువంటి ఇట్టి భూమికి వీరు నిజమైన యజమానులు సదరు ఆస్థికి సంబంధించి నటువంటి ఇట్టి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం.503/1978, తేది : 03-12-2024 రోజున కాజీపేట నుండి మడికొండకి బైక్ పైన వెళ్తుండగా పోయినది. కావున నా క్లయింట్ సదరు విషయమును విశ్వసించి తెలియపరచనైనది.

తేది : 08-12-2024

సం/- సి. హెచ్. ఆగా రెడ్డి
అడ్వకేట్ - నోటరి
నక్కలగుట్ట, ఆంధ్రాబ్యాంక్ ప్రక్కన, హన్మకొండ, హనుమకొండ జిల్లా. సెల్ : 9490380382

ఘనంగా ఉమెన్ క్రిస్మస్ వేడుకలు

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ఆదివారం రాత్రి జరిగిన ఉమెన్స్ క్రిస్మస్ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్రీస్తు ప్రవచించిన ప్రేమ, శాంతి మార్గాన్ని ప్రతీ ఒక్కరు అనుసరిస్తే సుఖశాంతులతో జీవించవచ్చన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యేసు క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సీతక్క కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీబీసీ అధ్యక్షుడు టి.శాంతి స్వరూప్, క్రిష్టఫర్, విద్యాకర్, విల్సన్, బాబీ, జాన్సన్ తదితర సంఘ సభ్యులతో పాటు సీనియర్ పాస్టర్ రెవ.జి.జే.నిరంజన్‌బాబు, రెవ. మోజెస్, రెవ.మైఖల్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ సీబీసీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నేడు బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 08 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

సకాలంలో బిల్లులు సమర్పించండి

జిల్లా ఖజానా కార్యాలయ అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్



ముఖాముఖి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ అయిన ఉద్యోగులకు 9 నెలలుగా బెనిఫిట్స్ రావడం లేదు. కారణమేంటి?

జిల్లా ఖజానా కార్యాలయ అధికారి: ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని బట్టి విడతల వారీగా ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ మంజూరు చేస్తోంది.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు వస్తున్నాయా? ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా?

అధికారి: ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు కూడా 1వ తేదీనే వారి వారి వ్యక్తిగత ఖాతాలలో జమ అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం జీతాల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది ఉండటం లేదు.

ఆంధ్రజ్యోతి: పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ ఎప్పటివరకు ఇవ్వవచ్చు?

అధికారి: పెన్షనర్లు మీసేవా ద్వారా లైఫ్ సర్టిఫికెట్ దరఖాస్తు చేసుకోవచ్చు. జీవన్ ప్రమాణ్ పాత్ర్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో చేసి ధ్రువీకరించుకోవచ్చు. టీఫోలియో యాప్ ద్వారా కూడా ఎంటర్ చేసి పంపించొచ్చు. పెన్షనర్లే నేరుగా జిల్లా ఖజానా కార్యాలయానికి వచ్చి సబ్‌మిట్ చేయవచ్చు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారు.. వారికి నెలకు ఎంత చెల్లిస్తున్నారు?

అధికారి: హనుమకొండ జిల్లాలో 4వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు, 14వేలకు పైగా పెన్షనర్లు ఉన్నారు. పెన్షనర్లకు నెలకు రూ.20కోట్ల వరకు చెల్లిస్తాం. ఉద్యోగులకు రూ10కోట్ల వరకు చెల్లిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ట్రెజరీ ద్వారా వివిధ వర్గాల ఉద్యోగులకు చెల్లింపులు ఎలా జరుగుతున్నాయి?

అధికారి: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపులు, సాధారణ చెల్లింపులు అంతా ఈ-కుబేర్ ద్వారా జరుగుతున్నాయి.



సురేష్‌ను పరామర్శిస్తున్న ఈగ మల్లేశం

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

వర్ధన్నపేట, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నాగెల్లి సురేష్ అనారోగ్యంతో బాధపడుతుండగా కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం ఆదివారం సురేష్‌ను ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటానని హామీ ఇస్తూ ధైర్యం చెప్పారు. ఈ పరామర్శలో మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, నాయకులు సిలువేరు కుమారస్వామి, రెండవ వార్డు కౌన్సిలర్ తుమ్మల యాకయ్య, కరిమిళ్ల సంపత్‌రావు, సిలువేరు రాజు, రాజాలు, మహేష్ తదితరులు ఉన్నారు.

మల్లన్న స్వామికి సుధావళి వర్ణలేపనం

రేపటి నుంచి స్వామి వారి దర్శనం, ఆర్జిత సేవలు నిలిపివేత

16న ఐనవోలు మల్లిఖార్జున స్వామికి దృష్టికుంభం

ఐనవోలు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి - 2025 జాతరను పురస్కరించుకొని మంగళవారం నుంచి ఆదివారం వరకు స్వామి అమ్మవార్లకు సుధావలి వర్ణలేపనం(రంగులతో అలంకరణ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 16న ధను సంక్రమణం ప్రారంభమౌతున్నందున ఈనెల 10న మధ్యాహ్నం నుంచి 15 వరకు 6 రోజుల పాటు స్వామి వారి నిజరూప దర్శనం, అర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. అభిషేకాలు, అర్చనలు, కల్యాణం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించమని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు ముఖ మండపంలోని ఉత్సవ విగ్రహాల దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. 16న సోమవారం స్వామి వారికి నిర్వహించే 'దృష్టి కుంభం నేత్రోన్మీలన' తరువాత స్వామి వారి పునర్ దర్శనం, గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని, భక్తులు గమనించి సహకరించాలని ఈవో, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్‌శర్మ, ఐనవోలు మధుకర్‌శర్మలు కోరారు.

దేశ సమగ్రతకు చరిత్ర దోహదం

రెండో రోజు చరిత్రకారుల టెక్నికల్ సెషన్లు ● విలువైన పరిశోధన పత్రాలు - చరిత్రపై సమాలోచనలు ● నేటితో ముగియనున్న హిస్టరీ విభాగం సదస్సు



సదస్సుకు హాజరైన చరిత్రకారులు, ప్రొఫెసర్లతో పరిశోధకులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 8: దేశ సమగ్రతకు చరిత్ర అధ్యయనం దోహదపడుతోందని ప్రముఖ చరిత్రకారులు, మహారాష్ట్ర బాంబే వర్సిటీ ప్రొఫెసర్ అనురాధ కె.రణడే, ఉత్తరప్రదేశ్ ప్రొఫెసర్ విరాత్ కెత్కర్‌లు అభిప్రాయపడ్డారు. రెండు రోజులుగా కేయూ సెనెట్ హాల్‌లో చరిత్ర, టూరిజం నేతృత్వంలో ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ సదస్సు జరుగుతోంది ఈ సందర్భంగా ఆదివారం ఉదయం, మధ్యాహ్నం దేశ విదేశాల నుంచి హాజరైన చరిత్రకారులు, ప్రొఫెసర్లు పలు అంశాలపై పరిశోధన పత్రాలను టెక్నికల్ ప్రొజెక్టర్‌లో సెషన్ల వారిగా సమర్పించారు. అనేక చారిత్రక అంశాలపై సదస్సులో వక్తలు సమాలోచనలు చేశారు. కేయూ ఆర్ట్స్ డీన్, సదస్సు లోకల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, కేయూ చరిత్ర, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ సదస్సును సమన్వయం చేశారు.

ఆదివారం సెనెట్‌హాల్‌లో జరిగిన టెక్నికల్ సెషన్‌లో డాక్టర్ అనురాధ కె.రణడే అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ విశాల్ కేత్కర్, అనిల్ కుమార్ ఆర్‌వీ, దీపక్ సూర్యవతి, స్వప్న హెమత్ సామ్యూల్, చారుశీల బి.చంద్రబోస్‌లు పత్రసమర్పణలు చేశారు. అలాగే మధ్యాహ్నం జరిగిన టెక్నికల్ సెషన్‌లో డాక్టర్ డి.సూర్యకుమార్ అధ్యక్షత వహించగా డాక్టర్ డి.రామచంద్రారెడ్డి, డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, డి.రమేశ్ చంద్రబాబు, బి.చారుమతి, పి. బాలమురుగన్‌లు పరిశోధన పత్రాల సమర్పణలు చేశారు. సాయంత్రం జరిగిన టెక్నికల్ సెషన్‌కు డాక్టర్ కొండా శ్రీనివాసులు అధ్యక్షత వహించగా రాజేశ్‌కుమార్, సోమేశ్‌చంద్ర శ్రీవాస్తవ, బిను మోహన్ అధికర్, ప్రియఠాకూర్ విలువైన పరిశోధన పత్రాలను సమర్పించారు. అలాగే సెనెట్ హాల్‌లో జరిగిన మరో సెషన్‌కు డాక్టర్ సుస్మిత బసు మజుందర్ అధ్యక్షత వహించగా రష్యాకు చెందిన అలెగ్జాండర్ ఎ.స్టొల్యరోవ్, యూ.జగన్నాథ, జి. విజయలక్ష్మి, ప్రియా ఠాకూర్, రఘునాథ్ బొకిల్, నిహార్ రంజన్ పాత్ర, స్మిత హల్దార్‌లు పరిశోధన పత్రాలను సదస్సు ప్రొజెక్టర్ సహాయంతో సమర్పించారు. ఈ సందర్భంగా అరుదైన చరిత్రకారులతో ప్రొఫెసర్లు, అధ్యాపకులు, దేశవిదేశాల నుంచి హాజరైన చరిత్రకారులు ఫొటోలు దిగారు.

సదస్సులో ప్రొఫెసర్ బి.రామచంద్రారెడ్డి అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కృష్ణసుమంత్, డాక్టర్ ఉప్పయ్య, డాక్టర్ వై.రాంబాబు, డాక్టర్ బలుగూరి రాజు డాక్టర్ కేవీఎస్ నరేందర్, డాక్టర్ దామెర భిక్షపతి, డాక్టర్ ఆకులపల్లి కుమారస్వామి, డాక్టర్ ఎమ్డీ రహీం, డాక్టర్ ఎం.రవి, డాక్టర్ ఏకాంబరం పాటు దేశ, విదేశాల నుంచి ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. కాగా సాయంత్రం టెక్నికల్ సెషన్ల అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అకట్టుకున్నాయి.

గురుకులాలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలి

టీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్



సమావేశంలో మాట్లాడుతున్న బైరపాక ప్రశాంత్

కేయూ క్యాంపస్, డిసెంబరు 8: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలు, నిర్లక్ష్య వైఖరితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులు, కస్తూర్బాగాంధీ పాఠశాలల విద్యార్థులు చనిపోతున్నారని, నాసిరకం భోజనాలు, కల్తీతో నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు, గురుకుల బాట ఇన్‌చార్జి బైరపాక ప్రశాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాచర్ల శరత్ చంద్రతో కలిసి మాట్లాడారు. గత నెల 30 నుంచి ఆదివారం వరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలోని గురుకులను బీఆర్‌ఎస్వీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు 'గురుకుల బాట' నిర్వహించి సమస్యలపై అధ్యయనం చేసినట్లు తెలిపారు. తాము సందర్శించిన గురుకుల బాటలో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను బీఆర్‌ఎస్ నేత డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అందచేస్తామని వెల్లడించారు.

గురుకుల హాస్టళ్లు ప్రారంభమై 6 నెలలు గడుస్తున్నప్పటికీ పుస్తకాలు, బెడ్‌షీట్స్, కాస్మోటిక్స్ స్కూల్ డ్రెస్‌లను విద్యార్థులకు అందించలేదన్నారు. చలికాలంలో దుప్పట్లు లేక పేద విద్యార్థులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం పెట్టగా ఇప్పుడు దొడ్డుబియ్యంతో పెడుతున్నారని పేర్కొన్నారు. కొన్ని గురుకులాల్లో భోజన మెనూ పాటించడం లేదని ఆరోపించారు. చాలా గురుకులాల్లో డ్రైయినేజీ సక్రమంగా లేకపోవడంతో దుర్వాసన వస్తోందని అన్నారు. డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంలో యాజమానులు గురుకులాలకు తాళం వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మోడల్ స్కూల్‌లో వంటలు బయట చేస్తున్నారని, నాసిరకంగా వండటంతో భోజనం రంగుమారుతోందని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రానికి వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన సొసైటీల సెక్రెటరీలు ప్రిన్సిపాళ్లను మనోవేదన గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50 గురుకుల విద్యార్థులు చనిపోయారని, 950 ఆహార కల్తీతో ఆనారోగ్యానికి గురయ్యారని ఆందోళనవెలిబుచ్చారు. గురుకులాల ఆర్‌సీవోలు, డీసీవోల తీరు బాగోలేదని అన్నారు. గురుకుల బాటకు వెళ్లిన బీఆర్‌ఎస్వీ విద్యార్థులపై సీఎం రేవంత్‌రెడ్డి అక్రమగా కేసులు పెట్టించారని ఆరోపించారు. ఏం సాధించారని విజయోత్సవాలు చేస్తున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం అర్బన్ కోఆర్డినేటర్ గంద్రకోట రాజేశ్ యాదవ్, రాష్ట్ర నాయకులు గొల్లపల్లి వీరాస్వామి, వర్సిటీ నేతలు పస్తం అనిల్, రాయనూరి రాజేశ్, రత్నం అశోక్, వినయ్, మధుసాని పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు

అధ్యక్ష, కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్‌గౌడ్, చాగంటి శ్రీనివాస్ విజయం



వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమ్మిరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబర్ 8: (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ఎన్నికలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఆదివారం వరంగల్ హంటర్‌రోడ్డులోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో ఉదయం 11గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2గంటల 30నిమిషాల వరకు హోరాహోరీగా కొనసాగిన ఎన్నికల్లో చాగంటి శ్రీనివాస్ ప్యానల్ సభ్యులు ఘన విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పి.ప్రవీణ్ కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చాగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎ.వెంకటేశ్వర్‌రావు, ఆర్.రఘురామ్, కేఎం, నజీమోద్దిన్, పి.సదాశివ్, టి.రాము, కోశాధికారిగా టి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బి.ఉపేందర్, ఈసీ మెంబర్లుగా ఎ. వేణుగోపాల్, అభినవ్ వినయ్‌కుమార్, శ్రీమాన్‌కుమార్, మీర్జా ఇనయతుల్లా బేగ్‌లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించారు. కాగా 13మందితో కొలువుదీరనున్న కమిటీలో 22మంది అభ్యర్థులు బరిలో నిలువడంతో ఎన్నికలు అనివార్యమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపు సమ్మిరెడ్డి తెలిపారు. ఈ నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుందని, అనంతరం విజయం సాధించిన అసోసియేషన్ సభ్యులకు సమ్మిరెడ్డి నియామక పత్రాలను అందజేశారు.

రేపు కేయూ మెడికల్ ఆఫీసర్ల ఎంపిక ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం ఒప్పంద ప్రతిపాదికన స్త్రీ, పురుష మెడికల్ అభ్యర్థుల ఎంపిక ఇంటర్వ్యూలు డిసెంబరు 10న మంగళవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ల వారిగా నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరికీ ఇప్పటికే సమాచారం అందచేసినట్లు స్పష్టం చేశారు. పురుష అభ్యర్థులకు 10న మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి, స్త్రీ అభ్యర్థులకు 10న మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. కేయూ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో అభ్యర్థుల ఎంపిక ఇంటర్వ్యూలు జరుగుతాయని వెల్లడించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులందరూ తమ ఒరిజినల్ ధృవపత్రాలు, అనుభవం, ఇతర పత్రాలన్నీ వెంట తెచ్చుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 98494-47696; 90309-30633లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'క్లాట్'లో మెరిసిన హనుమకొండ విద్యార్థిని

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ న్యాయ విద్యా కళాశాలల్లో న్యాయవాద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన క్లాట్-2025 (ది కామన్ లా అడ్మిషన్ టెస్ట్)లో హనుమకొండకు చెందిన జాతవేద అన్నమనేని జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించింది. టెస్ట్‌లో 90.75 మార్కులు సాధించి 363 ఆల్ ఇండియా ర్యాంకు సాధించింది. హనుమకొండలోని శ్రీనివాస కాలనీకి చెందిన అన్నమనేని శ్రీనివాసరావు - కవితల కుమార్తె జాతవేద ర్యాంకు సాధించడం పట్ల వారి తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు, సోదరి శ్రీనమని, టీచర్ రాహుల్ మార్గదర్శనంలో న్యాయవాద విద్యపై ఆసక్తి కలిగి క్లాట్‌లో ర్యాంకు సాధించామని జాతవేద తెలిపారు.

అన్నదాతలపై ఎరువుల ధరల భారం

ధరలు పెరిగిన కాంప్లెక్స్ ఎరువులు

యాసింగి సాగుకు ధరల దడ

వర్ధన్నపేట, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటల సాగు ప్రారంభించగానే కంపెనీలు మూడు రకాల ఎరువుల ధరలు పెంచి అన్నదాతలపై భారం మోపాయి. రైతులు ఎక్కువగా వాడే 20-20-013, 14-35-15, 24-24-0 కాంప్లెక్స్ రకాల ఎరువుల ధరలను పెంచాయి. గత వానకాలం సీజన్‌లో 20-20-013 బస్తా ధర రూ.1200లు ఉండగా ఇప్పుడది రూ.1300లకు చేరింది. 14-35-14 బస్తా ధర రూ.1700లు నుంచి రూ.1800లకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ పెరిగి రూపాయి పతనమవడంతో ఆ ప్రభావం ఎరువుల తయారీకి ఉపయోగించే పాస్పారిక్ ఆమ్లం, అమ్మోనియా లాంటి ముడిసరువులపై పడింది. అందువల్లే కొన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచామని సంబంధిత కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

డీఏపీ ధరల్లో మార్పులు లేవు

డీఏపీ ధర పెరిగిందని ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పుకార్లు షికారు చేస్తున్నాయి. డీఏపీ బస్తా ధర రూ.1350లకు డీలర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని, దీని ధర పెరగలేదని కంపెనీలు చెబుతున్నాయి. గత అక్టోబర్‌లోనే కేంద ప్రభుత్వం టన్నుకు అదనంగా రూ.175లు రాయితీ పెంచడంతో వచ్చే నెలాఖరు నాటికి డీఏపీ ధర పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు.

యూరియా, డీఏపీలకు లింకులు

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడం, సాగునీరు పుష్కలంగా ఉండటంతో రైతులు పెద్ద ఎత్తున యాసంగి పంటల సాగుకు పూనుకుంటున్నారు. వరి, మొక్కజొన్న పంటల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. సంబంధిత పంటలకు డీఏపీ, యూరియాలకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా కొన్ని ఎరువుల కంపెనీలు డీఏపీ, యూరియాకు దుబ్బు గుళికలు, నానో యూరియా, పొటాష్ వంటి పోషకాలను లింకుపెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని రిటైల్ డీలర్లు ఆరోపిస్తున్నారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకుండా లింకులు పెట్టకుండా సరఫరా చేసేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నేరస్థుల పాలిట 'అంబిస్' అస్త్రం

నేరస్థుడి వేలిముద్రలతో పాటు రూపురేఖలు నిక్షిప్తం

అంబిస్‌లో ఆప్‌లోడ్ అయితే ఎక్కడున్నా దొరికిపోవాల్సిందే..

పైలట్ ప్రాజెక్టులో భాగంగా హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఎంపిక



ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన అంబిస్ సెట్

వరంగల్ క్రైం, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): నేరం చేసిన వ్యక్తి ఇక తప్పించుకోలేడు. నేరస్థుడు ఎక్కడున్నా.. కనిపెట్టేందుకు పోలీసుశాఖ సరికొత్త సిస్టమ్‌ను ప్రవేశపెట్టబోతోంది. క్షణాల్లో నేరస్థుల వివరాలు తెలుసుకునేలా కొత్తగా ఆటోమెటేడ్ మల్టీమోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టం (అంబిస్)ను ప్రయోగించబోతోంది. దీన్ని పైలట్ ప్రాజెక్టుగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని హనుమకొండ పోలీస్‌స్టేషన్‌ను ఎంపిక చేశారు.

విదేశీ టెక్నాలజీ

నేరస్థులు పోలీసులకు సాక్ష్యాధారాలు లభించకుండా వివిధ మార్గాలను అనుసరిస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. అలాంటి సమయంలో నేరాలను ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది. వారిని గుర్తించి శిక్షపడేలా చేయడంలో ఆలస్యమవుతోంది. అలాంటి వాటిని అధిగమించేందుకు ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం (అఫిస్) స్థానంలో విదేశాల్లో వినియోగిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత అంబిస్‌ను తెలంగాణ పోలీసులు వినియోగించబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు పోలీస్‌స్టేషన్‌లలో ముందుగా అంబిస్‌ను ప్రయోగించబోతుండగా, అందులో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఒకటి.

అంబిస్‌పై ప్రత్యేక శిక్షణ

ఇంతకు ముందు వేలిముద్రల ద్వారా నేరస్థుడిని కనుగునేవారు. దీనికి అఫిస్‌ను వినియోగించేవారు. దీనిపై ఫింగర్ ప్రింట్ సిబ్బందితో పాటు ఆయా ఠాణాల్లో పనిచేసే క్రైం విభాగం పోలీసులకు అవగాహన ఉండటంతో వేలిముద్రలను ఈజీగా గుర్తించేది. ఠాణాల పరిధిలో పట్టుబడ్డ నిందితుడు కానీ, అనుమానాస్పద వ్యక్తి వేలిముద్రలు సేకరించి కమిషనరేట్ కార్యాలయంలో ఉన్న ఫింగర్‌ప్రింట్ విభాగానికి సమాచారం చేరవేయగానే సంబంధింత వ్యక్తిపై ఎలాంటి నేరాలు ఉన్నాయనే తెలుసుకొనే వీలుండేది. అయితే కొత్తగా తీసుకొచ్చిన అంబిస్‌లో మనిషి రెటీనా తీసుకునేందుకు ఐరిస్, వెంట్రుకల రంగు, ఎత్తు, బరువు, కాలి ముద్రలు, మొత్తంగా మనిషి ఆకారానికి గుర్తించే పద్ధతి ఉండటంతో గత నెల 6న హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి ఫింగర్ ప్రింట్ అధికారులతో పాటు హనుమకొండ పోలీస్‌స్టేషన్ నుంచి ఇద్దరు కానిస్టేబుళ్లు హాజరయ్యారు. పైలట్ ప్రాజెక్టుల్లో భాగంగా ఎంపికైన ఠాణాల్లో అంబిస్‌ను ఈనెల 6న సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రారంభించగా రెండు రోజుల కిందట హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో అంబిస్ సేవలు అమలులోకి వచ్చాయి. క్రిమినల్ ప్రొసీజర్ అఫ్ ఐడెంటిఫికేషన్ - 2022 యాక్టు ప్రకారం ఇక నుంచి నేరస్థులతో పాటు అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించి అంబిస్‌లో పొందపరచనున్నట్లు ఫింగర్ ప్రింట్ విభాగం అధికారి ఒకరు తెలిపారు.

అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నాం..

కమిషనరేట్ ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ బి.దేవేందర్



దేశంలోనే తెలంగాణ ఫింగర్ ప్రింట్ బ్యూరో వినియోగించేది చాలా అత్యాధుని కమైన టెక్నాలజీ. ఈ టెక్నాలజీ రష్యాలో అందుబాటులో ఉంది. ఈ టెక్నాలజీని దేశం లో ఎక్కడా వినియోగించడం లేదు. అంబిస్ అనేది అద్భుతంగా పనిచేస్తోంది. దీన్ని ఆప రేట్ చేసే వారు కీలకం. గతంలో తీసుకునే వేలిముద్రలకు అదనంగా ఈ సాఫ్ట్‌వేర్‌లో ఐరిస్, ఫుట్ ప్రింట్స్ వ్యక్తి శరీరాకృతులు అనేవి జతకాబడ్డాయి. పైలట్ ప్రాజెక్టుకుగా ఎంపికకాబడ్డ హనుమకొండ పీఎస్‌లోని ఇద్దరు సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొందారు. రానున్న రోజుల్లో కమిషనరేట్ వ్యాప్తంగా అన్నిఠాణాల్లో అమలుచేసే అస్కారం ఉంది.

రూ.8 లక్షల సామగ్రి అందజేత

వేలిముద్రలు సేకరించడానికి క్రైం పార్టీ వద్ద ఎంఎస్‌సీడీ అనే డివైస్ ఉండేది. ఎక్కడికి వెళితే అక్కడికి తీసుకపోయే వీలుండేది. కానీ అంబిస్‌కు కొత్తగా ల్యాబ్ మాదిరిగా ప్రత్యేక రూమ్ కేటాయించారు. ఆ రూమ్‌లో అత్యాధునికమైన కంప్యూటర్, ఐరిష్, ఫింగర్ ప్రింట్, పామ్ స్కానర్, ఎత్తు కొలిచే చార్ట్, బరువు చూసే మిషన్ అందుబాటుల్లో పెట్టారు. వీటన్నింటికీ సుమారు రూ.8 లక్షల ఖర్చు అయి ఉంటుందని అంచనా. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో అంబిస్ ద్వారా మంచి ఫలితాలు వస్తే కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో అమలు చేయడానికి ఉన్నతాధికారులు ఆలోచనలు చేస్తున్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నేహాల్



వడ్డెపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీకి చెందిన మహ్మద్ ముస్తాక్ నేహాల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శిగా పని చేస్తున్న నేహాల్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని 65వ డివిజన్‌లో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా పని చేస్తున్న గొల్ల భద్రయ్య (55) ఆదివారం ఉదయం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందాడు. సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి భద్రయ్య భార్యకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జవాన్లు బరుపట్ల మహేశ్, రేనుకుంట్ల సురేష్, ఎర్ర నరేష్, బిక్షపతి, సుజాత, మల్లిఖార్జున్, శ్యాంలు ఉన్నారు.

నేడు జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో సోమవారం మండలస్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఫోరమ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డాక్టర్ కె.వాసు, ఎ.సంపత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో నిర్దేశించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో, తర్వాత రాష్ట్ర స్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

రాతి కనీలు విరగ్గొట్టిన వారిపై ఫిర్యాదు

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తన స్థలంలో పాతిన కనీలను కొందరు విరగ్గొట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు జన్ను జయరావు ఆదివారం ఇంతెజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేశాయిపేటలోని సర్వే నంబర్ 306, 307లలో తనకు 368 గజాల స్థలం ఉందని, అందులో ఉన్న కనీలను సిలువేరు మోహన్‌బాబు, సిలువేరు గిరిబాబు, సిలువేరు వినయ్ అనే ముగ్గురు విరగ్గొట్టారని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కరీమాబాద్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని ఏకశిలానగర్, హనుమాన్‌నగర్, సాకరాశికుంట ప్రజల సౌకర్యార్థం ఆదివారం ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సు, ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కూరపాటి రమేష్, డాక్టర్ కూరపాటి రాధిక సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, ముక్తిపాలి క్లినిక్స్ ఇన్‌చార్జ్ ప్రదీప్, ఫిజీషియన్ డాక్టర్ దీప, కూరపాటి హస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణ తంతును నిర్వహిస్తున్న అర్చక స్వాములు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల - తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో పరుశురామ్ దళ్ జిల్లా అధ్యక్షుడు మరింగంటి వెంకట రమణాచార్యుల ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి పొద్దుపోయే వరకు నేత్రపర్వంగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం జరిగింది. ఆధ్యాత్మికవేత్త, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోదరుడు వద్దిరాజు వెంకటేశ్వర్లు యాజమాన్యంలో ప్రముఖ కృష్ణయజుర్వేద పండితుడు గుడిమెళ్ల విజయకుమారాచార్య యాజ్ఞికంలో, పాంచరాత్ర ఆగమ పండితుడు చిమిరాల శ్రీధరాచార్యులు, మేఘశ్యామ్, దరూరి శ్రీవర్ధన్, శ్రీమన్నారాయణ చార్యుల వైదిక కార్యక్రమం నిర్వహిస్తుండగా స్వామివారి కళ్యాణోత్సవ తంతు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తుల సమక్షంలో ధ్వజారోహణ, యజ్ఞోపవీతం, జిలకర్రబెల్లం, కన్యాదానం, మంగళసూత్ర ధారణ, అనంతరం నాగబెల్లి లాంటి కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనంతరం ఇదే కల్యాణ మండపంలో స్మార్థ ఆగమ పండితులు రామకృష్ణశర్మ, సుధాకర్‌శర్మ, మణికంఠశర్మ, సందీప్‌శర్మ, భరత్‌జోషి, రాంపెల్లి గోపికృష్ణశర్మ తదితరుల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజను కూడా నిర్వహించారు. పెండ్యాల సందీప్‌శర్మ పర్యవేక్షణలో భజరంగ్‌దళ్ సభ్యులు కార్తీకేష్, సూరజ్‌సింగ్, ఠాకూర్, మాడిశెట్టి చందు తదితరులు ఏర్పాట్లను చూసుకున్నారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ పాల్గొన్నారు.

కుల దురహంకార హత్యలను ఆపలేరా?

ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల



సమావేశంలో ప్రసంగిస్తున్న ఐద్వా కార్యదర్శి నలిగంటి రత్న మాల

ఖిలావరంగల్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకూ కుల దురహంకార హత్యలు పెరిగిపోతున్నాయని, ఇప్పటివరకు 108 హత్యలు జరిగాయని, అయినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఐద్వా జిల్లాకార్యదర్శి నలిగంటి రత్నమాల విమర్శించారు. ఆదివారం ఐద్వా, కేవీపీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కమిటీ సంఘీభావ సదస్సులో ఆమె మాట్లాడారు. ఐదు రోజుల కిందట రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన కానిస్టేబుల్ నాగమణి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన శ్రీకాంత్‌ను వివాహం చేసుకుందన్న కోపంతో సొంత తమ్ముడే అత్యంత కిరాతకంగా నరికి హత్యచేశాడని అన్నారు. కొన్ని శక్తులు ఈ కేసును పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయని, దీనిపై మతతత్వ పార్టీలు ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా నాయకురాలు టి.భవాని, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, నాయకులు ఇల్లందు ఎలీషా, కాంపెల్లి అనిత, బాబు, శ్రీరాములు, దివ్య, శ్రీలత, వల్యాల సాయిలు, ఇనుముల ఎలిజబెత్, లక్ష్మి, కమల, రూప, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడిపై దాడి



గాయపడిన చరణ్

మట్టెవాడ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు మరో యువకుడిపై దాడి చేశారు. వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం రాత్రి బిర్యాని కోసం మండిబజార్‌కు వచ్చారు. అదే సమయంలో అక్కడే ఉన్న పుప్పాలగుట్టకు చెందిన ప్రభుచరణ్‌పై అకారణంగా దాడికి పాల్పడ్డారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు చూస్తుండనే వారు ఈ దారుణానికి ఒడిగట్టారని స్థానికులు తెలిపారు. దాడిలో ప్రభుచరణ్‌కు కంటిపై బలమైన గాయంతో పాటు రక్తస్రావమైంది. ఈ ఘటనపై బాధితుడు ఆదివారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మండిబజార్‌లో దాడులు నిత్యకృత్యం

మద్యం తాగిన యువకులు బిర్యానీ కోసం నిత్యం మండిబజార్‌కు అర్ధరాత్రి వరకు వస్తూ ఉంటారు. గతంలో సైతం ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ పోలీసులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టకపోవడంతో పునరావృతం అవుతున్నాయి. గత ఆగస్టు మాసంలో మద్యం మత్తులో యువకులు రోడ్డుపై వాహనాలు ఆపి వాలీబాల్ ఆడారు. అంతేకాదు అర్ధరాత్రి బైక్‌తో విన్యాసాలు చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇప్పటికైనా పోలీస్ పెట్రోలింగ్ పెంచి అర్ధరాత్రి వరకు బిర్యానీ హోటళ్ల నడుపకుండా చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

రాంనగర్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. ఎన్పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కంల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో ఆదివారం పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తించేలా కృషిచేస్తానని, అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. శ్రీధర్ జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు డిస్కంల నుంచి తరలివచ్చిన 327 నాయకులు గజమాల వేసి, శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో 327 ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, స్టేట్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, నీలం ఐలేష్, రాజిరెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేశ్, శ్రీనువాస్, సత్యనారాయణరెడ్డి, తులసీరెడ్డి, సదయ్య, ఓదేలు, సతీష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌కు చెందిన మోటం మధుకర్, మడికొండకు చెందిన పసునూటి భాస్కర్‌లు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలుచేసి ఎక్కువ ధరకు కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం హసన్‌పర్తి పోలీసులు పెట్రోలిం గ్ నిర్వహిస్తుండగా వీరి అక్రమంగా సరఫరా చేస్తున్న ఆటోతో పాటు రూ.36,800 విలువైన 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

14న నగర సంకీర్తన

శంభునిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 శనివారం సాయంత్రం రంగశాయిపేటలో అయ్యప్ప నగర సంకీర్తన నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అలంకార ప్రియుడైన అయ్యప్ప స్వామిని ప్రత్యేక వాహనం పై అలంకరించి రంగశాయిపేటలోని కాలనీల్లో ఊరేగిస్తారు. అనంతరం జనతా కుటీరంలో కొల్లూరి రిషీనంద్ ట్రస్టు ఆధ్వర్యంలో అల్పాహారం ఉంటుందని యోగానంద్ గురుస్వామి తెలిపారు. అయ్యప్ప మాలాదారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నగర సంకీర్తనను విజయవంతం చేయాలని అయ్యప్ప సేవా పరపతి సంఘం బాధ్యులు కోరారు.

పడిపూజ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అయ్యప్ప స్వాములు

శంభునిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేట-శంభునిపేట అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16 రంగశాయిపేటలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం రంగశాయిపేట మహంకాళీ ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప పరపతి సంఘం అధ్యక్షుడు కొల్లూరి యోగానంద్ మాట్లాడుతూ అయ్యప్ప పడిపూజను 16వ సారి రంగశాయిపేటలోని బీరన్న దేవాలయంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బజ్జూరి వీరేశం, గండ్రాతి కుమార్, పాల రంజిత్, చాపల నాగరాజు, నల్లతీగల వెంకన్న, నంద రమేష్, అనుమాండ్ల రమేష్, పోశాల మల్లికార్జున్, సోమ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దత్తక్షేత్రంలో వైభవంగా తైలాభిషేకం

వరంగల్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. అర్చకుడు రాపాక గోపీకృష్ణ శర్మ అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామివారికి అలంకరణ, మహా మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం కాగడ హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

శంభునిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక కులాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని ఖిలావరంగల్ మండల వెలమ కుల నాయకులు ఆదివారం మామునూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యత కలిగిన పదవిలో ఉండి తమ కులాన్ని కించపరిచేలా అనుచిత వాఖ్యలు చేసిన సదరు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని సీఐ రమేష్‌ను కోరారు. వారిలో పోలుసాని సుభాష్‌రావు, ప్రహ్లాదరావు, గుజ్జ సోమేశ్వరరావు, తోపుచర్ల మురళీధర్‌రావు, పిన్నింటి రాజేశ్వర్‌రావు, శ్రీధర్‌రావు, కరిమెళ్ళ బాబురావు, కోదాటి కిషోర్ రావు, తోపుచర్ల శ్రీనివాస్‌రావు, తిరుమలరావు, ప్రసాదరావు, రవి తదితరులు ఉన్నారు.

వికాస తరంగిణి సభ్యత్వాలు ప్రారంభం

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అదాలత్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 2025 సంవత్సరానికి వికాస తరంగిణి సభ్యత్వాలను ఆదివారం వికాస తరంగిణి వరంగల్, హనుమకొండ శాఖల అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ శాఖ నుంచి ఆధ్యాత్మిక కళాకారులుగా ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. భక్తి పాటలు, భజన బృందాలు కోలాటంలో ప్రతిభ ఉన్నవారిని వెలికి తీసుకొచ్చేందుకు సంకీర్తనా మండలి ఆవిర్భావం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చాడ సుభాష్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు తనూజతోపాటు ఉమా, వసంత, వివిధ ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలి

ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు



సమావేశంలో మాట్లాడుతున్న లోకిని రాజు

వడ్డెపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, చైర్మన్‌గా ఎరుకల సామాజిక వర్గానికే కేటాయించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆదివాసీ ఎరుకల కులస్థుల సమస్యలను ప్రస్తావించాలని మంత్రులు, ఎమ్మెల్యేలను కోరారు. ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీంను ప్రవేశపెట్టి రూ.60 కోట్ల బడ్జెట్ కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆదివారం ఎరుకల సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు కేతిరి రాజశేఖర్, మానుపాటి రమేశ్, చిన్న సారయ్య, రఘు, విజేందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం పులి సారంగపాణి అధ్యక్షతన ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. విద్యాసాగర్, సంయుక్త కార్యదర్శి బి.సత్యనారాయణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులి సారంగపాణి, ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి బి.మల్లారెడ్డి, ఆర్థిక కార్యదర్శి బి.రాజయ్య, సంయుక్త కార్యదర్శులుగా జిన్నా ప్రభాకర్‌రెడ్డి, బి.కృష్ణమూర్తితోపాటు 20 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సలహాదారులు డాక్టర్ టి.సుధాకర్‌రెడ్డి, డాక్టర్ అంపశయ్య నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకోటలో అఖిలపక్ష సమావేశం



ప్రసంగిస్తున్న కార్పొరేటర్, అఖిలపక్ష నాయకులు

ఖిలావరంగల్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోటలో ఆదివారం కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తూర్పుకోటలో ఎలాంటి దొంగతనాలు, గొడవలు వంటివి జరగకుండా గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని అన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో అఖిల పక్ష నాయకులు కందిమల్ల మహేష్, సిరబోయిన ఎల్లయ్య, 37వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయిని దూడయ్య, బెడిద వీరన్న, అర్షం రాంబాబు, బొలుగోడ్డు శ్రీనివాస్, వి.కర్ణాకర్, ఎ.కేశవ రాజు, ఎన్. ప్రతాప్, ఎం.కుమార్, బీఆర్ఎస్ నాయకులు సంగరబోయిన విజయ్, ఎస్.వాసుదేవ్, శ్రీధర్, వి. ధర్మరాజు, సీపీఐ నాయకులు గన్నారపు రమేష్, ఎంసీపీఐ నాయకుడు జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

కెనాల్‌లోకి దూసుకెళ్లిన లారీ

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు - ఆస్పత్రికి తరలింపు



కెనాల్‌లో పడిన లారీ

హసన్‌పర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్‌లో అదుపు తప్పి లారీ పడిపోయింది. కెనాల్‌లో నీరు లేకపోవడంతో లారీ ప్రమాదానికి గురై నుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న లారీ డ్రైవర్ ఉప్పరి యాదయ్య (42) ఎడమ కాలు పూర్తిగా విరిగింది. దీంతో స్థానికులు మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అంథోల్ మండలం కన్‌సాన్‌పల్లికి చెందిన లారీ యజమాని తెనుగు ప్రవీణ్‌కుమార్‌కు చెందిన ఇసుక లారీ ములుగు జిల్లా మంగపేట మండలం కత్తిగూడెం నుంచి ఇసుక లోడుతో ఆదివారం సంగారెడ్డి జిల్లాకు వెళ్తోంది. ఈ క్రమంలో హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్ద ఇరుకుగా ఉన్న ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్‌పై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కెనాల్‌లోకి దూసుకె ళ్లింది. దీంతో లారీ నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ యాద య్యకు తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం లారీ డ్రైవర్ పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. లారీ యజమాని ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

శశాంక్‌కు ఎమ్మెల్యే అభినందన



శశంక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇస్రో ట్యూటర్‌గా ఎంపికైన భూపతి శశాంక్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభినందించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో సన్మానించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌తో పాటు చాడ నేపాల్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి అస్వస్థత

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం అస్వస్థతతకు గురయ్యారు. బస్టాండ్‌లోని సెక్యూరిటీ కార్యాలయం వద్ద అకస్మాత్తుగా ఓ వ్యక్తి కింద పడిపోయాడు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వెంటనే 108కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు. సుమారు 48 ఏళ్ల ఉన్న గుర్తు తెలియని వ్యక్తి కిందపడి పోయి ఉండడంతో బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఆ వ్యక్తి మద్యం సేవించి ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

హసన్‌పర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లాపూర్‌కు చెందిన కళివజ్జుల దినేష్ (32) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే మంజూరు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హనుమకొండ జిల్లా మహాసభకు నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ, సరెండర్ బిల్లులు, వేతన బిల్లులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉంటుండటంతో ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులకు గువరుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సీహెచ్. రవీందర్‌రాజు, పి.రాజు, నాయకులు సోమశేఖర్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, సదానంద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ధరణి ఉద్యోగుల సంఘం జిల్లా నిర్వహణ అధికారి నోముల ప్రశాంత్‌రెడ్డి



ప్రశాంత్‌ను అభినందిస్తున్న జిల్లా ధరణి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

హసన్‌పర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ధరణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ధరణి ఉద్యోగుల సంఘం జిల్లా నిర్వాహణ అధికారి, హసన్‌పర్తి ధరణి ఆపరేటర్ నోముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ధరణి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ధరణి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శివకుమార్ (నడికూడ), ఉపాధ్యక్షురాలిగా ఎస్.సాగరిక (ధర్మసాగర్), ప్రధాన కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ (ఐనవోలు), కోశాధికారిగా ఎం.సాయిరాం (భీమదేవరపల్లి), ఈసీ మెంబర్లు శంకర్ (వేలేరు), కృష్ణప్రసాద్ (ఎల్కతుర్తి) తదితరులు పాల్గొన్నారు.

దళారులకు అడ్డాగా రిజిస్ట్రేషన్ కార్యాలయం

అధికారులు సైతం వారికే వంతపాడుతున్న వైనం ● సామాన్యులకు ఇబ్బందిగా సిబ్బంది వైఖరి



హనుమకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయం

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం దళారులకు అడ్డాగా మారింది. భూ విక్రయాలు ఇతర వివిధ రిజిస్ట్రేషన్లపై దళారులు చెప్పిన విధంగానే అధికారులు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని స్థానిక ప్రజలు విమర్శలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దళారులు లేనిదే రిజిస్ట్రేషన్ కావడం లేదని వాపోతున్నారు. వ్యవసాయ భూములు, వివాహాలకు రిజిస్ట్రేషన్లు కావాలంటే బ్రోకర్ల అనుమతి ఉంటేనే పని అవుతోంది. నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే సవా లక్షా నిబంధనలు పెట్టి అధికారులు వేదిస్తున్నట్లు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది అండదండలతోనే దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అనుమతి లేని ప్లాట్లను, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇల్లు, భూముల రిజిస్ట్రేషన్ చేయకూడ దని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కొందరు దళారులు దొంగ డాక్యుమెంట్లను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

ఇటీవల మామునూరు ఎయిర్‌పోర్టుతో పాటు వివిధ రింగ్‌రోడ్డు పనులకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేయడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భూముల రేట్లు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో దళారులు వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. అధికారులు సైతం వారికే వంత పాడుతు న్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. భూములు కొనేవారు, అమ్మే వారు బ్రోకర్లను ఆశ్రయించడంతో అధికారుల పేర్లు చెప్పి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెబుతు న్నారు. ఎవరైనా నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే బ్రోకర్ల ద్వారా వస్తేనే పనులు జరుగుతాయని స్వయంగా అధికారులు చెప్పడంపై సామాన్య ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దళారుల సహకారంతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయడంతోపాటు నాన్ లేఅవుట్ ప్లాట్లను అధికారులు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు స్థానికులు వాపోతు న్నారు. ఇప్పటికైనా కార్యాలయంలో దళారులు లేకుండా నేరుగా రిజిస్ట్రేషన్లు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



నిధులివ్వండి.. అధ్యక్షా..!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- పురోగతి లేకుండా పడి ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి
- ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు గళం విప్పాలంటున్న ప్రజలు

ఓరుగల్లు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేస్తోంది. ఇప్పటికే సుమారు రూ. 10 వేల కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. అయినప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసిన అనేక అభివృద్ధి పనులకు నిధులు లేక వెక్కిరిస్తున్నాయి. వరంగల్ నగరంలో మెట్రో రైల్ సేవలతో పాటు ఐటీ పార్కు విస్తరణ, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం వాటికి ఇంకా అడుగులు పడటం లేదు. వీటితో పాటు అనేక నియోజకవర్గాల్లో ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల నిర్మాణం, వీవర్స్ పార్కులు, యూనివర్సిటీలు, కాలేజీలు, డ్రైనేజీ తదితర వాటికి నిధులు లేక, కొన్నింటికీ అనుమతులు లేక ప్రజలు అసౌకర్యాలకు గురవుతున్నారు.

సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు ఓరుగల్లు అభివృద్ధిపై గళమెత్తుతారనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

లెదర్ పార్కుకు మోక్షం కలిగేనా?

చర్మకారులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ కేంద్రంలోని శివునిపల్లిలో 1999లో లెదర్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 117 ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్‌పార్కు నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. అయితే ప్రతిపాదనలు అటకెక్కటంతో 2002లో టీడీపీ హయాంలో 25 ఎకరాల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు .10కోట్ల నిధులు కూడా కేటాయించారు. ఇందుకోసం తొలి విడతలో స్థానికంగా ఆసక్తితో ఉన్న 50మందికి చెన్నైలో చెప్పులు తయారు చేయటం, లెదర్ బ్యాగులు, ఇతర లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఇప్పించారు. 2003లో రూ.10లక్షలతో లెదర్ పరిశ్రమ కోసం ఓ భవనం కూడా నిర్మించారు. మరో రెండు విడతల్లో 120మందికిపైగా లెదర్ ఉత్పత్తుల తయారీపై చైన్నైలో శిక్షణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ ఇప్పటి వరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు. ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి లెదర్ పార్కు నిర్మాణంపై సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి లెదర్ పార్కు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారనే ఆశతో స్థానికులు ఉన్నారు.

మెట్రో రైల్ పట్టాలెక్కేనా?

వరంగల్ నగరం విస్తరిస్తుండడంతో హైదరాబాద్ తరహాలో మెట్రో రైల్ ఏర్పాటుపై గత ప్రభుత్వం సర్వే చేసింది. 2019 డిసెంబరు 24వ తేదీన అధికారులు కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కిలో మీటర్ల వరకు మెట్రో రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2025లో ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.1,341కోట్ల అంచనా వ్యయంతో వరంగల్ మెట్రో రైల్‌కు రూపకల్పన చేశారు. 15.5కి.మీ.ల దూరంలో 7.1 కిలో మీటర్లు రోడ్డు మార్గంలో, 8.4కి.మీలు ఆకాశమార్గంలో రైల్వేట్రాక్ నిర్మించాలని నిర్ణయించారు. 21 స్టేషన్లను ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేశారు. 2021 మార్చిలో వరంగల్ మెట్రో నియో రైలు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. అయితే కేంద్రంపై ఒత్తిడిలేకపోవటంతో వరంగల్ మెట్రోకు ఐదేళ్లుగా బ్రేక్ పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామంటున్న ప్రభుత్వం.. నగరంలో కూడా మెట్రో రైల్ పట్టా లెక్కించాలని, దీనిపై నగర పరిధిలోని మంత్రితో పాటు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

రిజర్వాయర్లు, ఎత్తిపోతలకు నిధుల గ్రహణం

పాలకుర్తి, పరకాల నియోజకవర్గాల్లో ఎత్తిపోతలు, రిజర్వాయర్లకు నిధులు లేక అర్ధాంతరంగా నిలిచి పోయాయి. గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేయటంతో సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో 2009లో పాలకుర్తి - చెన్నూరు రిజర్వాయర్ పనులకు రూ.330కోట్లతో శ్రీకారం చుట్టారు. అయితే పనులు ప్రారంభం కాకుండానే నిలిచిపోయాయి. ఆ తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ఇదే రిజర్వాయర్ పనులకు రూ.370కోట్లతో ప్రతిపాదనలు చేసి, పనులు కూడా ప్రారంభించారు.

అయితే నిధుల కొరతతో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. పాలకుర్తి రిజర్వా యర్ కింద 7,516 ఎకరాల్లో, చెన్నూరు రిజర్వాయర్ ద్వారా 25,165 ఎకరాల్లో పంట సాగు కానుంది. దీనిపై పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పరకాల నియోజకవర్గంలో 2017లో గీసుకొండ మండలం కొనాయిమాకులం వద్ద రూ.63కోట్లతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. భూసేకరణ పూర్తి కాకపోవటంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ లిఫ్ట్ పూర్తి అయితే సుమారు 14వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

అలాగే జనగామ నియోజకవర్గంలో బచ్చన్నపేటలో గుడి చెరువు రిజర్వాయర్ కోసం ప్రతిపాదనలు చేసి వదిలేశారు. భూపాలపల్లిలో సీతారామ ఎత్తిపోతల పనులకు కూడా నిధుల గ్రహణం పట్టింది. అలాగే మహబూబాబాద్ జిల్లా గూడూరులో పాకాల వాగుపై రిజర్వాయర్ నిర్మాణం ప్రతిపాదనల్లో నలుగుతోంది. ఈ రిజర్వాయర్ పూర్తి చేస్తే సుమారు 20వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. వీటిపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రస్తావించి, ప్రభుత్వం నిధులు సాధిస్తారనే ఆశతో రైతాంగం ఎదురుచూస్తుంది.

మైనింగ్ వర్సిటీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో సింగరేణి ప్రాంతంగా ఉన్న భూపాలపల్లిలో మైనింగ్ యూనివర్సిటీ కోసం కార్మికుల పిల్లలు ఎదురుచూస్తున్నారు. పదేళ్లుగా మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు అన్ని పార్టీలుహామీలు ఇస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో మైనింగ్ యూనివర్సిటీతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ కోసం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారనే ఆశతో కోల్‌బెల్ట్ ప్రజలు ఉన్నారు. అలాగే డోర్నకల్ నియోజకవర్గంలో మరిపెడ మినహా ఇతర మండలాల్లో డిగ్రీ, జూనియర్ కాలేజీలు లేవు. అలాగే జనగామ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు హమీగానే మిగిలిపోయింది.

- ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరలో శాశ్వత అభివృద్ధి పనులకు కార్యచరణ చేపట్టాలి.
- బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం చొరవ చూపి, పనులు ప్రారంభించాలని కార్మికులు కోరుతున్నారు.
- ఏజెన్సీలో అటవీ, రెవెన్యూశాఖల మధ్య సుమారు 10వేల ఎకరాల్లో వివాదం నెలకొంది. దీనిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపేలా అసెంబ్లీలో ఈ సమస్యను ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.
- మడికొండలో వీవర్స్ పార్కు అభివృద్ధికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.
- వరంగల్ మహానగరంలో కొత్తగా ఐటీ టవర్స్‌ను తీసుకరావటంతో పాటు కొత్త పరిశ్రమలు వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని వరంగల్ వాసులు కోరుతున్నారు.
- వరంగల్ ప్రాంత విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కొత్త కోర్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా దృష్టి పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

మరికొన్ని అభివృద్ధి పనులు.. సమస్యలు

- వరంగల్ కోటను మరింతా అభివృద్ధి చేసి పర్యాటక ప్రాం తంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.
- పరకాలలో రూ.30కోట్లతో చేపట్టిన వంద పడకల అస్పత్రి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీనికి నిధులు తీసుక వచ్చే అస్పత్రి పనులు పూర్తి చేయాలి.
- పరకాల మినీ ట్యాంక్‌బండ్‌ను రూ.40కోట్లతో చేపట్టారు. నిధుల లేక నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- పాలకుర్తి నియోజవర్గంలోని కొడకండ్లలో గత ప్రభుత్వం రూ.61 కోట్లతో మినీ టెక్స్‌టైల్ పార్కును ప్రారంభించి వదిలేశారు. దీన్ని పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చొవరచూపాలని కోరుతున్నారు.
- మహబూబాబాద్ జిల్లా కేంద్రం భారీగా విస్తరిస్తుండటంతో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వంపై జిల్లా ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకరావాలని యువత కోరుతోంది.
- కేసముద్రంలో అగ్నిమాక కేంద్రం, డోర్నకల్‌లో మిర్చి యార్డు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- గత వర్షాలకు మున్నేరు, మానేరు వాగులపై దెబ్బతిన్న ముల్కలపల్లి, చిన్నగూడూరు, కౌసల్యదేవిపల్లి వద్ద వంతెనల నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- వర్ధన్నపేట ప్రభుత్వ అస్పత్రిని వందపడకల అస్పత్రి అప్‌గ్రేడ్ చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి భవనం నిర్మించాలని కోరుతున్నారు.

పేటలో వైభవంగా పల్లివేట



నర్సంపేట అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అయ్యప్ప స్వామి ఊరేగింపులో విన్యాసాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

- అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు
- మార్మోగిన మణికంఠ నామస్మరణ

నర్సంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని శబరిమలై సన్నిధానం సమీపంలోని పుంగావనంలో ఏ విధంగా జరుగుతుందో.. అదే రీతిలో నర్సంపేటలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ సేవా చారిటబుల్ ట్రస్టు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా పల్లివేట ఉత్సవాన్ని నిర్వహించారు. పల్లివేట దాత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో గురుస్వామి వెంకటేష్‌శర్మ నిర్వహించారు. నర్సంపేటలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో 24వ (చతుర్వింశతి) మండల పూజా మహోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోనే నర్సంపేటలో అత్యంత వైభవంగా జరిగే పల్లివేట ఉత్సవాన్ని నర్సంపేటలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరి కొండ మాధవ శంకర్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన తాంత్రికవేత్త గురుస్వామి సీహెచ్.వెంకటేశ్‌శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆదివారం ఉదయం 10.30 గంటలకు అయ్యప్ప ఆలయంలో గురుస్వాములతో కలిసి ఉత్సవబలి, క్షేత్రబలి పూజా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో బలిపీఠాలకు వివిధ రకాల నైవేద్య పూజలను వెంకటేశ్‌శర్మ నిర్వహించారు. అయ్యప్ప ఆలయ గర్భగుడి ముందు భాగంలో పల్లివేట దాత గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీభార్గవి, తండ్రి గోగుల ప్రతాప్ రెడ్డి, రాణా సోదరి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమలతో గురుస్వామి వెంకటేశ్ శర్మ ప్రత్యేక పూజలు చేయించారు.

అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని గురుస్వామి వెంకటేశ్ శర్మ రాణా ప్రతాప్‌రెడ్డికి అందించగా ఆయన విగ్రహాన్ని నెత్తిన ఎత్తుకొని గుడిచుట్టూ మాలాధారులతో కలిసి ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షణ అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి అయ్యప్ప విగ్రహాన్ని రాణా ప్రతాప్‌రెడ్డి నెత్తిన ఎత్తుకొని అలంకరించి ట్రాక్టర్‌లో ప్రతిష్ఠించారు. డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటాల, మాలాధారుల నృత్యాలు, కళాకారుల విన్యాసాల నడుమ ఊరేగింపును మునిసిపల్ కార్యాలయం ఆవరణ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బీజేపీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర శ్రీనివాస్, రేసు శ్రీనివాస్, మహబూబాబాద్ పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రాంచంద్రారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు గూడూరు సందీప్, కొంపెల్లి రాజు, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రత్నం సతీష్, హనుమకొండ 40వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఎర్రగోళ్ల భరత్‌వీర్, ఆలయ అర్చకుడు దినేశ్ విశ్రా, ఆలయ కమిటీ అధ్యక్షుడు పైసా సురేశ్, గురుస్వాములు కోడిజుట్టు అనిల్ ఇతర గురుస్వాములు, ఆలయ కమిటీ సభులు, భక్తులు, మహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పల్లివేట ఉత్సవం

నర్సంపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పుంగావనం (కుటీరం)లో గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీ భార్గవి, తండ్రి గోగుల ప్రతాప్‌రెడ్డితో నిర్వహించిన పల్లివేట ఉత్సవం భక్తులను, మాలాధారులను ఎంతగానో ఆకట్టు కుంది. పుంగావనం కుటీరంలో గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీభార్గవితో పుష్పాభిషేక పూజలను గురుస్వామి వెంకటేశ్‌శర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామికి అభిషేక పూజలు చేయించారు. పల్లివేట వేడుకలో యువకులు ఓం జెండాలు చేతబూని పాల్గొనడం శుభ సూచికమని గురుస్వామి వెంకటేశ్‌శర్మ అన్నారు.



హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్

9.09 కోట్ల మందికి ఉచిత బస్సు

- ఉమ్మడి వరంగల్‌లో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఆర్టీసీకి రూ.403.70 కోట్ల రవాణా చార్జీలు ఆదా
- నేటితో 'మహాలక్ష్మి' పథకానికి యేడాది

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆరు గ్యారంటీలలో భాగంగా మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి నేటికి ఏడాది పూర్తయింది. సీఎం రేవంత్‌రెడ్డి 2023 డిసెంబరు 7న ప్రమాణం స్వీకారం చేసిన తర్వాత ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తూ మొదటి సంతకం చేశారు. దీంతో 2023 డిసెంబరు 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. కాగా, ఉచిత ప్రయాణంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా ప్రయాణికులు రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ కార్డుతోనే వివిధ ప్రాంతాలకు ఉచితంగా ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు. వరంగల్ రీజియన్ పరిధిలో 9 డిపోలో మహిళలకు మొత్తం 9.09 కోట్ల మంది మహిళా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మహిళలకు ఉచిత ప్రయాణంతో రూ.403.70కోట్లు రవాణా చార్జీలు ఆదా అయినట్లు అధికారులు తెలిపారు. వరంగల్ రీజియన్ పరిధిలో మొత్తం 924 ఆర్టీసీ సర్వీస్ బస్సులు ఉండగా, మహాలక్ష్మి పథకం అమలు కావడంతో 744 బస్సు సర్వీస్‌లను కేటాయించినట్లు తెలిపారు. హనుమకొండ డిపో 1.76 కోట్ల మహిళా ప్రయాణికులు ప్రయాణించారు.

మొత్తం రూ.57.67కోట్లు ఆదా, వరంగల్-1 డిపోలో 80లక్షల మహిళ ప్రయాణికులు ప్రయాణించగా మొత్తం 38.33 కోట్లు, పరకాల డిపో 90 లక్షల మహిళ ప్రయాణికులు ప్రయాణించగా 36.77 కోట్లు, భూపాలపల్లి డిపోలో 85 లక్షల మహిళ ప్రయాణికులు ప్రయాణించగా, రూ.43.93 కోట్లు, జనగామ డిపోలో 1.37 కోట్ల మహిళా ప్రయాణికులు ప్రయాణించగా రూ. 65.01 కోట్లు, మహబూబాబాద్ 79 లక్షల మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించగా రూ.33.94 కోట్లు, నర్సంపేట డిపోలో 1.02 కోట్ల మహిళా ప్రయాణికులు ప్రయాణించగా రూ.44.16 కోట్లు, తొర్రూరు డిపోలో 88లక్షల మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించగా రూ.49.28 కోట్లు.. మొత్తం ఉమ్మడి వరంగల్ రిజియన్ పరిధిలోని 9 డిపోలలో 9.09 కోట్ల మహిళా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణించగా, మొత్తం రవాణా చార్జీలు రూ.403.70 కోట్లు మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు ఆర్థిక తోడ్పాటు



ఆర్ఎం విజయభాను

మహిళల కోసం మహాలక్ష్మీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం ద్వారా ఎంతో మంది గ్రామీణ పేద మహిళలకు ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. ఈ పథకం ద్వారా ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. రానున్న రోజుల్లో మహిళలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు వరంగల్‌కు వస్తే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేసి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలి.

శివనగర్‌లో బయల్పడిన విగ్రహాలు

కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేసిన మహిళలు



అండర్ డ్రైనేజీ తవ్వకాల్లో బయల్పడిన కాకతీయుల కాలం నాటి విగ్రహాలు

ఖిలా వరంగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శివనగర్ నుంచి ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువు వరకు చేపట్టిన అండర్ డ్రైయినేజీ తవ్వకాలలో ఆదివారం కాకతీయుల కాలంనాటి విగ్రహాలు బయల్పడ్డాయి. శివలింగం, నంది, సూర్యచంద్రులు, ఆవు, దూడ వంటి విగ్రహాలు లభించాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు కాలువలో నుంచి వాటిని బయటకు తీసి పూజలు చేశారు. మహిళలు కొబ్బరి కాయలు కొట్టి, పసుపు, కుంకుమలు చల్లి పూజలు చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రందించగా సోమవారం వాటిని పరిశీలించి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

ప్రజా సేవకు ఓ రేటు

- ప్రజలను పట్టి పీడిస్తున్న లంచగొండు ఉద్యోగులు
- పైసలు ఇవ్వనిదే ఫైలు ముందుకు కదలని వైనం
- ప్రభుత్వ ఆఫీసుల్లో అమలు కాని సిటిజన్ చార్ట్
- నేడు ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం

వరంగల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లోని కొంతమంది ఉద్యోగులు ప్రజలను జలగల్లా పట్టిపీడిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతూ ప్రజలకు సేవ చేయాల్సిన ఉద్యోగులు అవినీతికి మరిగి అక్రమ సంపాదన కోసం పాకులాడుతున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా చేయి తడుపందే పని కాదనే విషయాన్ని కొంత మంది అధికారుల ద్వారా అర్థమైపోతోంది. కార్యాలయాలు చుట్టూ చెప్పులరిగేలా తిరిగి చివరికి ఏమి చేయలేక లంచగొండి ఉద్యోగులకు ఎంతో కొంత ముట్టజెప్పి పని కానిచ్చుకోవడం షరా మామూలైపోయింది. లంచం ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించిన వాళ్లకు సాకులు చెబుతూ పనిని పెండింగ్‌లో పెడుతున్నారు. వారిలో కొంత మంది ధైర్యం చేసి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసి పట్టిస్తుండగా అడ్డం గా దొరికి ఉద్యోగాలు కోల్పోతున్నారు. మరికొంత మంది జైలు జీవితం అనుభవిసున్నారు.

విద్యుత్‌శాఖలో బహిరంగంగా లంచం తీసుకోవద్దని పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసినప్ప టికీ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 18 కేసుల్లో 28 పట్టుబడగా, 2011 కేసుల్లో పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ కనకం చంద్రయ్యకు ఈ ఏడాది ఫిబ్రవరిలో 21 ఏడాది జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానాను ఏసీబీ కోర్టు విధించింది. డిసెంబర్ 9 ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

ప్రభుత్వశాఖల్లో ఉద్యోగులు లంచం ఇవ్వాలని వేధిస్తే ధైర్యంగా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. 1064 టోల్ ఫ్రీ నెంబర్, 9154388312 నెంబర్ ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు.



ఈ ఏడాదిలో పట్టుబడ్డ ఉద్యోగులు

- కేయూ హాస్టల్‌కు పాలు, పెరుగు సరఫరా చేస్తున్న కాశిబుగ్గకు చెందిన పాల వ్యాపారి పెండెం రాజేందర్ నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్ క్రిష్టయ్య రూ. 50,000 తీసుకుంటూ జనవరి 5న ఏసీబీకి పట్టుబడ్డాడు.
- యశ్వంతాపూర్‌కు చెందిన కాముని స్రవంతి ఫార్మసిస్టుకు రఘునాథపల్లిలో పోస్టింగ్ ఇవ్వడానికి జనగామ వైద్యాధికారి శేషూరి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ రూ.50,000 తీసుకుంటూ జనవరి 11న పట్టుబడ్డాడు.
- అక్రమాస్తుల కేసులో మార్చి 4న తొర్రూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పొలం సుమతి పట్టుబడింది.
- మార్చి 22న స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో గుండగాని హరీష్ నుంచి మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, ఔట్ సోర్సింగ్ ఆపరేటర్ ఆలేటి వేంకటేశ్ రూ.19,200 తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఏప్రిల్ 15న ఆర్టీసీ విచారణలో భాగంగా హుజూరాబాద్ డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ డ్రైవర్ తాటికొండ రవీందర్ నుంచి రూ.20వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- ఏప్రిల్ 26న సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా అక్రమాస్తుల కేసుల్లో పట్టుబడింది.
- మే 5 గిఫ్ట్ రిజిస్ట్రేషన్ విషయంలో రూ.5000 లంచం తీసుకుంటూ కమలాపూర్ తహసీల్దార్ పాలకుర్తి మాధవి, ధరణి ఆపరేటర్ రాజేశ్ పట్టుబడ్డారు.
- జూలై 9న రూ.20వేలు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి శివాజీ పట్టుబడ్డాడు.
- జూలై 25 గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ విషయంలో రూ.80వేలు తీసుకుంటూ కందాల సునిత, బొట్ల నరేశ్ పట్టుబడ్డాడు.
- ఆగస్టు 1న మహబూబాబాద్ డీటీవో కార్యాలయంలో వసూళ్లకు పాల్పడుతూ గౌస్‌పాషా పట్టుబడ్డాడు.
- అగస్టు 2న రూ.20,000 తీసుకుంటూ పర్వతగిరి ఎస్సై గుగులోతు వెంకన్న పట్టుబడ్డాడు.
- అగస్టు 12న పంచాతీరాజ్ ఏఈ గుగులోతు గోపాల్, 18న ఎండోమెంట్ ఆఫీసర్ బోగోజు బిక్షంచారి, 31న ఎలక్ట్రిసిటీ డీఈ మాలోత్ హుస్సేన్ నాయక్ రూ 20వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు. సెప్టెంబరు 27 రోడ్డు అండ్ బిల్డింగ్స్ డిపార్ట్‌మెంట్ చిలుకపాటి హుస్సేన్, అద్వాల రవీందర్ పట్టుబడ్డారు. అక్టోబరు 24న పంచాయతీ రాజ్ శాఖ ఈఈ సంపతి దిలీప్‌కుమార్, వలుపదాసు శోభారాణి పట్టుబడ్డారు. నవంబరు 21న మహబూబాబాద్ ల్యాండ్ రికార్డ్స్‌లో కలంగి జ్యోతి క్షేమ బాయి రూ.20వేలు తీసుకుంటూ పట్టుబడింది. 28న గాదె కార్తీక్ పంచాయతీరాజ్ ఏఈ పట్టుబడ్డాడు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం 9 డిసెంబరు 2024

పెంపుడు జంతువులతో జాగ్రత్త!

మనం ఇళ్లలో సాధారణంగా కుక్కలు, పిల్లులు, మేకలు లాంటి జంతువుల్ని చిలుకలు, బాతులు, పావురాలు లాంటి పక్షులను పెంచుకుంటూ ఉంటాము. వీటి ఆరోగ్యం, పరిశుభ్రత తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉంటాం. అయినప్పటికీ పెంపుడు జంతువులు లేదా పక్షుల నుంచి మనకు కొన్ని అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. వాటి గురించి తెలుసుకుందాం!

రేబిస్: పిల్లలకు పాలిచ్చి పెంచే క్షీరదజాతి జంతువులైన కుక్కలు, పిల్లులు, తదితరాల నుంచి రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకిన జంతువుల లాలాజలంలో వ్యాధికారక క్రిములు ఉంటాయి. పెంపుడు జంతువులతో దగ్గరగా మసలుతున్నపుడు అవి కరచినా, తుమ్మినా వ్యాధి క్రిములు మన శరీరంలోకి చేరతాయి. తీవ్రమైన తలనొప్పి, గొంతునొప్పి, జ్వరం వంటివి రేబిస్ లక్షణాలు. ఇది ప్రాణాంతక వ్యాధి. రేబిస్ వేక్సిన్ తీసుకున్నప్పటికీ ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వరకు మాత్రమే రక్షణ లభిస్తుంది. పెంపుడు జంతువులతో గడుపుతున్నపుడు మాస్కులు ధరించడం, తరచూ చేతులు పరిశుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. పెంపుడు జంతువులకు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేయించి అవసరమైన చికిత్సలు అందించాలి.

బర్డ్ ఫ్లూ: ఇది కోళ్లు, బాతుల వల్ల వ్యాప్తి చెందుతుంది. వీటివల్ల మనుషులకే కాదు జంతువులకు కూడా బర్డ్ ఫ్లూ వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పక్షుల రెట్టలు, లాలాజలం, కళ్ల స్రావాల్లో వ్యాధి కారక వైరస్ ఉంటుంది. బర్డ్ ఫ్లూ వ్యాధికి గురైన వారిని దగ్గు, శ్వాసకోశ ఇబ్బందులు, తలనొప్పి, జ్వరం,



కండరాల నొప్పి, ముక్కు కారడం, గొంతు నొప్పి లాంటివి వేధిస్తుంటాయి. ఈ లక్షణాలు కనిపించి రెండు రోజులైనా తగ్గని పక్షంలో వైద్యుని సంప్రదించాలి. కోళ్లని పెంచుతున్నపుడు అవి ఉన్న ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలి. కనీసం రెండు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి.

గోండి: ఈ వ్యాధి పిల్లుల మల మూత్రాల వల్ల వ్యాప్తి చెందుతుంది. పిల్లులు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో ఉండే ఇసుక కూడా హానికారకమే. ఈ వ్యాధి సోకినపుడు కండరాల నొప్పి, కీళ్ల వాపు, జలుబు బాధిస్తుంటాయి. పిల్లులను పెంచేవారు తరచూ చేతులను శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఇంటి చుట్టూ మొక్కలను పెంచుతున్నట్లయితే అక్కడ కూడా పిల్లులు తిరుగుతూ ఉంటాయి కాబట్టి కుండీల్లో మట్టిని మార్చడం, తోటపని తరవాత చేతులు, గోళ్లను వేడి నీటితో కడుక్కోవాలి. ఒకసారి ఈ వ్యాధికి గురయితే దీనిని నివారించడం అసాధ్యం.



రెండు నెలల కిందట విజయవాడను వరదలు చుట్టిముట్టినప్పుడు...
అందరిలా ఆమె ఇంట్లో టీవీ చూస్తూ 'అయ్యో పాపం' అనుకొని సరిపెట్టుకోలేదు.
పిల్లల చదువు కోసం దాచిన రూ.28 లక్షలతో ఆకలితో అలమటిస్తున్న వరద బాధితులకు అమ్మలా అన్నం పెట్టారు. ఆపన్నుల అవసరాలు తీర్చి ఆదుకున్నారు. అంతేకాదు...
వ్యక్తిత్వ వికాస, పోషకాహార నిపుణురాలుగా, సామాజిక కార్యకర్తగా
సమాజంలో ఒక గట్టి మార్పు కోసం కృషి చేస్తున్న **తులసి పద్మశ్రీ** 'నవ్య'తో పంచుకున్న విశేషాలు...



ఆపన్నులకు ఆసరాగా...

"మా వారి పేరు శ్రీనివాస్. రక్షణ రంగంలో మాజీ ఉద్యోగి. ఆయన ఉద్యోగ రీత్యా దేశంలోని చాలా ప్రదేశాల్లో కాపురం ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం విజయవాడలోని ఒక బ్యాంక్‌లో ఆయన పని చేస్తుండడంతో పన్నెండు ఏళ్లగా ఇక్కడే ఉంటున్నాం. నేను 2002లో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాక మా వివాహం జరిగింది. నాకు ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగం చేయాలని ఉండేది. ఈ విషయంలో కుటుంబంలో కొంచెం ప్రతిఘటన ఎదురైనా నా భర్త మద్దతుతో ముందడుగు వేశా. ఎమ్మెస్సీ బోటనీ, న్యూట్రిషన్‌తో పాటు యోగా, సెఫాలజీలో డిప్లమా పూర్తి చేశా. నా ఇద్దరు పిల్లల్లో అబ్బాయి శ్రేయాన్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అమ్మాయి యశశ్విని 'నీట్' లాంగ్ టర్మ్ శిక్షణ తీసుకుంటోంది. ఒక పక్క కుటుంబాన్ని చూసుకుంటూనే నా కెరీర్‌ను మలుచుకుంటూ వచ్చాను. ఇప్పటివరకు నేను ఎనిమిది విభిన్నమైన ఉద్యోగాలు చేశాను. మావారు గోవాలో డిఫెన్స్‌లో పనిచేస్తున్నప్పుడు అక్కడ స్కూల్ టీచర్‌గా చేశాను. అలాగే యోగా, కమ్యూనికేషన్ నైపుణ్యాల్లో శిక్షకురాలుగా, 'దూరదర్శన్'లో యాంకర్‌గా... ఇలా నాకు ఆసక్తి, అభిరుచి ఉన్న రంగాల్లో పనిచేస్తూ వచ్చాను. 2014లో రాజమండ్రి గైట్, ఆ తర్వాత జేకేసీ ఇంజనీరింగ్ కళాశాలల్లో సాఫ్ట్ స్కిల్స్ శిక్షకురాలుగా విధులు నిర్వహించా. మరోవైపు... పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం, మహిళా సాధకారితపై కేంద్ర ప్రభుత్వం ముంబాయి, అహ్మదాబాద్‌లలో నిర్వహించిన సదస్సులకు హాజరై, ఆ అంశాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. వాటి గురించి ఇతరులకు అవగాహన కల్పించడం ప్రారంభించాను.

కన్నీళ్లు ఆగలేదు...

ఈ ఏడాది సెప్టెంబరులో విజయవాడను వరదలు చుట్టిముట్టినప్పుడు... టీవీలో వార్తలు చూసి తొలుత ఆందోళన చెందాను. నా దగ్గర గతంలో పనిచేసిన వారు అక్కడ ఉన్నారని తెలుసుకొని, వారికి ఫోన్ చేసి, పరిస్థితి తెలుసుకున్నాను. ఇళ్ళు మునిగిపోయి వారు భయపడుతూంటే ధైర్యం చెప్పాను. 'నేను వస్తున్నా' అని బయలుదేరా. అక్కడి పరిస్థితులు చూసి కన్నీళ్లు ఆగలేదు. నీళ్లు ఎక్కువగా ఉండడంతో వారిని ఆ సమయంలో కలవడానికి సాధ్యపడలేదు. అయితే, వారందరికీ ఏదో రకంగా సాయం చేయలనిపించింది. మా అమ్మాయి వైద్య విద్య కోసం దాచుకున్న రూ.28 లక్షల్లో కొంత వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు వినియోగిద్దామని నా భర్తకు, పిల్లలకు చెప్పాను. వారు 'సరే'నన్నారు. వెంటనే పనులు ప్రారంభించాను. నా ఒక్కదాని వల్లే అంత మందికి సాయం చేయడం సాధ్యం కాదని గుర్తించి... నా పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చాను. నా కుటుంబ సభ్యులు, గతంలో నా క్లాసులు విన్న విద్యార్థులు, మా పిల్లల స్నేహితులు... ఇలా 460 మందికి పైగా వాలంటీర్లుగా పనిచేయడానికి ముందుకొచ్చారు. మొదట యనమలకుదురు, రామలింగేశ్వర నగర్, సింగ్ నగర్ ప్రాంతాల్లో 7,300 మందికి ఎనిమిది రోజుల పాటు మంచి భోజనాన్ని బాక్సులల్లో అందించాం. ఆ తర్వాత 2,200 మందికి పైగా బాధితులకు మందులు, దుప్పట్లు ఇచ్చాం. వరద ఉధృతి తగ్గాక 1,200 మందికి నిత్యావసర వస్తువులు పంచిపెట్టాం. వరద ఉధృతితో రోడ్డు మార్గం మూసుకుపోతే... నాలుగు కిలోమీటర్ల దూరం రైల్వే పట్టాలపై నడిచి వెళ్లి సాయం అందించాం. ఇవన్నీ చేసేసరికి మా దగ్గరున్న రూ.28 లక్షలూ పూర్తిగా ఖర్చు అయిపోయాయి. 'ఇంకాస్త ఎక్కువ డబ్బు దాచి ఉంటే మరికొంతమందికి సాయపడే దాన్ని' అనిపించింది.

చులకన భావం పోవాలి...

గతంలో మా దగ్గర పనిచేసే డ్రైవర్ మొదలు సూపర్‌వైజర్ వరకు ఏదైనా పని గురించి నేను ఎంత మంచిగా చెప్పినా సరిగ్గా లెక్క చేసేవారు కాదు. కొంచెం గట్టిగా అడిగితే... అదో విధంగా సమాధానం చెప్పేవారు. అదే నా స్థానంలో ఒక పురుషుడు ఉండి ఉంటే... వారిని తిడుతూ మాట్లాడినా వారు పట్టించుకోకుండా పనిచేసేవారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఎవరి మాటకైనా ఒక రకమైన విలువనివ్వాలి. మన సమాజంలో మహిళలంటే చులకన భావం పోవాలి. మహిళలు, పురుషులు సమానమనే భావన కలగాలి. అప్పుడే సమాజంలో మహిళలకు సంపూర్ణ గౌరవం లభిస్తుంది.

'మార్పు'నకు శ్రీకారం...

ఈ మధ్య పిల్లల్లో పెరుగుతున్న పౌష్టికాహారం లోపంతోపాటు దుందుడుకుతనం, తెంపరితనం, మొండితనం లాంటి లక్షణాల మీద అధ్యయనం చేశాను. వాటికి దారితీసే కారణాలు, పరిస్థితులను అంచనా వేసి ఒక ప్రాజెక్టును తయారు చేశాను. నేటి బాలలే రేపటి పౌరులు. భవిష్యత్ సమాజానికి ఆస్తి వారే కాబట్టి వారిని బాల్యం నుంచే మంచి లక్షణాలతో తీర్చిదిద్దితే వచ్చే తరం బాగుంటుంది. ముఖ్యంగా పేదపిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో నా ప్రాజెక్ట్ అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయనే ఆలోచనతో 'మార్పు' అనే స్వచ్ఛంద సంస్థను ఈ ఏడాది జూలైలో ప్రారంభించాను. దానిద్వారా ఇప్పటి వరకు 23 పాఠశాలల్లో సుమారు 2,500 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించాం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లల్లో 20 శాతం మందే చదువులో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. మిగిలిన వారు వివిధ కారణాలవల్ల అట్టడుగు స్థానంలోనే కొట్టుమిట్టాడుతున్నారు. అలాంటి పిల్లలకు చేయూతనిచ్చి, వారిని ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే ఉద్దేశంతో 'ఇంటరాక్టివ్ సెషన్స్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. ఈ ప్రాజెక్టును ప్రధానంగా... పెద్దలను గౌరవించడం, ఆహార నియమాలు (డైట్), కెరీర్ గైడెన్స్, సామాజిక బాధ్యత, మొబైల్ వినియోగం అనే అయిదు అంశాలతో రూపొందించాం. ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు ఇంట్లోని పెద్దవారు 'ఏది మంచి, ఏది చెడు' అని పిల్లలకు చెప్పేవారు. నేటి పిల్లల్లో చాలామందికి ఆ అవకాశం దొరకడం లేదు. అందుకే ఈ ఐదు అంశాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బోధిస్తే వారి భవిత బంగారమవుతుంది. ఈ ప్రాజెక్టు గురించి ఇటీవల ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు గారిని కలిసి వివరించాను. ఆయన సానుకూలంగా స్పందించి, దీనిపై కసరత్తు చేయమని ప్రభుత్వ అధికారులను కూడా ఆదేశించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు గురించి ప్రభుత్వాధికారులతో చర్చలు జరుగుతున్నాయి. ప్రభుత్వం చేయూతనిస్తే దాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి... పేద పిల్లలు వారి జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు తోడ్పడతాను."

● సంజయ్ ఎస్ఎస్‌బి



మెరిసే చర్మం కోసం పండ్ల రసాలు

చలికాలంలో చర్మం ఎక్కువగా తేమను కోల్పోతుంది. దీని వల్ల చర్మం పొడిబారి పగులుతుంటుంది. చర్మంపై తెల్లని పొరలు ఏర్పడి నిర్జీవంగా మారుతుంది కూడా. ఇలా కాకుండా చర్మం మృదువుగా నిగనిగలాడాలంటే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్ల రసాలు తాగాలి.

క్యారట్-నారింజ రసం

క్యారట్‌లో బీటా కెరోటిన్ సమ్మేళనాలు, ఎ విటమిన్ అధికంగా ఉంటాయి. ఎ విటమిన్ చర్మంలో కొత్త కణాల ఉత్పత్తికి దోహదం చేస్తుంది. నారింజలో సి విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మంలో కొల్లాజెన్ వృద్ధి పొందేలా చేస్తుంది. చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడుతుంది. మిక్సీ గిన్నెలో రెండు క్యారట్‌లను చిన్న ముక్కలుగా కోసి వేయాలి. అందులో ఒక నారిజ పండును తొక్క, గింజలు తీసి వేయాలి. ఒక గ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీనిని అలాగే గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలిపి తాగాలి. ఈ రసం చర్మానికి తేమను, కాంతిని అందిస్తుంది. ముడతలను పోగొడుతుంది.

బీట్‌రూట్-యాపిల్ రసం

బీట్‌రూట్‌లో ఐరన్, సి విటమిన్ ఉంటాయి. ఇవి రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. చర్మానికి పోషకాలను, ఆక్సిజన్‌ని అందిస్తాయి. యాపిల్‌లో విటమిన్లు, పీచుపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మం నుంచి విషపదార్థాలను తొలగిస్తాయి. మిక్సీ గిన్నెలో ఒక చిన్న బీట్‌రూట్‌ను తొక్క తీసి ముక్కలుగా కోసి వేయాలి. అందులోనే ఒక యాపిల్‌ను ముక్కలుగా కోసి వేయాలి. అర గ్లాసు నీళ్లు పోసి గ్రైండ్ చేయాలి. దీనిని గ్లాసులో పోసి రెండు చెంచాల నిమ్మరసం కలుపుకుని తాగాలి. ఈ బీట్‌రూట్-యాపిల్ రసం చర్మానికి పోషణను, మెరుపుని ఇస్తుంది.

దానిమ్మ రసం

దానిమ్మలో ఆంథోసియానిన్స్, పాలీఫెనాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కాపాడతాయి. చర్మం మీద గీతలు, ముడతలు రాకుండా చేస్తాయి. సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల వల్ల చర్మానికి నష్టం కలుగకుండా చేస్తాయి. ఒక పెద్ద దానిమ్మ పండును ఒలిచి గింజలను మిక్సీ గిన్నెలో వేయాలి. అందులో అరగ్లాసు నీళ్లు పోసి గ్రైండ్ చేయాలి. ఈ రసాన్ని గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలుపుకొని తాగాలి. ఈ రసం చర్మానికి రక్తం పట్టేలా చేసి ఆరోగ్యంగా ఉంచుతుంది.

బొప్పాయి-అనాస రసం

బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది చర్మంలోని మృత కణాలను తొలగిస్తుంది. అనాసలో సి విటమిన్ ఉంటుంది. ఇది ముఖం మీద మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలను పోగొడుతుంది. మిక్సీ గిన్నెలో ఒక కప్పు బొప్పాయి ముక్కలు, అర కప్పు అనాస పండు ముక్కలు వేసి అర గ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇందులో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా తేనె కలుపుకుని తాగితే చర్మానికి తగినంత తేమ అంది నున్నగా మెరుస్తుంది.

కీరా-నిమ్మ రసం

కీరాలో 95 శాతం నీళ్లు, సిలికా మినరల్స్ ఉంటాయి. ఇవి చర్మానికి తేమ, పోషణ అందిస్తాయి. నిమ్మరసం చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. మిక్సీ గిన్నెలో ఒక కప్పు కీరా ముక్కలు, రెండు చెంచాల నిమ్మరసం, కొన్ని పుదీనా ఆకులు వేసి అరగ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీనిని గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలుపుకుని తాగాలి. ఈ రసం చర్మానికి మంచి రంగుని మృదుత్వాన్ని అందిస్తుంది.

ఆదర్శం



బతుకు... బతికించు

జీవితమంతా కుటుంబ బాధ్యతలతోనే గడిచిపోయింది. తిరిగి చూసుకొంటే తనది అని చెప్పుకోవడానికి ఏమీ కనిపించలేదు. కానీ కూతురు ప్రోత్సాహం... ఆమెలో స్ఫూర్తి రగిలించింది. వయసు మీదపడుతున్నా లెక్క చేయక... మనసుకు దగ్గరైన పనికి పూనుకున్నారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి... కష్టాల్లో ఉన్నవారికి ఆపన్న హస్తం అందిస్తున్నారు. అరవై ఏళ్ల **అపర్ణా దాస్** అంతరంగం ఇది.



"పక్కవారికి కష్టం వస్తే స్పందించడం మన కనీస కర్తవ్యం. నేను చేస్తున్నది అదే. అభాగ్యులకు అండగా, ఒక మనిషిగా తోచిన సాయం అందిస్తున్నాను. అనాథలను సాధికారత వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నాను. ఈ ప్రయత్నం ప్రారంభించడానికి నేను ఎన్నో ఏళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోని బరాసత్ పట్టణంలోని ఓ మధ్యతరగతి కుటుంబం మాది. చిన్న వయసులోనే నాకు పెళ్లి చేశారు. అది మొదలు ఎన్నో బాధ్యతలు ఒక్కసారిగా నెత్తిన పడ్డాయి. మావారిది ఉమ్మడి కుటుంబం. వాళ్లు పదిమంది అన్నదమ్ములు. అత్తగారు, మామగారు... ఇల్లు ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉండేది. ఎవరికి ఏం కావాలన్నా నేనే చూసుకోవాలి. తెల్లవారుజాము నిద్ర లేచింది మొదలు... రాత్రి పడుకొనే వరకు ఓ పది నిమిషాలు కూర్చోడానికి కూడా సమయం దొరికేది కాదు. 1994లో మా అమ్మాయి పుట్టింది. పని భారం మరింత పెరిగింది. తనను పెంచి, పెద్ద చేయడం మీద శ్రద్ధ పెట్టాను. ఈ క్రమంలో నన్ను నేను కోల్పోయాను. నేను కన్న కలలు, అభిరుచులు, నాకంటూ ఒక జీవితం లేకుండా పోయాయి.

మా అమ్మాయి ప్రోత్సాహంతో...

లేచింది మొదలు ఇంట్లో అటూ ఇటూ పరుగెత్తడంతోనే దశాబ్దాలు గడిచిపోయాయి. నా బాధంతా పని గురించి కాదు... నాకు నచ్చినవేవీ చేయలేకపోతున్నాననే ఆవేదన. సామాజిక సేవ చేయాలనేది నా చిన్ననాటి కోరిక. పెళ్లితో ఆ కల నెరవేరే మార్గమే కనిపించలేదు. మా అమ్మాయి పెరిగి పెద్దదయింది. ఉన్నత చదువుల కోసం కోల్‌కతాకు వెళ్లింది. అప్పుడు నాకు కాస్త ఖాళీ సమయం దొరికింది. నన్ను చూసి నా కూతురు సుపర్ణ ఎప్పుడూ బాధపడుతూ ఉండేది. 'నా కోసం, మన కుటుంబం కోసం నువ్వు నీ జీవితంలో ఎంతో విలువైన సమయాన్ని వెచ్చించావు. ఎన్నో త్యాగాలు చేశావు. వాటన్నిటినీ తిరిగి తీసుకురాలేము. కానీ నువ్వు కోరుకున్నట్టు సామాజిక సేవ వైపు అడుగులు వెయ్యి. అందుకు నేను సహకరిస్తాను' అని మా అమ్మాయి చెప్పింది. తన మాటలు నాకు ప్రేరణనిచ్చాయి.

స్వచ్ఛంద సంస్థలతో కలిసి...

నాకు యాభై ఏళ్ల వయసులో నేను కోరుకున్నట్టు సామాజిక సేవ వైపు అడుగులు వేశాను. ఆ క్షణం నన్ను నేను నమ్మలేకపోయాను. అసలు ఇలాంటి రోజు ఒకటి నా జీవితంలో వస్తుందని అనుకోలేదు. మా ప్రాంతంలోని 'కిషాలయా చిల్డ్రన్స్ హోమ్'కు వెళ్లాను. అక్కడ వాలంటీర్‌గా పని ప్రారంభించాను. తొలుత ఖాళీ సమయాల్లో పని చేద్దామని భావించాను. కానీ ఒక్కసారి అందులోకి దిగాక... ఇక అదే నా జీవిత లక్ష్యం అయిపోయింది. 'కిషాలయా' అనేది అనాథ ఆశ్రమం. అక్కడి పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు జీవిత విలువలు బోధించాను. వారందరినీ నా సొంత బిడ్డల్లా చూసుకున్నాను. అలాగే 'ఆరాధన సోషల్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్'తో కలిసి నడిచాను. అందులోని చిన్నారులకు స్వశక్తితో ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యశిక్షణ ఇచ్చాను. చిన్నప్పటి నుంచే వృత్తి విద్యల వైపు ప్రోత్సహించాను. ఎందుకంటే వారికి నా అనే వారెవరూ ఉండరు. అలాంటివారి భవిష్యత్తు నిర్మాణ బాధ్యత మనదే కదా.

డబ్బే ప్రధానం కాదు...


సామాజిక సేవ చేయాలంటే ఎంతో డబ్బు ఖర్చు పెట్టాలని చాలామంది భావిస్తుంటారు. నా దృష్టిలో నిజమైన సేవకు డబ్బే ప్రధానం కాదు. దానికి కావల్సింది మానవత్వంతో స్పందించే హృదయం. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే నిధులు వాటంతట అవే సమకూరుతాయనేది నా నమ్మకం. డబ్బు ఇవ్వమని నేను ఎవరి వద్దకూ వెళ్లలేదు. ఇస్తే వద్దనలేదు. ఈ వయసులో కూడా నేను కష్టపడి సంపాదిస్తున్నాను. వచ్చినదంతా అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాల్లోని వారి కోసం ఖర్చు చేస్తున్నాను. వృద్ధాశ్రమాల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో దీన గాథ. పిల్లల కోసం అహర్నిశలూ చెమటోడ్చి, ఉన్నదంతా ధారపోసి, వయసు మీద పడ్డాక చివరకు ఇలా వృద్ధాశ్రమాల్లో ఒంటరిగా గడుపుతున్నారు. ఇది దారుణమైన పరిస్థితిలో మార్పు రావాలంటే... పిల్లలకు కుటుంబ, సామాజిక విలువలు బోధించాలి.

మనసు ఉప్పొంగుతుంది...

ఎప్పుడైతే ఇటువైపు వచ్చానో అప్పటి నుంచి నా కాళ్లపై నేను నిలబడడం అలవాటు చేసుకున్నాను. ఒకసారి మా ఇంట్లో పుట్టగొడుగులు పెంచాను. నాకు అందులో అనుభవం ఉంది. తరువాత అదే నా సంపాదన మార్గం అయింది. ఇప్పుడు పుట్టగొడుగుల సాగు చేస్తున్నాను. అలాగే మా ప్రాంతానికి ప్రత్యేకమైన ఒడియాలు పెట్టి అమ్ముతున్నాను. దీనివల్ల నాతోపాటు మరికొంతమంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. మొదట్లో గడప దాటినప్పుడు మావారు 'ఎక్కడికి? ఎందుకు' అని అడిగేవారు. నిదానంగా ఆయనకు నా గురించి అర్థమైంది. అప్పటి నుంచి తను కూడా నాకు మద్దతుగా నిలుస్తున్నారు. నా ప్రయత్నంవల్ల అనాథ ఆశ్రమాల్లో పెరిగిన కొందరు పిల్లలు ఇప్పుడు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వాళ్లను చూసినప్పుడు ఎంతో ఉద్వేగానికి లోనవుతాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతుంది. ఒక సాధారణ గృహిణిగా ఇంతమంది జీవితాల్లో మార్పు తేగలిగినందుకు సంతృప్తిగా ఉంది. మనం బతకాలి. పక్కవారిని బతికించాలి. ఇదే నా నినాదం."

హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...



1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
4. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
5. భూల్ భులాయా (భూల్ భులాయా3)
6. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
7. నైనా (క్రూ)
8. ఆయీ నై (స్త్రీ-2)
9. జా రాంఝన్ (దో పత్తీ)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

మధుమేహ కేసుల్లో మూడో స్థానం

తెలంగాణలో 30 దాటినవారిలో 14% మంది చక్కెరవ్యాధి బాధితులు

- జాతీయస్థాయి సగటు 9.16 శాతం.. కేంద్రపాలితప్రాంతాల్లో పుదుచ్చేరి టాప్
- గణాంకాలు విడుదల చేసిన కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ



హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధుమేహ రోగుల సంఖ్య విషయంలో తెలంగాణ.. దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో మూడోస్థానంలో నిలిచింది. మన రాష్ట్రంలో మూడుపదుల పైబడిన వారిలో 14 శాతం మంది షుగర్ పేషంట్స్ ఉన్నారని.. కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తాజాగా పార్లమెంట్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొంది. అసాంక్రామిక (ఒకరి నుంచి మరొకరికి సోకని) వ్యాధుల (ఎన్‌సీడీ) పోర్టల్ ప్రకారం ఈ ఏడాది నవంబర్ 30 వరకూ అన్ని రాష్ట్రాల్లో నమోదైన డయాబెటిస్ గణాంకాల వివరాలను అందులో వెల్లడించింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎమ్)లో ఒక కార్యక్రమమైన ఎన్‌సీడీ స్ర్కీనింగ్‌లో భాగంగా 30 ఏళ్లు దాటిన వారికి వైద్య, ఆరోగ్యశాఖ రక్తపోటు, మధుమేహానికి సంబంధించిన పరీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ ఏడాది అన్ని రాష్ట్రాల్లో కలిపి 32,33,32,732 మందికి పరీక్షలు చేయగా.. 2,96,26,225 మందికి (9.16 శాతం) చక్కెరవ్యాధి ఉన్నట్టు తేలింది. తెలంగాణలో 1.75 కోట్ల మందికి పరీక్షలు చేయగా.. అందులో 24.52 లక్షల మంది షుగర్ పేషెంట్లే కావడం గమనార్హం. అంటే పరీక్షలు చేయించుకున్న వారిలో 14 శాతం మంది. పెద్ద రాష్ట్రాల్లో పంజాబ్, మహారాష్ట్ర మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. పంజాబ్‌లో 20.51 లక్షల మందికి పరీక్షలు చేయగా.. ఏకంగా 6.73 లక్షల మందికి (32.82 శాతం) మధుమేహం ఉన్నట్టు తేలింది. మహారాష్ట్రలో 2.49 కోట్లమందికి పరీక్షలు చేయగా.. 40.03 లక్షల మంది (16 శాతం) డయాబెటిస్ బాధితులున్నట్టు వెల్లడైంది. మూడో స్థానంలో తెలంగాణ ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా రాజస్థాన్ (13 శాతం), కర్ణాటక (12 శాతం), మధ్యప్రదేశ్ (11 శాతం) ఉన్నాయి. ఇక, చిన్నవైన ఈశాన్యరాష్ట్రాల్లో నాగాలాండ్‌లో 32 శాతం, సిక్కింలో 25 శాతం షుగర్ వ్యాధిగ్రస్తులున్నట్టు ఎన్‌సీడీ లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో 55 శాతం కేసులతో పుదుచ్చేరి అగ్రస్థానంలో ఉంది. అక్కడ లక్ష మందికి పరీక్షలు చేయగా అందులో 55 వేలమందికి షుగర్ ఉన్నట్లు తేలింది. అండమాన్ నికోబార్‌లో 23 శాతం మంది మధుమేహులున్నారు.

దక్షిణాది కేసులు ఎక్కువే!

దేశంలో దక్షిణాది రాష్ట్రాలు డయాబెటిస్ కేంద్రాలుగా మారుతున్నట్టు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది చేసిన పరీక్షల్లో మధుమేహ బాధితులుగా తేలినవారు దేశం మొత్తమ్మీదా కలిపి 2.96 కోట్ల మంది ఉండగా.. అందులో 1.36 కోట్ల మంది ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలవారేనని ఎన్‌సీడీ స్ర్కీనింగ్‌లో తేలింది.

ఆహారపుటలవాట్లే సమస్య



మన దగ్గర పట్టణ, నగర జనాభా ఎక్కువ. తెలంగాణలో 42 శాతం మంది పట్టణాల్లో ఉంటున్నారు. ఉద్యోగులు, వైట్ కాలర్ జాబ్ చేసే వారి సంఖ్యా ఎక్కువే. మనది ధనిక రాష్ట్రం కావడంతో అలవాట్లు కూడా అలాగే మారాయి. చాలామంది ఇంట్లో తినడం మానేసి బయటే ఎక్కువగా తింటున్నారు. దేశంలో ఏ నగరంలోనూ లేని విధంగా మన హైదరాబాద్‌లో రెస్టారెంట్లు, హోటళ్లు అన్నీ కలిపి 72 వేలకు పైగా ఉన్నాయంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జీవనశైలి చాలా మారింది. శారీరక శ్రమ తగ్గింది. వరి అన్నం ఎక్కువగా తినడం, ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు, ధూమపానం, మద్యపానం, కొద్ది దూరాలకు కూడా.. నడవడం మానేసి వాహనాలపై వెళ్లడం వంటి అలవాట్లతో మనదగ్గర షుగర్ పేషంట్స్ పెరుగుతున్నారు. 30ల్లోనే డయాబెటిస్ కేసుల సంఖ్య పెరుగుతోంది. 25 ఏళ్లకే ప్రీ-డయాబెటిస్ కేసులు వస్తున్నాయి. పిల్లల్లోనూ ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఈ పరిస్థితి మారాలంటే.. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. శారీరక శ్రమ, వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అలవర్చుకోవాలి.

- డాక్టర్ ఎంవీ రావు, కన్సల్టెంట్ ఫిజిషియన్, యశోదా ఆస్పత్రి, హైదరాబాద్

జీవనశైలి మార్పులతో మధుమేహానికి చెక్!

కూర్చుని చేసే ఉద్యోగాలు.. మూడుపూటలా అన్నం (లేదా) పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే అల్పాహారాలు తినడం.. శారీరక శ్రమ లేకపోవడం.. ఇలా జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా మధుమేహ బాధితుల సంఖ్య పెరుగుతోంది. కాబట్టి.. మందుల వాడకంతో పాటు జీవనశైలిలో, ఆహారపుటలవాట్లలో మార్పుల ద్వారా దాన్ని బాగా నియంత్రించవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. అందులో భాగంగా కార్బోహైడ్రేట్లు (పిండిపదార్థాలు) ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలను బాగా తగ్గించాలని సూచిస్తున్నారు. వారు చెబుతున్నదాని ప్రకారం.. పిండిపదార్థాల్లో రెండు రకాలుంటాయి. అవి.. సింపుల్ (సరళ) కార్బోహైడ్రేట్లు, కాంప్లెక్స్ (సంక్లిష్ట) కార్బోహైడ్రేట్లు. మొదటి రకం పిండిపదార్థాలు పంచదార, శీతలపానీయాల వంటివాటిలో ఉంటాయి. కాబట్టి వాటిని మానేయడం మంచిది. రెండో రకం (కాంప్లెక్స్) కార్బోహైడ్రేట్లు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అవి ఎక్కువసేపు శక్తినిస్తాయి. వీటిని తినొచ్చు. మాంసకృత్తులు (ప్రొటీన్) ఎక్కువగా ఉండే పదార్థాలు, ఆకు కూరలు, కూరగాయలు, పొట్టుతో ఉన్న తృణ ధాన్యాలను అధికంగా తీసుకోవాలి. ఆఫీసులో పనిచేసేవారైతే.. ఎక్కువసేపు కదలకుండా కూర్చోకూడదు. కనీసం అరగంట - గంటకు ఒకసారి లేచి అటూ ఇటూ తిరగాలి. నిత్యం వ్యాయామం చేయడం లేదా వారానికి కనీసం మూడు రోజులైనా కసరత్తులు చేయడం మంచిది. కంటి నిండా నిద్ర కూడా ముఖ్యమే. రోజుకు ఎనిమిది గంటలపాటు.. అంతరాయం లేని నిద్ర ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది. మధుమేహం బారిన పడ్డట్టు నిర్ధారణ అయిన వెంటనే.. బరువు తగ్గగలిగితే రక్తంలో చక్కెర స్థాయులను అదుపులో ఉంచవచ్చని ఒక అధ్యయనంలో వెల్లడైంది. వైద్యులు, పోషకాహార నిపుణుల సాయంతో ఆహారపుటలవాట్లను మార్చుకుని, రోజూ వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గడానికి ప్రయత్నం చేయాలి. భారీ స్థూలకాయంతో బాధపడేవారు, బాడీ మాస్ ఇండెక్స్ 35 కంటే ఎక్కువగా ఉండేవారు.. షుగర్ వచ్చిన తొలినాళ్లలో.. వైద్య నిపుణులను సంప్రదించి, బేరియాట్రిక్ సర్జరీ వంటి ప్రత్యామ్నాయాలనూ పరిశీలించవచ్చు. మధుమేహాన్ని పూర్తిగా నయం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా శాస్త్రజ్ఞులు చాలా పరిశోధనలే చేస్తున్నారు. సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, షుగర్ ఉన్నా లేనట్టే జీవించేలా చేసే ఇన్సులిన్ మాత్రల వంటి ప్రయోగాలు చాలా జరుగుతున్నాయి. అవి విజయవంతమై షుగర్‌ను నయం చేసే మందులు అందుబాటులోకి వచ్చే దాకా మన జాగ్రత్తలో మనం ఉండాల్సిందే.

తెలంగాణ తల్లి పండుగ

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుండగా.. తొలి రోజు సమావేశంలోనే తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవంపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేయనున్నారు. దీంతోపాటు విగ్రహం రూపకల్పన తదితర అంశాలపైనా ప్రకటన చేస్తారు. అనంతరం ఆ ప్రకటనపై సభలో చర్చ జరగనుంది. చర్చ ముగిసిన తర్వాత తెలంగాణ తల్లి ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉత్తర్వులు జారీ అయ్యాక.. సచివాలయంలో జయజయహే తెలంగాణ గీతాలాపన నడుమ.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఆ విగ్రహ శిల్పి రమణారెడ్డికి, జయ జయహే గీత రచయిత అందెశ్రీకి సన్మానం చేస్తారు. ఈ సందర్భంగా గద్దర్, గూడ అంజన్న వంటి కళాకారుల త్యాగాలకు గుర్తుగా ఓ ప్రకటన కూడా చేసే అవకాశం ఉంది.



అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమావేశమైన శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్

సోనియాకు జన్మదిన కానుక..!

ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని 2009లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన సంగతి తెలిసిన విషయమే. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీనే తెలంగాణకు తల్లి అంటూ కాంగ్రెస్ ముఖ్య నాయకులు ప్రకటనలు కూడా చేస్తుంటారు. తాజాగా సోనియాగాంధీ పుట్టిన రోజున తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి.. ఏటా అదే రోజున ఉత్సవాలు నిర్వహించాలన్న నిర్ణయానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రావడం ఒక రకంగా ఆమెకు ఇస్తున్న జన్మదిన కానుకేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ఏడు పనిదినాల పాటు సమావేశాలు..

సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఐదు నుంచి ఏడు పని దినాలపాటు కొనసాగే అవకాశం ఉంది. పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మంగళ, బుధ వారాలు విరామం ఇచ్చే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. తొలిరోజు సమావేశానంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగే బీఏసీ భేటీలో సమావేశాల అజెండాపై స్పష్టత రానుంది. అయితే ఈ సమావేశాల్లో ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ఆర్‌వోఆర్-2024 బిల్లుపైనే చర్చ జరగనుంది. అలాగే ముగ్గురు పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, ప్రతి మండలంలోనూ కనీసం ఐదు ఎంపీటీసీలు ఉండేలా నిబంధన, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు, ఒకే పర్యాయానికి వర్తింపు వంటి సవరణలు చేస్తూ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లునూ ఈ సమావేశాల్లోనే చర్చకు పెట్టనున్నారు. కాగా, జీతాలు, పింఛను చెల్లింపు, అనర్హతల తొలగింపు, పురపాలక సంఘాలు, జీహెచ్‌ఎంసీ, వస్తు సేవల పన్ను చట్టాలకు సంబంధించిన సవరణ బిల్లులను ప్రవేశ పెట్టనున్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను కచ్చితంగా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో రైతు భరోసా విధివిధానాలపైనా ఈ సమావేశాల్లోనే చర్చించనున్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా సాధించిన విజయాలపైనా సీఎం రేవంత్ ప్రకటన చేసే అవకాశం ఉందంటున్నారు.

వాడీవేడిగా సభలు!

అసెంబ్లీ శీతాకాల సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మూసీ ప్రక్షాళన, హైడ్రా కూల్చివేతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న సమావేశాలు కావడంతో హోరాహోరీగానే చర్చ జరిగేందుకు ఆస్కారం ఉందంటున్నారు. ఈ అంశాలపై సభను వేదికగా చేసుకుని సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర వివరణ ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే సమయంలో ఏడాది పాలనా వైఫల్యాలపై చార్జిషీట్లు విడుదల చేసిన బీఆర్‌ఎస్, బీజేపీ.. ఈ సమావేశాల్లో ప్రభుత్వంపై ఎదురుదాడి చేసేందుకు అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపైనా ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్.. అసెంబ్లీ సమావేశాలను వేదికగా చేసుకుని కార్యాచరణ చేపట్టే అవకాశం ఉందంటున్నారు. ప్రభుత్వంపై దాడికి ప్రతిపక్షాలు, వారిపై ప్రతిదాడికి ప్రభుత్వం సిద్ధమైన నేపథ్యంలో సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలు ఆసక్తి రేపనున్నాయి.

అధికారులతో స్పీకర్, చైర్మన్ సమావేశం..

శాసనసభ, మండలి శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆదివారం ప్రభుత్వ, పోలీసు శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. స్పీకర్ చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాల హుందాతనం, ఔన్నత్యం కాపాడుకుంటూ ప్రతి అంశంపైనా సమగ్ర చర్చ జరగాల్సి ఉందన్నారు. గతంలో లాగానే అధికారులు, పోలీసులు అన్ని విధాలుగా సహకరించాలన్నారు. గౌరవ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. గత సమావేశాలకు సంబంధించిన ప్రశ్నలకు పెండింగులో ఉన్న జవాబులను వెంటనే పంపించాలన్నారు. సభలో సభ్యులు ప్రస్తావించిన అన్ని అంశాలకు సంబంధించిన సరైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. సమావేశాలు జరిగినన్ని రోజులు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉండాలని, ప్రతి శాఖ తరఫున ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు.

ప్రొటోకాల్ విషయంలో ఇబ్బందులు

తాము జిల్లాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రొటోకాల్ నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయని మండలి గుత్తా సుఖేందర్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రొటోకాల్ అమలు విషయంలో వివాదాలు, ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. ప్రభుత్వాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రధాన గేట్ల వద్ద ఉండే పోలీసు సిబ్బంది.. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను గుర్తించట్లేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను శ్రీధర్‌బాబు ఆదేశించారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, తనిఖీలు నిర్వహించి.. సమావేశ మందిరంలోకి నిషేధిత వస్తువులను తీసుకురాకుండా చూడాలని సూచించారు.

నవ్య | చిత్రజ్యోతి

పోరాట వీరుడి కథ



విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. కాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి చెన్నైలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'పెరుమాళ్ అనే పాత్రలో విజయ్ సేతుపతి అభినయం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. పెరుమాళ్ పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రిమారన్ ప్రజెంట్ చేశారు. తెలుగులో విజయ్ సేతుపతికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ చిత్రంలో ఎమోషన్స్, యాక్షన్ అన్నీ రియాల్టీకి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది' అని అన్నారు. మంజువారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్, రాజీవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. కాగా, గతేడాది రిలీజైన 'విడుదల' పార్ట్ 1 చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకొని సూపర్ హిట్‌గా నిలిచింది.

యాక్షన్ థ్రిల్లర్



పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిల్మ్ సిటీ, మొయినాబాద్ లోకేషన్స్‌లో జరిగే ఈ చిత్రీకరణలో గౌతమ్, జ్యోతి పూర్వజ్ పాల్గొంటారు.

డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్



తెలుగు ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రకాశ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్షుడిగా ప్రకాశ్ ఎన్నికవడం ఇది ఐదోసారి. కాగా, జానీని అధ్యక్షుడిగా తొలగించడంతో పాటు ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జానీపై పోక్సో కేసు విచారణలో ఉండటం, అసోసియేషన్‌లో జానీ ప్రవర్తన అగ్రెసివ్‌గా ఉండేదనే రిపోర్టు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

మోహన్‌బాబు.. మనోజ్ మధ్య గొడవ?





సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య ఆస్తుల పంపకాల విషయంలో గొడవ జరిగినట్లు మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ విషయం సినీ ఇండస్ట్రీతో పాటు.. అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పహాడీషరీఫ్ పరిధిలోని మోహన్‌బాబు ఇంట్లో ఆస్తుల పంపిణీ జరుగుతున్న క్రమంలో స్కూలుకు సంబంధించిన వాటాల్లో విభేదాలు తలెత్తి మోహన్‌బాబు అనుచరులు వినయ్ ఇతర బౌన్సర్లు మనోజ్‌పై, ఆయన భార్య మౌనికపై దాడికి పాల్పడి గాయపరిచినట్లు.. గాయాలతోనే మనోజ్ తన భార్యతో కలసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై మహేశ్వరం డీసీపీని సంప్రదించగా డయల్-100కు కాల్ వచ్చిందని, వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కాలుకు గాయం అయిన మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలసి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రితో జరిగిన గొడవ విషయమై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మనోజ్, మౌనిక మాట్లాడటానికి నిరాకరించారు. కాగా, మనోజ్ ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో డిశ్చార్జి అయ్యారు. మనోజ్‌కు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) పూర్తి చేసిన వైద్యులు ఆయన ఒంటిపై అనుమానాస్పద దెబ్బలు ఉండటంతో ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాలు, మెడ భాగంలో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారని తెలిసింది. సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ పరీక్షలు పూర్తి చేసిన వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించగా.. సోమవారం మరోసారి ఆస్పత్రికి వస్తానని మనోజ్ డిశ్చార్జి అయినట్లు తెలిసింది.

అంతా అబద్ధం : మోహన్‌బాబు

ఆస్తుల పంపకాల్లో మా ఇంట్లో గొడవలు జరిగాయని.. మనోజ్‌ను నేను కొట్టానని ఉదయం నుంచి మీడియాలో షికార్లు చేస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

14న ఎన్టీఆర్ సినీ ప్రస్థాన వజ్రోత్సవం



నందమూరి తారకరామారావు సినీ ప్రస్థాన వజ్రోత్సవం ఈ నెల 14న పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుందని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల చైర్మన్ టీడీ జనార్దన్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ హాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో టీడీ జనార్దన్ మాట్లాడుతూ "సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు సాటి లేదు. కృష్ణుడిగా, రాముడిగా నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన తొలిసారి నటించిన 'మనదేశం' చిత్రం 75 ఏళ్లు అయిన సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేశ్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌తో పాటు 24 క్రాఫ్ట్స్‌తో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు అనుపమరెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాచౌక్, విజయవాడ (ఆంధ్రజ్యోతి)

ఒక్కసారి ప్రేమిస్తే చాలు



బాలీవుడ్ సీనియర్ నటి రేఖ రీసెంట్‌గా ఓ రియాల్టీ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పంచుకున్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రేమలో పడతారని కవులు తమ రచనల్లో రాస్తే...మరికొందరు మాత్రం ప్రేమకు ఆది, అంతం లేదంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి అని యాంకర్ రేఖను ప్రశ్నించగా..'నా మటుకు, ఆ వ్యక్తి సరైన వాడైతే... ఒక్కసారి ప్రేమిస్తే చాలు' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానంగా నిజమైన ప్రేమకు నిర్వచనం చెబుతూ 'ఎవరినైనా ప్రేమించండి, నా వరకైతే నేను మొదట అన్నిటినీ ప్రేమిస్తాను. నా వృత్తిని, నా స్నేహితులను, ఈ ప్రపంచాన్ని, ప్రకృతిని ఇలా...ప్రతీదాన్ని ప్రేమిస్తాను. కానీ, నన్ను నేను ఎక్కువగా ప్రేమిస్తా' అని చెప్పుకొచ్చారు. రేఖ మాటలు విన్న ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.

మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి



ఇటీవలే 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ప్రస్తుతం ఆమె మరో వెబ్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'లో నటిస్తున్నారు. 'ద బ్లడీ కింగ్‌డమ్' అనేది ఉపశీర్షిక. తాజాగా, కొద్ది గ్యాప్ తర్వాత ఈ సిరీస్ సెట్స్‌లోకి ఆమె తిరిగి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బ్యాక్ టూ యాక్షన్ మోడ్ అని పేర్కొన్నారు. 2018లో విడుదలైన హారర్ చిత్రం 'తుంబాడ్'తో గుర్తింపు తెచ్చుకున్న అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యాంటసీ వెబ్‌సిరీస్‌ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. ఈ నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, ఆలీ ఫాజల్, వామికా గబ్బీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.


అరకులో మాస్ జాతర



రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'సామజవరగమన' రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆ తరవాత పాడేరు, ఆంధ్రా-ఒడిషా సరిహద్దు లోకేషన్స్‌లో చిత్రీకరణ జరగనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అసత్య ప్రచారాన్ని ఆపండి

- రెహమాన్ కుమార్తె ఖతీజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన భార్య సైనా బానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనపై పలు ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు రెహమాన్ కుటుంబ సభ్యులు తిప్పికొడుతూనే ఉన్నారు. అయితే రీసెంట్‌గా మరో వార్త వైరల్ అవుతోంది. వైవాహిక బంధానికి స్వస్తి పలికిన రెహమాన్..సంగీతానికి కొంత కాలం దూరంగా ఉండనున్నారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెహమాన్ మ్యూజిక్‌ని మిస్ అవ్వాల్సిందేనా? అంటూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టులు పెట్టారు. ఈ వార్తలపై ఇప్పటికే రెహమాన్ కుమార్తె ఖతీజా 'ఎక్స్' వేదికగా స్పందించారు. అయినా రూమర్లు ఆగకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరోసారి రియాక్ట్ అయ్యారు. 'దయచేసి అసత్య ప్రచారాన్ని ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. వార్తను ప్రచురించిన ఓ మీడియాను కోట్ చేస్తూ అలా రాయడం సబబు కాదన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ నేడే

సాయంత్రం 6.05 గంటలకు సచివాలయంలో.. లక్ష మంది మహిళల సమక్షంలో కార్యక్రమం

» అనంతరం సీఎం రేవంత్ బహిరంగ సభ

» నేటితో ముగియనున్న ప్రజా విజయోత్సవాలు

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం 6.05 గంటలకు సచివాలయంలో దాదాపు లక్ష మంది మహిళల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. లక్ష మంది జనసమీకరణ నేపథ్యంలో సచివాలయం పరిసర ప్రాంతాల ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లించనున్నారు. విగ్రహావిష్కరణ నుంచి రాత్రి వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విగ్రహావిష్కరణ, బహిరంగ సభ తరువాత రాత్రి 7.30 గంటలకు ఎన్టీఆర్ మార్గ్ వద్ద డ్రోన్ షో, 8గంటలకు బాణసంచా ప్రదర్శన ఉంటుంది. అనంతరం హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్ నేతృత్వంలో మ్యూజికల్ కార్యక్రమం నిర్వహిస్తారు. కాగా, తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలోని ప్రధాన ద్వారం ఎదురుగా ప్రభుత్వం ఏర్పాటుచేసింది. విగ్రహావిష్కరణ నేపథ్యంలో విగ్రహానికి రెండువైపులా వేదికలను సిద్ధం చేశారు. ఎడమ వైపు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు కూర్చునేందుకు వీలుగా ఒక వేది కను, మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం మరో వేదికను సిద్ధం చేశారు. ఈ రెండు వేదికలకు ఎదురుగా అతిథులు, ప్రముఖులతో పాటు మహిళలు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

వివాదాలు, ఆరోపణల నడుమ..

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన తెలంగాణ తల్లి విగ్రహం పలు వివాదాలు, ఆరోపణల నడుమ సోమవారం ఆవిష్కరణ కాబోతోంది. గత ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహంలో రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయని, దొరసాని తరహాలో ఉందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆరోపించింది. ఈ క్రమంలోనే గతేడాది డిసెంబరులో అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహంపై దృష్టిపెట్టింది. విగ్రహం ఎలా ఉండాలనే దానిపై సమాలోచనలు జరిపి.. ప్రస్తుత విగ్రహాన్ని రూపొందించారు. అయితే కాంగ్రెస్ ఆవిష్కరించబోయే విగ్రహ నమూనాను విడుదల చేసినప్పటి నుంచి ప్రతిపక్ష బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. అధికార పార్టీ రూపొందించిన విగ్రహం తెలంగాణ తల్లి కాదని, కాంగ్రెస్ తల్లి అంటూ తీవ్రంగా విమర్శించారు. ఇక గత విగ్రహంలో ఉన్నట్లుగా కిరీటం ప్రస్తుత విగ్రహంలో ఎందుకు లేదంటూ కూడా ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న 'ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు' సోమవారంతో ముగియనున్నాయి.

విగ్రహ పనులను పరిశీలించిన సీఎం..

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ నుంచి నడుచుకుంటూ తన చాంబర్‌కు వెళ్లారు.



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కోమటిరెడ్డి

కాంగ్రెస్ పాలనపై చార్జిషీట్ వేసే నైతికత బీఆర్ఎస్‌కు లేదు

» తెలంగాణ తల్లిపై ప్రేమ ఉన్న ప్రతి ఒక్కరూ విగ్రహావిష్కరణకు వస్తారు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాంగ్రెస్ పాలనపై చార్జిషీట్ వేసేంత నైతికత బీఆర్ఎస్‌కు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడగానే దళితుడినే సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగమిస్తామని చెప్పి.. అవి చేయలేకపోయిన కేసీఆర్‌పై అప్పుడు ఎందుకు చార్జిషీట్ వేయలేదని మండిపడ్డారు. సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాట్లను ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై బీఆర్ఎస్ చార్జిషీట్ విడుదల చేసిన నేపథ్యంలో ఘాటుగా స్పందించారు. తెలంగాణ కోసం శ్రీకాంతాచారి చావునోట్లో తలపెట్టి చనిపోయాడని, మరి కేసీఆర్ ఎలా బయటపడ్డారో ప్రజలకు తెలుసన్నారు. హరీశ్, కేటీఆర్‌లది రాజకీయ ఉనికి కోసం చేసే ఆరాటమే తప్ప.. వారిది నిజమైన ప్రతిపక్ష పాత్రకాదని చెప్పారు. సోమవారం నిర్వహించే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానించామని తెలిపారు. తెలంగాణ, తెలంగాణతల్లిపై ప్రేమ ఉన్న ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి వస్తారని, తెలంగాణ అంటే ఇష్టం లేనివారు రారని అన్నారు. నిజమైన తెలంగాణవాదులెవరో తెలిసే వేదిక ఇదేనని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహానికి ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న వేదికలకు సంబంధించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. సచివాలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు..

» క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్లు ఉన్నారనడంతో ఆంతర్యమేంటి?: సీతక్క

మహబూబాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్లు ఉన్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అనడంలో ఆంతర్యమేమిటని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. ఆదివారం మహబూబాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తాను ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చిన మాట వాస్తవమేనని, ఉద్యమాల నుంచి బయటకు వచ్చాక ఐదేళ్లు న్యాయవాదిగా పనిచేశానని, 3 సార్లు ములుగు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించానని, 20 ఏళ్ల తర్వాత ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. తనను రాజకీయంగా దెబ్బ తీయడానికే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్ నేపథ్యం ఏమిటో చెప్పాలని, ఆయన కూడా వామపక్ష భావజాలం నుంచి వచ్చిన వారే కదా అని ప్రశ్నించారు. తాను తొలుత ములుగు ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో టీడీపీ, బీజేపీ అలియన్స్‌లో పోటీ చేశానని, అప్పుడు బీజేపీకి తాను అర్బన్ నక్సలైట్‌నని గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ చార్జిషీట్ వేసిందని, అందులో ఏమి చెప్పదలుచుకుందని నిలదీశారు.

ప్రతిపక్షాలిచ్చింది చార్జిషీట్ కాదు రిప్రజంటేషన్

» బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే: పొన్నం

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాలు ఇచ్చింది చార్జిషీట్ కాదని, దాన్ని రిప్రజంటేషన్‌గా తాము భావిస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వారు చార్జిషీట్ పేరిట ఇచ్చిన ప్రజంటేషన్‌ను రిప్రజంటేషన్‌గా భావించి అందులోని అంశాలను పరిశీలించి, నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఏడాది పాలన తర్వాత మమ్మల్ని విమర్శించి చార్జిషీట్ వేస్తే బాగుండేది కానీ, ప్రభుత్వం ఏర్పడిన నెల నుంచే ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రారంభించారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కాదు, రెండూ ఒక్కటేనని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన నెలకే 'ప్రభుత్వం ఎట్లా నడుస్తుందో?' అంటూ పిల్లి శాపనార్థాలు పెట్టారని, ప్రభుత్వాన్ని కూలగొడతామన్నారని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు పని ఒత్తిడి కారణంగా హాజరు కాలేకపోతున్నట్లు కేంద్రమంత్రి బండి సంజయ్ తనకు ఫోన్ చేసి చెప్పారని తెలిపారు. ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీకి అధికారుల ద్వారా ఆహ్వానాన్ని పంపించామన్నారు.

పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది దోపిడీ.. భూకబ్జాలే

» ఏడాదిలోనే రేవంత్ అద్భుత పాలన: కడియం శ్రీహరి

వరంగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది దోపిడీ, భూకబ్జాలేనని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. పదవులను అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం అడ్డగోలుగా ప్రజాధనాన్ని దోచుకుందని విమర్శించారు. ఆదివారం హనుమకొండ జిల్లా మడికొండలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలోనే రేవంత్‌రెడ్డి అద్భుత పాలన అందించారని కొనియాడారు. కాళేశ్వరం నీళ్లు లేకుండానే ఒక్క ఖరీఫ్‌లోనే 66.70 లక్షల ఎకరాల్లో వరిసాగు చేసి 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, యశస్వినిరెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

» లేదంటే చలో పల్లెబాట: తాజా మాజీ సర్పంచుల జేఏసీ

పంజాగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తాజామాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నేతలు స్వయంప్రభ, అంజయ్య, గంగాధర్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా రావాలని చెప్పారు. ఆస్తులు అమ్ముకుని, బంగారు ఆభరణాలు కుదువ పెట్టి అప్పులు తెచ్చి పనులు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లోపు పెండింగ్ బిల్లులు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా పల్లెబాట కార్యక్రమం చేపట్టి ప్రభుత్వం తీరును ఎండగడతామని హెచ్చరించారు. అయినా స్పందన రాకపోతే ఈ నెల 27న అమరవీరుల స్థూపం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించారు.

నింగి తనవైపు లాక్కున్నట్టు..

మనసు ఉప్పొంగి గాల్లో తేలినట్టు! .. వీక్షకులను ఉర్రూతలూగించిన 'ఎయిర్ షో'

» షోను ప్రారంభించి, మంత్రులతో కలిసి తిలకించిన సీఎం రేవంత్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, అల్వాల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒక విమానానికి మరో విమానం తాకుతుందేమో అన్నట్టుగా అత్యంత సమీపంలో తొమ్మిది విమానాలు గాల్లో వరుసగా ఎగురుతుంటే? పైగా రేఖామాత్రంగానైనా దూరంగా జరగకుండా ఆదే సామీప్యతను కొనసాగిస్తూ ఒక్కసారిగా అన్నీ నేలను తాకుతాయేమో అన్నట్టుగా కిందకు దూసుకొచ్చి.. మళ్లీ గాల్లోకి లేస్తే? అదే వేగంతో రౌండ్ రౌండ్‌గా చక్కర్లు కొడితే? ఇదంతా మన కళ్ల ముందే జరిగితే? అదెంతత గొప్ప అనుభూతో కదా! ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం హుస్సేన్‌సాగర తీరాన నిర్వహించిన 'ఎయిర్ షో'ను చూసి జనం కాసేపు తమను తామే మరిచిపోయారు. కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులతో కలిసి ఎయిర్‌షోను ప్రారంభించి, వీక్షించారు. అరగంటకు పైగా సాగిన ఎయిర్ షోలో భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి బృందానికి చెందిన తొమ్మిది హాక్ ఎంకే 132 విమానాలు చేసిన విన్యాసాలు ఔరా అనిపించాయి. ఆదివారం కావడంతో వీక్షించేందుకు వచ్చిన జనంతో హుస్సేన్‌సాగర్, నెక్లెస్‌రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఎయిర్‌షో భాగంగా విమానాలు త్రివర్ణ పతాకంలోని రంగులను విరజిమ్మాయి! ఒక్కసారిగా నింగి మూడు రంగుల జెండా రూపును సంతరించుకోవడంతో వీక్షకుల మనసు దేశభక్తితో ఉప్పొంగి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు! విన్యాసాల్లో భాగంగా రెండు విమానాలు ప్రేమ చిహ్నాన్ని (లవ్ సింబల్) వేయగా మరో విమానం బాణం గుర్తుతో



ఎయిర్ షోను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మధ్యలోంచి దూసుకెళ్లడంతో వీక్షకులు ఈలలు వేశారు. ఎయిర్‌షో నిర్వహించిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బృందానికి రేవంత్ అభినందనలు తెలిపారు.

అలరించిన జానపదాలు, స్కిట్లు!

ప్రజా విజయోత్సవాల సందర్భంగా తెలంగాణ సంస్కృతి, కళలు.. ఆధునిక నృత్యరీతులను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సచివాలయం, ఐమాక్స్ థియేటర్, నెక్లెస్‌రోడ్డు వద్ద మూడు పెద్ద వేదికల్లో ఈ ప్రదర్శనలు సాగాయి. తెలంగాణ జానపదాలు, చిందు గానం, బోనాలు, భరతనాట్యం, పేరిణి నృత్యం, డ్రామాలు, స్కిట్లు, సినిమా పాటల ప్రదర్శన వీక్షకులను మరో లోకంలోకి తీసుకెళ్లింది. వడ్డె శంకర్ జానపద గీతాలు, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలను వీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి వేదికపైకి వెళ్లి కళాకారులను అభినందించారు. అలాగే ప్రముఖ హోటళ్ల యజమానులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. పిస్తాహౌజ్, ప్యారడైజ్, నిలోఫర్, ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వాహకులతో మాట్లాడారు.

నెక్లెస్ రోడ్డులో 'హానర్ రన్'

దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళిగా, సాయుధ దళాలకు మద్దతుగా నిలబడేందుకు భారత సైన్యం ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో ఆదివారం 'హానర్ రన్' నిర్వహించారు. ఈ ఈవెంట్‌ను 12.5 కి.మీ, 10 కి.మీ, 5 కి.మీ, 4 కి.మీ రూపంలో వేర్వేరుగా నిర్వహించారు. మొత్తంగా 1200 మంది రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ పాల్గొన్నారు. సీనియర్ మిలటరీ అధికారులతో పాటు వెటరన్స్‌తో కలిసి పౌరులు ఈ రన్‌లో పాల్గొన్నారు.

వాయుసేన సేవలు స్ఫూర్తిదాయకం:ఉత్తమ్

దేశ సరిహద్దుల్లో భారత వాయుసేన అందిస్తున్న సేవలు అనిర్వచనీయమైనవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సవాళ్లను ఎదుర్కోవడంలో వాయుసేన పాత్ర స్ఫూర్తి దాయకమని అన్నారు.

ట్యాంక్ బండ్ వద్ద వైమానిక విన్యాసాలు చేసిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి తాను వాయుసేనలో యుద్ధ విమాన పైలెట్‌గా పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో విుగ్-21,మిగ్ 23 వంటి అడ్వాన్స్ యుద్ధ విమానాలను నడుపుతూ దేశభద్రతకు పని చేయడం గర్వకారణంగా ఉందన్నారు. వాయుసేనకు సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం గర్వకారణమని కొనియాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

రెవెన్యూ శాఖ పునరుద్ధరణలో భాగస్వాములవుతాం: ఉద్యోగుల జేఏసీ

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో రెవెన్యూ ఉద్యోగులందరం భాగస్వాములమవుతామని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఉద్యోగ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను ఎత్తివేయడంతో అది నిర్వీర్యమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరణ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రెవెన్యూ ఉద్యోగులను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ సంఘాన్ని (టీజీఆర్ఎస్ఏ) ఏర్పాటు చేశామని, ఇందులో ఇప్పుడు అన్ని స్థాయిల్లో పని చేసే రెవెన్యూ ఉద్యోగులను కలుపుతున్నామన్నారు. ఉద్యోగులను ఐక్యం చేసి సమస్యల పరిష్కారానికి ఇది పని చేస్తుందని తెలిపారు. టీజీఆర్ఎస్ఏ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బాణాల రాంరెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూశాఖలో క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది తగ్గిపోయారన్నారు. టీజీఆర్ఎస్ఏ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా భిక్షం ఎన్నికయ్యారు.

ఏడాది కిందటే బీఆర్ఎస్‌కు 'డిశ్చార్జి షీట్'

» పదేళ్ల పాలనతో ప్రజలు విసుగుచెందారు

» 4.68 లక్షల ధరణి దరఖాస్తుల పరిష్కారం

» రెవెన్యూ వ్యవస్థపై 3 రోజుల్లో నిర్ణయం

» ప్రగతి నివేదిక విడుదలలో పొంగులేటి



హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై ప్రజలు విసుగుచెంది ఏడాది కిందటే ఆ పార్టీకి 'డిశ్చార్జి షీట్' ఇచ్చారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ వేసిన చార్జిషీట్‌పై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్య చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలన విజయోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం పొంగులేటి సచివాలయంలో ప్రగతి నివేదికను విడుదల చేసి, మీడియాతో మాట్లాడారు. పోలీసులను పార్టీ కార్యకర్తలుగా వాడుకోవడం, ప్రతిపక్షాల ఫోన్లు ట్యాప్ చేయించడం, డబ్బు మూటలు పట్టుకొచ్చిన వారిని తప్ప ఎవరినీ కలవకపోవడం, ప్రజలు నోరు తెరవకుండా ధర్నా చౌక్‌లను ఎత్తేయడం కేసీఆర్‌కే చెల్లిందన్నారు. ఎర్రవెల్లిని రాజధానిగా, ఫాంహౌస్‌ను సచివాలయంగా చేసుకుని ఎవరి మాటా వినకుండా రాష్ట్రాన్ని తన ఇష్టమొచ్చినట్లు పాలించిన కేసీఆర్.. ఆధునిక తుగ్లక్ అని విమర్శించారు. ప్రజల మధ్య ఉండి పాలన చేసే వారు తుగ్లక్కా.. ఫాంహౌస్‌లో ఉండి పాలించినవారు తుగ్లక్కా అని ప్రశ్నించారు. తుగ్లక్ అంటే ఇలా ఉంటాడని పదేళ్ల పాటు ప్రజలకు సినిమా వేసి మరీ చూపించారన్నారు.

సామాన్యులకు అందుబాటులోకి..

రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల ప్రగతి నివేదికను పొంగులేటి విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ధరణి పోర్టల్ ప్రక్షాళన చేపట్టామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి 2.46 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ధరణి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజల్లో విశ్వాసం ఏర్పడడంతో కొత్తగా 3.16 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటివరకు వచ్చిన మొత్తం 5.62 లక్షల దరఖాస్తుల్లో 4.68 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని వివరించారు. గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దుచేసి గ్రామీణ ప్రాంతాల్లో సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని పొంగులేటి విమర్శించారు. రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని, రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు.

ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగేళ్లలో సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. మొదటి విడతలో ఈ ఏడాది నియోజకవర్గానికి 3,500 నుంచి 4,000 ఇండ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉండిపోయిన 34,544 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రూ.305 కోట్లతో పూర్తి చేసి అర్హులకు అందజేస్తామన్నారు.

మొబైల్ 'మీ సేవ'

» ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే 150 రకాల సేవలు

» యాప్, టీ ఫైబర్ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



మీ సేవా మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అధికారులు

హైదరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికత ద్వారా రైతులకు మెరుగైన సేవలు దక్కేలా, మహిళా సాధికారత, యువత నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తామని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా 150 రకాల పౌర సేవలను పొందేలా రూపొందించిన మొబైల్ మీ సేవ యాప్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. మీ సేవ ద్వారా ఇప్పటికే 400 పైగా సేవలు అందుతున్నాయని, అదనంగా గ్యాప్ సర్టిఫికెట్, మైనార్టీ, ఆదాయ, క్రీమీలేయర్, నాన్ క్రీమీలేయర్ ధ్రువపత్రాలు, టింబర్ డిపో, కట్టెల మిల్లుల అనుమతల పునరుద్ధరణ పత్రాలను చేర్చామన్నారు. మీ సేవ యాప్, టీ ఫైబర్ ప్రారంభం, పలు కంపెనీలతో పెట్టుబడుల ఒప్పందాలపై హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు రుణ మాఫీ, బోనస్ కోసం మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించినట్లు వివరించారు. ప్రధాన కేంద్రాలు, రద్దీ ప్రాంతాల్లో మీ సేవతో అవసరమైన పత్రాలు పొందేందుకు కియోస్క్‌లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయం కల్పించే టీ-ఫైబర్‌ను రాష్ట్రం నలుమూలలకు విస్తరిస్తామని చెప్పారు. దీని ద్వారా మొబైల్, కంప్యూటర్, టీవీ వినియోగించవచ్చన్నారు. ఈ సేవలను పరిశీలించి మరింత సౌకర్యంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. టీ ఫైబర్ ద్వారా సంగారెడ్డి జిల్లా శ్రీరాంపూర్ వాసులతో మాట్లాడారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానికులతోనూ సంభాషించారు. మద్దూరు, సంగుపేటల్లోనూ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ప్రారంభించారు. మద్దూరు సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లోనిదని, మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా బ్రాడ్‌బ్యాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారని శ్రీధర్‌బాబు తెలిపారు. స్మార్ట్ అగ్రి క్రెడిట్-ఫైనాన్స్, భూమి పోషకాల నిర్వహణపై సలహాలు, తెగుళ్లు, వాతావరణ మార్పులపై సూచనలు, వ్యవసాయ రికార్డుల డిజిటలైజేషన్ చేస్తున్నామని మంత్రి చెప్పారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ బారినపడకుండా మిత్ర అనే యాప్‌ను తెచ్చారు.

7,592 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో రూ.7,592 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. ఏరో స్పేస్, రక్షణ రంగాల్లో అజాద్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన భూపతిరాజు తొలి దశలో రూ.300 కోట్లు, రెండో దశలో రూ.500 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు. 600 మందికి ఉపాధి కల్పించే ఈ సంస్థకు ప్రభుత్వం 25 ఎకరాలు కేటాయించింది. రూ.1950 కోట్లతో సోలార్ అల్యూమినియం ప్యానెల్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటుపై ప్రీమియర్ ఎనర్జీస్ ఎండీ రేవతి రోహిణి ఒప్పందం చేసుకున్నారు. 1500 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమకు 125 ఎకరాలు కేటాయించారు. రూ.3,342 కోట్లతో ఎంఎక్స్ ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 4 గిగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 1000 మందికి ఉపాధి దొరకనుంది. లెన్స్‌కార్ట్ ప్రతినిధి అమిత్ చౌదరి రూ.1500 కోట్లతో పరిశ్రమ స్థాపనకు ఒప్పందం చేసుకున్నారు. ప్రతిపాదనలు పంపిన 48 గంటల్లో భూమిని కేటాయించారని తెలిపారు.

ఏడీఈఎక్స్‌తో 2 రోజుల్లోనే రుణం


రైతులకు సత్వర సేవలందించేందుకు అగ్రికల్చర్ డేటా ఎక్స్ఛేంజీ (ఏడీఈఎక్స్) అప్లికేషన్ దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా లబ్ధి పొందిన రైతులతో మాట్లాడారు. గతంలో రుణం తీసుకునేందుకు 35 రోజులు పట్టగా ఏడీఈఎక్స్ సహకారంతో 2 రోజుల్లోనే పొందినట్లు రైతులు వివరించారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు తరలిరండి

» కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలకు మహేశ్‌గౌడ్ పిలుపు

» బీజేపీ, బీఆర్ఎస్ దొందూ దొందే..: మధు యాష్కీ

» నేడు గాంధీభవన్‌లో సోనియా జన్మదిన వేడుకలు



హైదరాబాద్/న్యూఢిల్లీ/మన్సూరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం సచివాలయంలో తలపెట్టిన తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లతో జూమ్ యాప్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని, మెజారిటీ ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలకు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారన్నారు. అలాగే ఉత్సవాల ముగింపుగా సచివాలయంలో జరగనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భారీగా తరలి రావాలని కోరారు. తెలంగాణ అమరవీరుల జ్యోతి రూపశిల్పి, తెలంగాణ తల్లి విగ్రహ సహ రూపశిల్పి రమణారెడ్డిని తన నివాసంలో మహేశ్ గౌడ్ సన్మానించారు. తెలంగాణ తల్లి విగ్రహంలో అమరవీరుల పిడికిళ్లను జోడించడం స్ఫూర్తినీయం గా ఉందని కొనియాడారు. బీఆర్ఎస్, బీజేపీలు దొందూ దొందేనని.. ఆ పార్టీల నేతలు కాంగ్రెస్ సర్కారుపై అక్కసు వెళ్లగక్కడమే పనిగా పెట్టుకున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీ అయ్యుండి మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేయకుండా.. బీజేపీకి మద్దతుగా నిలిచిందని విమర్శించారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని సితార గ్రాండ్ హోటల్‌లో రోడ్డు, రవాణా కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, పార్టీ నేత రాజశేఖర్‌రెడ్డితో కలిసి యాష్కీ మీడియాతో మాట్లాడారు. సరూర్‌నగర్ బీజేపీ సభలో ఆ పార్టీ అధ్యక్షుడు నడ్డా కాంగ్రెస్ సర్కారుపై చేసిన వ్యాఖ్యలను ప్రజలు ఏ మాత్రం విశ్వసించబోరని చెప్పారు. అసలు ఆ సభలో ఫ్లెక్సీలు, ఖాళీ కుర్చీలే తప్ప ప్రజలెక్కడ కనిపించలేదన్నారు. గత 11 ఏళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలిచ్చి నెరవేర్చలేదని.. అలాంటి బీజేపీని ప్రశ్నించలేని బీఆర్ఎస్ నేతలు ఏడాది కాంగ్రెస్ పాలనపై ఆరోపణలు గుప్పించడం సిగ్గుచేటన్నారు. కాగా ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు టీపీసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారని వెల్లడించింది. కార్యక్రమంలో భాగంగా మెగా రక్తదాన శిబిరంతో పాటు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందజేయనున్నట్లు పేర్కొంది.

తెలంగాణ దేశానికే ఆదర్శం: జితేందర్‌రెడ్డి

సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. ఏడాదిలోనే ఎన్నో హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని చెప్పారు. వచ్చే నాలుగేళ్ల ప్రజలకు స్వర్ణయుగమేనని వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం శరవేగంగా దూసుకుపోతోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆరు గ్యారెంటీల్లో రెండింటిని అమలు చేశామన్నారు.

17న నగరానికి రాష్ట్రపతి ముర్ము

» శీతాకాల విడిది కోసం రాక



అల్వాల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17న హైదరాబాద్‌కు రానున్నారు. 21వ తేదీ వరకు ఆమె ఇక్కడే ఉండనున్నారు. 17న మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఆమె నగరానికి చేరుకుంటారు. 18, 19 తేదీల్లో రాష్ట్రపతి నిలయంలోనే ఉంటారు. 20న సికింద్రాబాద్ సైనిక్‌పురిలోని సీడీఎం కాలేజ్‌లో నిర్వహించే 'కలర్స్ ప్రజెంటేషన్' కార్యక్రమంలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం 4-5 గంటల మధ్య రాష్ట్రపతి నిలయంలో వివిధ రంగాల ప్రముఖులు, అధికారులతో కలిసి ఆమె తేనీటి విందులో పాల్గొంటారు. 21న ఉదయం కోఠి ఉమెన్స్ కళాశాలను సందర్శించి కళాశాల అవరణలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం బేగంపేట్‌కు చేరుకొని ఢిల్లీకి బయలుదేరుతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, కంటోన్మెంట్ బోర్డు సీఈవోల పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు.

వారానికి రెండు రోజులు సాగర్-శ్రీశైలం లాంచీలు!

నాగార్జునసాగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ నుంచి ఆధ్యాత్మిక శైవక్షేత్రం శ్రీశైలానికి ఇకపై వారానికి రెండు రోజులు లాంచీలు నడపనున్నట్లు పర్యాటక శాఖ వాటర్ ఫ్లీట్ జీఎం ఇబ్రహీం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నవంబరు 2న సాగర్-శ్రీశైలం లాంచీ ట్రిప్పులను ప్రారంభించామని, వారానికి ఒక ట్రిప్పు చొప్పున ఇప్పటి వరకు 6 ట్రిప్పులు నడిపి 800మందిని శ్రీశైలం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి మంగళ, శనివారాల్లో సాగర్-శ్రీశైలం లాంచీలు నడుపుతామని తెలిపారు. ఒకవైపు టికెట్ ధర పెద్దలకు రూ.2,000, పిల్లలకు(12 ఏళ్లలోపు) రూ.1,600, రెండువైపులా టికెట్ ధర పెద్దలకు రూ.3,000, పిల్లలకు రూ.2,400గా నిర్ణయించినట్లు చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరుమల్ రెడ్డి

త్వరలో జరగనున్న కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఇన్నారెడ్డి తిరుమల్ రెడ్డిని ఎంపిక చేసినట్లు సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ యూనియన్ బలపరిచే అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో ఆయన ఉంటారని పేర్కొన్నారు. ఇటీవలే సీపీఎస్ తరఫున వరంగల్-నల్గొండ-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొలిపాక వెంకటస్వామిని సీపీఎస్ సంఘం ప్రతిపాదించిందని, రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బరిలో ఉన్న అభ్యర్థులను సీపీఎస్ సభ్యులు గెలిపించాలని కోరారు.

రెండో రోజూ పట్నం నరేందర్‌రెడ్డి విచారణ

వికారాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనపై కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు రెండో రోజు ఆదివారం కూడా విచారించారు. చర్లపల్లి జైలు నుంచి శనివారం తీసుకువచ్చిన పోలీసులు ఆయనను వికారాబాద్‌లోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో విచారించారు. మల్టీజోన్-2ఐజీ సత్యనారాయణ సమక్షంలో ఎస్పీ నారాయణరెడ్డి పర్యవేక్షణలో కేసు విచారణాధికారి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆయనను పలు కోణాల్లో ప్రశ్నించా. కోర్టు ఆదేశాలమేరకు న్యాయవాది సమక్షంలోనే ఈ విచారణ జరిగింది. సోమవారం ఉదయం నరేందర్‌రెడ్డిని కొడంగల్ కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ దాడి కుట్ర పూరితంగా జరిగిందని భావిస్తున్న పోలీసులు దీని వెనుక ఎవరున్నారనేదానిపై ఆరా తీస్తున్నారు.

బకెట్ దందాతో ప్రభుత్వ ఆదాయానికి గండి

బర్కత్‌పుర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీజీఎండీసీ సహకారంతో ములుగు, కొత్తగూడెం, పెద్దపల్లి ఇసుక క్వారీలలో కొందరు అక్రమార్కులు బకెట్ దందాకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలంగాణ మైన్స్ అండ్ సాండ్ లారీ అసోసియేషన్ ఆరోపించింది. ఇసుక లారీలపై విజిలెన్స్, మైనింగ్, ఆర్టీఏ దాడులు వెంటనే నిలిపివేయాలని, క్వారీల్లో ఇసుక ఓవర్‌లోడ్ చేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ఇసుక లారీ యజమానుల సమస్యలు-ప్రభుత్వ వైఖరి' అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సులో అసోసియేషన్ అధ్యక్షుడు సురభి దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పి.యాదగిరిగౌడ్, ప్రధాన కార్యదర్శి జె.పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. బకెట్ దందాతో ఇసుక లారీల్లో 7 నుంచి 10 టన్నులు అధికంగా లోడ్ చేస్తున్నారన్నారు. ఆర్టీఏ, పోలీసుల దాడులు పెరిగిపోయి అధిక లోడ్ కారణంగా చేయని తప్పునకు లారీ యజమానులు శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కొందరు దళారులు ఒక్కో లారీ నుంచి రూ.7-8 వేలు బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

శబరిమలకు 34 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తుల రద్దీ మేరకు వచ్చే జనవరి, ఫిబ్రవరిలో శబరిమలకు వెళ్లి రావడానికి వేర్వేరు స్టేషన్‌ల నుంచి 34 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 2025 జనవరి 7, 14, 21, 28 తేదీల్లో హైదరాబాద్-కొట్టాయం (07065), 8, 15, 22, 29 తేదీల్లో కొట్టాయం-సికింద్రాబాద్ (076066), 3, 10, 17, 24, 31 తేదీల్లో మౌలాలి-కొట్టాయం(07167), 4, 11, 18, 25, ఫిబ్రవరి1 తేదీల్లో కొట్టాయం-సికింద్రాబాద్(07168), జనవరి 5, 12, 19, 26 తేదీల్లో కాచిగూడ-కొట్టాయం(07169), 6, 13, 20, 27 తేదీల్లో కొట్టాయం-కాచిగూడ (07170), 4, 11, 18, 25 తేదీల్లో మౌలాలీ-కొల్లం(07171), 6, 13, 20, 27 తేదీల్లో కొల్లం-మౌలాలిలకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. కాగా అయోధ్య, కాశీ తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకునే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ఈనెల 11న సికింద్రాబాద్‌స్టేషన్ నుంచి భారత్ గౌరవ్ రైలును ఏర్పాటు చేసింది.

'పుష్ప 2' తొక్కిసలాట కేసులో ముగ్గురి అరెస్టు

చిక్కడపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో బాధ్యులైన ముగ్గురు వ్యక్తులను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. థియేటర్ యజమానుల్లో ఒకరైన సందీప్, సీనియర్ మేనేజర్ నాగరాజు, థియేటర్ బాల్కనీ ఇన్‌చార్జ్ గందకం విజయచందర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఏసీపీ ఎల్.రమేష్ కుమార్ తెలిపారు. నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించామన్నారు.

అరికాళ్లూ పట్టేస్తాయి

» ముఖం, కళ్లు కూడా స్కానింగ్

» ఐదు ఠాణాల్లో పైలట్ ప్రాజెక్టు

» డేటా ఇతర రాష్ట్రాలతో పంపకం

» రష్యా నుంచి టెక్నాలజీపై శిక్షణ



హైదరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నేరం జరిగిన వెంటనే నిందితుడిని పట్టుకోవడం పోలీసులకు పెద్ద సవాల్. ఆ తర్వాత ఇంకా ఏమైనా ఘటనలతో వారికి సంబంధం ఉందా అని వేలిముద్రల స్కానింగ్‌తో తెలుసుకుంటారు. అయితే, వారు చేతులకు గ్లవ్స్ వాడితే కొంత ఇబ్బందే. ఈ పరిస్థితి నివారణకు ఇకమీదట కాలిముద్రలు కూడా తీసుకోవాలని రాష్ట్ర పోలీసులు నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేషనల్ ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ అమలు చేస్తున్నారు. దీనిప్రకారం నేరగాళ్లు ఎక్కడ దొరికినా వారి వేలిముద్రలను తీసుకుంటున్నారు. దీనికి అదనంగా ఆటోమేటెడ్ మల్టీమోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌ను రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని మాదాపూర్, ఎల్బీనగర్, పంజాగుట్టతో పాటు హనుమకొండ, సిద్దిపేట పోలీసు స్టేషన్లలో ప్రారంభించారు. దీని ప్రకారం నిందితుల అరచేతి ముద్రలతో పాటు వారి ముఖం, కళ్లు, అరికాళ్లనూ స్కాన్ చేస్తారు. చేతి రాత, సంతకం, ఒడ్డు పొడవు, బరువును కూడా నమోదు చేసి డేటా రూపొందిస్తారు. ఈ సమాచారాన్ని దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న క్రైమ్ అండ్ క్రిమినల్ నెట్‌వర్క్ ట్రాకింగ్ సిస్టమ్(సీసీఎన్‌టీఎస్)తో పంచుకుంటారు. ఆన్‌లైన్‌తో అనుసంధానమైన పోలీసు స్టేషన్లన్నింటితో సీసీఎన్‌టీఎస్ ద్వారా నేరగాళ్ల సమాచారాన్ని పోల్చి చూసుకుంటారు. కాగా, తెలంగాణలోని వేలి ముద్రల (ఫింగర్ ప్రింట్) బ్యూరోలో 11 లక్షలకు పైగా నేరగాళ్ల డేటా ఉంది. ఇప్పుడు ముఖం, కళ్లు, అరికాళ్ల ముద్రలను సేకరించడం ద్వారా.. ముఖానికి మాస్క్ వేసుకున్నా కళ్లను బట్టి నిందితులను పట్టుకోవచ్చు. చేతికి గ్లవ్స్ వేసుకుంటే అరికాళ్ల ముద్రలతో గుర్తించవచ్చు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇప్పటివరకు రష్యా వినియోగిస్తోంది. ఆ దేశ నిపుణుల నుంచి తెలంగాణ వేలిముద్రల (ఫింగర్ ప్రింట్స్) బ్యూరో సిబ్బంది శిక్షణ తీసుకున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం

మార్పు మూర్ఖత్వం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు ఆవశ్యకత, పరిస్థితులను అందరికీ తెలియజేయాలని సూచించారు. ఆనాడు తెలంగాణ తల్లి విగ్రహం నింపిన స్ఫూర్తి గురించి తెలియజెప్పాలన్నారు. మార్పులు చేసుకుంటూ పోతే ఎలా? అని ప్రశ్నించారు. ఫార్మా సిటీని ఎందుకు ప్రతిపాదించామన్న దానిపై పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను వివరించాలన్నారు. కాంగ్రెస్ నిర్బంధ పాలన, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రొటోకాల్ అంశంపై సమావేశాల్లో ప్రస్తావించాలని చెప్పారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, అంశాల వారీగా నిలదీయాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఆధారంగా వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగట్టాలని, ఆరు గ్యారెంటీల చట్టబద్ధత కోసం పోరాడాలని, రెండు విడతల రైతుబంధు ఇవ్వాల్సిందిగా పట్టుబట్టాలని సూచించారు.

ప్రజలందరి గొంతుకగా పోరాడాలి..

అసెంబ్లీలో రాష్ట్ర ప్రజలందరి గొంతుకగా పోరాడాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచించారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, ధాన్యానికి బోనస్, గురుకులాల్లో సమస్యలు, లగచర్ల ఘటన, రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కొనసాగిస్తున్న నిర్బంధకాండపై గట్టిగా పోరాడాలన్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని, లగచర్ల బాధితులను విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఓట్ల కోసం రాష్ట్ర ప్రజలను మోసంగించిన కాంగ్రెస్ సర్కారు వైఖరిని ఎండగట్టేందుకు ఫిబ్రవరిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కేసీఆర్ తెలిపారు. "ఏడాదిపాటు అవకాశం ఇచ్చి చూశాం. హామీలు అమలు చేయకపోగా.. పలు పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలేదు. ఈ అసమర్థ ప్రభుత్వంపై ప్రజల పక్షాన నిలికి పోరాడదాం" అని కేసీఆర్ పిలుపునిచ్చారు. కాగా, బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో పరిస్థితులపై ఐదుగురు సభ్యుల కమిటీ సిద్ధం చేసిన నివేదికను ఆదివారం కేసీఆర్‌కు అందజేశారు. ఈ కమిటీ ప్రతినిధులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, బాల్క సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆంజనేయులు గౌడ్, వాసుదేవరెడ్డి క్షేత్రస్థాయిలో గుర్తించిన విద్యార్థుల ఇబ్బందులు, సమస్యలను విద్యార్థి నాయకులు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు వివరించారు.



ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

ప్రభుత్వాన్ని నిలదీస్తాం: కేటీఆర్

అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల తరఫున అన్ని విషయాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటివరకు రైతుభరోసా ఇవ్వలేదని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిగా కొనుగోళ్లు జరపడంలేదని, రుణమాఫీ అరకొరగా చేసి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. విజయోత్సవాల పేరిట రైతాంగాన్ని దగా చేస్తోందన్నారు. గురుకుల పాఠశాలల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులు, బలహీనవర్గాల పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. రైతులు, గిరిజనులు, దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, నిర్బంధాలు, అరెస్టులపైనా అసెంబ్లీలో నిలదీస్తామని చెప్పారు. ఓవైపు హైదరాబాద్ ఫార్మాసిటీ పేరిట 14 వేల ఎకరాలు సేకరించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో పెట్టినప్పటికీ మరోసారి ఫార్మాసిటీ పేరిట భూములు లాక్కునే ప్రయత్నం చేస్తోందని తప్పుబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, దీనిపై అసెంబ్లీలో మాట్లాడుతామన్నారు. తాజా మాజీ సర్పంచుల బిల్లులు, దళితబంధు, బీసీలకు 42% రిజర్వేషన్లు, రూ.లక్ష కోట్ల బడ్జెట్, 420 హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, సునీతా లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి అనంతరం అసెంబ్లీకి

అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు చేరుకోవాలని పార్టీ అధినేత కేసీఆర్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఉదయం 9:30 గంటలకు వారు అమరవీరుల స్థూపం వద్దకు చేరుకోనున్నారు. అక్కడ నివాళులర్పించిన అనంతరం అసెంబ్లీ సమావేశాలకు వెళ్లనున్నారు

కేసీఆర్‌ను కలిసిన బీజేపీఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి



కూతురి వివాహానికి ఆహ్వానం

మర్కుక్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో బీజేపీఎల్పీ నేత, నిర్మల్ శాసన సభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి భేటీ అయ్యారు. ఆదివారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తన కూతురి వివాహానికి రావాలని కేసీఆర్‌ను మహేశ్వర్ రెడ్డి ఆహ్వానించారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం జరుగుతున్న సమయంలోనే మహేశ్వర్ రెడ్డి ఫామ్‌హౌజ్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

సచివాలయంలో కాదు.. గాంధీభవన్‌లో పెట్టుకోండి

తెలంగాణ తల్లి విగ్రహ మార్పును అంగీకరించం: జగదీశ్ రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని తాము అంగీకరించేది లేదని, ఆ విగ్రహాన్ని సచివాలయంలో కాకుండా కాంగ్రెస్ కార్యాలయం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ అంటే రేవంత్ రెడ్డికి వణుకు వస్తోందని, అందుకే సీఎం అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. శనివారం నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రారంభోత్సవాలన్నీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రారంభించినవేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త ప్రాజెక్టుల కోసం ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదని ఆరోపించారు.

కాంగ్రెస్ హామీలపై చర్చకు పట్టుబడతాం

» బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పట్టుబడతామని బీజేఎల్పీ ఉపనేత పాయల శంకర్ తెలిపారు. ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని చెప్పారు. సోమవారం నుంచి అసెంబ్లీ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆదివారం శంకర్ అధ్యక్షతన పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని శంకర్ ఆరోపించారు. మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్ల కూల్చివేత, రైతుల నుంచి బలవంతంగా భూసేకరణపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ హరీష్‌బాబు, కే వెంకటరమణారెడ్డి, సూర్యనారాయణగుప్తా, రామారావు పాటిల్ పాల్గొన్నారు. తన కుమార్తె వివాహ వేడుకల కారణంగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమావేశానికి హాజరుకాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆర్మూరు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా స్థానికంగా లేకపోవడంతో రాలేదని పేర్కొన్నాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సంబురాల పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఒక ప్రకటనలో విమర్శించారు.



వీల్‌చైర్‌లో ఉన్న మామపై కోడలు దాడి చేస్తున్న దృశ్యం

వీల్‌చైర్‌లోని వృద్ధుడిని చెప్పుతో కొడుతూ..

దివ్యాంగుడైన మామపై కోడలి దాష్టీకం

సామాజిక మాధ్యమాల్లో వీడియోలో వైరల్

వేములపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన పేరిట ఉన్న భూమిని కొంతకాలంగా సాగుచేసుకుంటున్నా కౌలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించినందుకే మామపై కోడలు ఆగ్రహంతో ఊగిపోయింది! ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నాడని, పైగా దివ్యాంగుడని, ఇతరుల సాయం లేనిదే కదల్లేడనే విచక్షణ మరిచిపోయి దాడి చేసింది. ఆ వృద్ధుడు చేతులు అడ్డుపెడుతున్నా చెప్పుతో పదే పదే కొట్టింది. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెంలో ఇటీవల ఈ ఘటన జరిగింది. ఆ కోడలి దాష్టీకం తాలూకు వీడియో నెట్‌లో వైరల్ అవుతోంది. అయితే ఆ వృద్ధుడు పెంచుకుంటున్న శునకం, ఆ విశ్వాసంతోనే దాడి చేస్తున్న కోడలిని పదే పదే అడ్డుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. శెట్టిపాలెం గ్రామానికి చెందిన గగనపల్లి బుచ్చిరెడ్డి-అనసూర్య దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్‌రెడ్డికి, చిన్న కుమారుడు శేఖర్‌రెడ్డికి బుచ్చిరెడ్డి దంపతులు చెరో మూడెకరాలు రాసిచ్చారు. బుచ్చిరెడ్డి తన పేరిట 20 గుంటలు, భార్య పేరిట 3.1 ఎకరాలు ఉంచుకున్నాడు. ఈ భూమిని కూడా కొడుకులే సాగు చేసుకొని, ప్రతిగా కౌలు ఇవ్వాలనేది పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం. అయితే ఏడాదిగా కౌలు ఇవ్వడం లేదంటూ పెద్ద కొడుకు శ్రీనివాస్‌రెడ్డి, కోడలు మణిమాలను గతనెల 20న బుచ్చిరెడ్డి ప్రశ్నించారు. మామపై మండిపడ్డ కోడలు, ఆయనపై చెప్పుతో దాడి చేసింది. ఈ ఘటనపై మర్నాడు బుచ్చిరెడ్డి వేములపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మణిమాలపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై మణిమాల స్పందించింది. భూమి విషయమై మామను తాను నిలదీశానని, అయితే ఆయన తనపై పరుష పదజాలం వాడడంతో కోపంతో చెప్పుతో కొట్టినట్లు వివరించింది.

కాంగ్రెస్ పాలన అంతా వంచనే

ఇప్పుడు జరపాల్సింది వంచనోత్సవాలే.. రాజకీయాల్లో భాషను దిగజార్చిన రేవంత్

» తిట్లు, ఒట్లు తప్ప చేసిందేముంది?

» ఉద్యమంలోనూ ఇంత నిర్బంధం లేదు

» లంకె బిందెల కోసమే 'మూసీ': హరీశ్

» కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ ఏడాది పాలన అంతా ప్రజలను వంచించడమే సరిపోయింది. బడికి వెళ్లే చిన్నారుల నుంచి పింఛన్లు అందుకునే అవ్వ, తాతల వరకు.., నిరుద్యోగుల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల వరకు అందరినీ వంచించింది. ఇప్పుడు జరపాల్సింది విజయోత్సవాలు కాదు.. వంచనోత్సవాలు. 4 కోట్ల మంది ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి.. 3 కోట్ల దేవతలను మోసం చేయరా?" అని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఏడాది పాలన- ఎడతెగని వంచన పేరిట బీఆర్ఎస్ రూపొందించిన చార్జ్‌షీట్‌ను ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలులో సీఎం రేవంత్‌రెడ్డి ఫెయిల్ అయ్యారని, హామీలు అమలు చేయాలని అడిగితే మాట మార్చుతూ మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని నిలదీస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారన్నారు. రేవంత్ పాలనలో తిట్లు, ఒట్లు తప్పం చేసిందేం లేదని, ఉద్యమ సమయంలోనూ ఇలాంటి నిర్బంధాలు చూడలేదని పేర్కొన్నారు. తెలంగాణలో సంక్షేమాన్ని సర్వనాశనం చేసిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదని విమర్శించారు. రాజకీయాల్లో ఎవరూ ఉపయోగించని మాటల మాట్లాడుతూ.. సీఎం స్థాయికి తగని విధంగా భాషను దిగజార్చారని మండిపడ్డారు. గాంధీభవన్ వేదికగా సూచించిన అంశాలతోనే చట్టాలు తెస్తున్నారని, రాష్ట్ర పాలన అంతా అక్కడి నుంచే నడుస్తోందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని, తొమ్మిది చోట్ల మతకలహాలు చోటు చేసుకోవడమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచడం చేతకాలేదు కానీ.. కాంగ్రెస్ నేతల ఆదాయం మాత్రం పెంచుకున్నారన్నారు. ఏడాదిలోనే రేవంత్ ప్రభుత్వం లక్ష కోట్ల అప్పు చేసిందని, అభివృద్ధి పనులు చేయకుండా ఆ మొత్తాన్ని ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.4.20 లక్షల కోట్లు అప్పు చేస్తే.. రూ.7లక్షల కోట్లంటూ కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందన్నారు. కాంగ్రెస్ పాలన అంతా ఆగమాగం ఉందని, పోలీసులతో పోలీసు కుటుంబాలనే కొట్టించారని దుయ్యబట్టారు. గురుకులాల్లో కలుషిత ఆహారం తిని.. విద్యార్థులు మృతి చెందినా పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లాలో వరదలు వస్తే ఒక హెలికాప్టర్ పెట్టలేదని, ఆ జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చేతకాని దద్దమ్మలని విమర్శించారు. పైగా బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన తమపై రాళ్లదాడి చేయించారన్నారు.



రూ.1.5లక్షల కోట్లు కొట్టేసేందుకే..

మూసీ, హైడ్రా పేరుతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాంగ్రెస్ సర్కార్ దెబ్బ తీసిందని హరీశ్ రావు మండిపడ్డారు. లంకె బిందెల కోసమే మూసీ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని, రూ.1.50లక్షల కోట్లను కొట్టేయబోతున్నారని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన మాత్రమే చేయాలన్న కేసీఆర్‌ను.. మూసీలో పడి చావాలని మాట్లాడిన కుసంస్కారి రేవంత్ అని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఇళ్లు కూల్చడం తప్ప ఒక్క ఇల్లూ కట్టలేదని విమర్శించారు "మీ ఏడాది పాలనలో ఒక్క చెక్ డ్యాం అయినా కట్టారా? ఏటా 6లక్షల ఎకరాలకు ఆయకట్టు సృష్టిస్తామన్నారు కదా.. ఏడాదిలో 6,500ఎకరాల ఆయకట్టైనా కొత్తగా తెచ్చారా? పాలమూరు బిడ్డనని రెచ్చిపోయే రేవంత్.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు తట్టెడు మట్టైనా ఎత్తారా?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు కొత్తగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పెరిగిందని, రేవంత్ పాలనలో ఇరిటేషన్ పెరిగిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయానికి గ్రహణం పట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ అంటూ డబ్బా కొట్టుకోవడం సిగ్గుచేటని అన్నారు. రైతు బంధును ఎగ్గొట్టిన మోసకారి రేవంత్ అని, ధాన్యం బోనస్‌ను కూడా బోగస్ చేశారని ఆయన విమర్శించారు.

నేడు, రేపు వర్షాలు

» పలుచోట్ల ఆదివారం దంచికొట్టిన వాన

» యాదాద్రి జిల్లా బొమ్మల రామారంలో 7.5 సెంటీమీటర్ల వర్షపాతం



షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు

హైదరాబాద్, రంగారెడ్డి అర్బన్, మెదక్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని పలు జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగ మంచు ప్రభావం ఉంటుందని పేర్కొంది. వచ్చే వారం రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని పేర్కొంది. కాగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షం దంచికొట్టింది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలో 7.5, యాదగిరిగుట్టలో 6.3, మూతకొండూరులో 6.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కురిసిన వర్షానికి రహదారులు జలమయ్యాయి. ఆమనగల్లు, షాద్‌నగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. రంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో వర్షం కురిసింది. వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి బలి

బైక్‌పై వెళ్తుండగా ఇద్దరు కానిస్టేబుళ్ల మృతి

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు... తల్లి, కొడుకు దుర్మరణం

భిక్కనూరు, అశ్వారావుపేట రూరల్, గజ్వేల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరులో ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో తల్లి, కుమారుడు దుర్మరణం పాలయ్యారు. హైదరాబాద్ నుంచి బాన్సువాడకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో లక్ష్మి(49) ఆమె కుమారుడు అక్షయ్‌రెడ్డి(28) మరణించగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. వేగంగా లారీని ఢీ కొట్టడంతో కారు నుజ్జునుజ్జయి అక్షయ్‌రెడ్డి మృతదేహం అందులో ఇరుక్కుపోయింది. మరో ఘటనలో.. మారథాన్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న ప్రాణమిత్రులైన ఇద్దరు కానిస్టేబుళ్లను మృత్యువు కబళించింది. పూస వెంకటేశ్వర్లు(42), పరంధాములు(43).. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్, రాయపోల్ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు కలిసి మారథాన్‌లో పాల్గొనేందుకు బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా గజ్వేల్‌లోని జాలిగామ బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిద్దిపేట సీపీ అనురాధతో పాటు ఉన్నతాధికారులు వచ్చి మృతదేహాలకు నివాళులర్పించారు. ఘటనపై ఎమ్మెల్యే హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట పరిధిలో జరిగిన మరో యాక్సిడెంట్‌లో ఇద్దరు యువకులు చనిపోయారు. వ్యవసాయ పనుల కోసం బైక్‌పై వెళ్తుండగా వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీ కొట్టడంతో స్థానికుడు బద్దె వెంకటేశ్వర్లు, ఏపీలోని ఏలూరుకు చెందిన సాయి మనోజ్‌కుమార్‌లు దుర్మరణం చెందారు. బైక్‌పై ఉన్న వీరభద్రం అనే మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



కానిస్టేబుళ్లు పరంధాములు, వెంకటేశ్వర్లు (ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.